శుక్రవారం
2•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 264
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

రక్షణ ఎగుమతులే లక్ష్యం

తయారీరంగ పునరుద్ధరణకే మేక్ ఇన్ ఇండియా • జీరో డిఫెక్ట్‌తో అపాచీ ప్రొడక్ట్స్ • తెలంగాణ యువకులందరికీ ధన్యవాదాలు

అపాచీ హెలికాప్టర్ల విడిభాగాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్



గురువారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల ఏరోస్పేస్ సెజ్‌లో అపాచీ హెలికాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్, టాటా గ్రూప్ సంస్థల గౌరవ చైర్మన్ రతన్ టాటా. చిత్రంలో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్, భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కూడా ఉన్నారు.

రాష్ట్రంలో మూడు ఏరోస్పేస్ సెజ్‌లు

రక్షణ పరిశ్రమలకు అనువైన వాతావరణం

రక్షణ పరిశ్రమల ఉత్పత్తి కారిడార్‌ను హైదరాబాద్‌కు కేటాయించండి

కేంద్రమంత్రిని కోరిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రక్షణరంగ పరికరాల్ని దేశీయంగా తయారుచేయడమే కాకుండా ఎగుమతిచేసే దిశగా ఎదుగాలనేదే లక్ష్యమని కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 ఆగస్టు 15న ఎర్రకోట బురుజులపై నుంచి పిలుపునిచ్చిన 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం ఇదేనన్నారు. ప్రపంచంలోని తయారీదారులను భారతదేశంలో తమ ఉత్పత్తులను తయారుచేయాల్సిందిగా ప్రధాని ఈ మేరకు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. తయారీరంగాన్ని పునరుద్ధరించడమే దీని ఉద్దేశమని తెలిపారు. రక్షణరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గురువారం ఆదిభట్ల ఏరోస్పేస్ సెజ్‌లో బోయింగ్-టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) భాగస్వామ్య సంస్థ టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్) తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, టాటా సంస్థల అధిపతి రతన్ టాటాలతో కలిసి కేంద్రమంత్రి ప్రారంభించారు. అపాచీ యుద్ధ విమానాల ప్రధాన భాగాలు ఇక్కడ తయారుచేస్తారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో

• **కేసీఆర్ కిట్ అద్భుతం**



కేసీఆర్ కిట్‌గురించి రతన్‌టాటాకు వివరిస్తున్న మంత్రులు లక్ష్మారెడ్డి, కేటీఆర్

క్యాన్సర్ కేర్‌పై టాటాతో ప్రభుత్వం ఎంవోయూ

క్లిష్టమైన క్యాన్సర్ కేసులకు ఎంఎన్‌జే, నిమ్స్‌లో చికిత్స

మెడికల్ కాలేజీలు, జిల్లా దవాఖానల్లో వ్యాధి పరీక్షలు, డేకేర్ కీమోథెరపీలు

ప్రజారోగ్యంపై తెలంగాణ ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ భాగస్వామ్యంతో మరిన్ని సేవలు అందిస్తాం

రాష్ట్ర ప్రగతికి కేటీఆర్ కృషి.. ఆయనతో వేదిక పంచుకోవడం సంతోషకరం

టాటా గ్రూపు సంస్థల అధినేత రతన్‌టాటా

కేసీఆర్ పాలనలో సర్కారు దవాఖానల్లో అవయవమార్పిడి చికిత్సలు

ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

2

గృహ రుణాలు ప్రియం

• వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ
• అదేబాటలో మరికొన్ని బ్యాంకులు!

13

ఆర్థిక నేరగాళ్ల ఆస్తుల అమ్మకం

• రుణ బకాయిలు రాబట్టేందుకు కేంద్రం తాజా అస్త్రం
• 'ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్' బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
• ఆడిటింగ్ అక్రమాలపై దృష్టిపెట్టేందుకు 'ఎన్‌ఎఫ్ఆర్ఏ'
• హైదరాబాద్ సహా 8 నగరాలకు రూ.2,900 కోట్ల నిర్భయ నిధులు

2

జయేంద్ర సరస్వతి మహా సమాధి

• చంద్రశేఖరేంద్ర సరస్వతి సమాధి పక్కనే బృందావన ప్రవేశం
• కాంచీపురంలో ముగిసిన అంతిమ సంస్కారాలు
• హాజరైన తమిళనాడు గవర్నర్, కేంద్ర మంత్రులు



జయేంద్రసరస్వతి మహాసమాధి దృశ్యం

5

ఈ ఏడాదంతా అనుకూలమే!

వేసవిలో ఉష్ణోగ్రతలు పెద్దగా పెరుగవు.. అనుకున్న సమయానికే రుతుపవనాలు

అంచనాలు విడుదలచేసిన భారత వాతావరణశాఖ

లా నినో ప్రభావంతో వాతావరణం చల్లబడుతుందని వెల్లడి

రైతు వేదికలకు 300 కోట్లు

బడ్జెట్‌లో కేటాయింపునకు సీఎం గ్రీన్‌సిగ్నల్ • 2500 క్లస్టర్లలో ఒక్కో వేదికకు రూ.12 లక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా 2,500 రైతువేదికలను నెలకొల్పాలన్న ప్రభుత్వ సంకల్పం ఆచరణరూపం తీసుకుంటున్నది. రైతు వేదికల నిర్మాణాలకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తామని ఇటీవల నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సుల్లో సీఎం కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు రూ.300 కోట్లు కేటాయించేందుకు ఆయన ఆమోదం తెలిపినట్టు సమాచారం. సమావేశాలకు, ఇతర పనులకు ఉపయోగపడేలా వేదికలను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన స్థలాలను గ్రామస్థుల నుంచి విరాళాలుగా సేకరించాలని, అలా లభించనిచోట్ల ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు సీఎం కేసీఆర్ సూచించారు. ఒక్కో రైతు వేదికను రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. రైతులు, వ్యవసాయాధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, శాస్త్రవేత్తలు సమావేశమయ్యేలా ఇవి ఉపయోగపడనున్నాయి.

ఏఈవో క్లస్టర్లవారీగా వేదికలు

రాష్ట్రంలో 5 వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఆ ప్రకారం ప్రతి మూడు గ్రామాలకు ఒక ఏఈవో

మిగతా 2వ పేజీలో

16న టీహబ్‌లో వీఆర్, ఏఆర్ స్టార్టప్ పోటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐటీలో రాబోయే తరం (నెక్స్ట్ జనరేషన్) ఉపాధి అవకాశాలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేందుకు టీహబ్ సిద్ధమవుతున్నది. ఇటీవల ఫేస్‌బుక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న టీహబ్ ఈ నెల 16న ఆగ్‌మెంట్ రియాల్టీ (ఏఆర్), వర్చువల్ రియాల్టీ (వీఆర్)ల్లో స్టార్టప్‌లకు పోటీలు నిర్వహించనుంది. ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎడ్యుకేషన్, కార్పొరేట్ లర్నింగ్, మొబైల్ హార్డ్‌వేర్ & ఎనేబుల్‌మెంట్, డెవలపర్ టూల్స్ వంటి రంగాల్లో ఔత్సాహికులు తమ సృజనాత్మకతను ప్రదర్శించేందుకు టీహబ్‌లో నిర్వహించే ఈ పోటీలు వేదికగా మారనున్నాయి. ఫేస్‌బుక్, టీహబ్‌తోపాటు వివిధ ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు న్యాయనిర్ణేతలుగా హాజరుకానున్నారు. గెలిచిన విజేతలకు అవార్డులతోపాటు వివిధ వేదికల ద్వారా మార్గదర్శకం సైతం లభిస్తుందని టీహబ్ వివరించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించింది.

ఆర్థిక నేరగాళ్ల ఆస్తుల అమ్మకం

- రుణాలు రాబట్టేందుకు కేంద్రం తాజా అస్త్రం
- 'ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్' బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- ఆడిటింగ్ అక్రమాలపై దృష్టిపెట్టేందుకు 'ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ'

న్యూఢిల్లీ, మార్చి 1: వేలకోట్ల కుంభకోణాలకు పాల్పడి, దేశం విడిచిపారిపోయే ఆర్థిక నేరగాళ్లపై కొరడా ఝుళిపించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధమైంది. బ్యాంకులను మోసగించడం, ఇతర ఆర్థికనేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వారిని నేరస్థులుగా ప్రకటించడంతోపాటు, స్వాధీనం చేసుకున్న వారి ఆస్తులను అమ్మేసి రుణాలను రాబట్టుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు పలాయన ఆర్థిక నేరస్థుల (ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్) బిల్లు -2018కి కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. అలాగే ఆడిటింగ్ అక్రమాలపై పర్యవేక్షణకు నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ) అనే స్వతంత్ర సంస్థ ఏర్పాటుకు కూడా క్యాబినెట్ అంగీకారం తెలిపింది. విదేశాలకు పారిపోయే ఆర్థిక నేరగాళ్ల ఆస్తులతోపాటు, వారి బినామీల ఆస్తుల్నికూడా జప్తు చేసేందుకు ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లును తెస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆర్థిక నేరస్థుల ఆస్తుల స్వాధీనం, వాటి విక్రయానికి సంబంధించి ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జైట్లీ వెల్లడించారు. మనీలాండరింగ్ చట్టం కింద దాఖలైన కేసుల విచారణను ఈ న్యాయస్థానం చేపడుతుందని చెప్పారు. అలాగే విదేశాల్లో ఆస్తుల స్వాధీనానికి కూడా ఈ బిల్లు ద్వారా అవకాశం కలుగుతుందని, అయితే అందుకు ఆయా దేశాల సహకారం తప్పనిసరి అని తెలిపారు. 'ఆడిటర్ల, ఆడిటింగ్ సంస్థల అక్రమాలను నిరోధించేందుకే స్వతంత్ర నియంత్రణ సంస్థ ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా కంపెనీల చట్టం-2013లో కీలక మార్పులు, సవరణలు చేయనున్నాం. కంపెనీల చట్టంలోని సెక్షన్-132 పరిధిలోకి వచ్చే సంస్థలన్నీ ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ పరిధిలోకి వస్తాయి' అని జైట్లీ తెలిపారు. వ్యక్తిగత ఆడిటర్ల విషయంలో.. కనీసంగా లక్ష రూపాయలు లేదా తీసుకున్న ఆడిటింగ్ ఫీజుకు ఐదురెట్ల వరకు జరిమానా విధించే అధికారం ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏకు ఉంది. ఇక ఆడిటింగ్ సంస్థల విషయంలో ఇది రూ.10లక్షలు లేదా, తీసుకున్న ఫీజుకు పదిరెట్లు జరిమానా విధించవచ్చు. అయితే ఎన్‌ఎఫ్‌ఆర్‌ఏ ఏర్పాటుపై భారత చార్టెడ్ అకౌంటెంట్ల సంఘం (ఐసీఏఐ) సుముఖంగా లేదు.

త్వరితగతిన రుణాల రికవరీ

కేంద్ర ఆర్థికశాఖ రూపొందించిన 'ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్లు-2018'ను మార్చి5 నుంచి ప్రారంభం కానున్న రెండో విడుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టవచ్చునని తెలుస్తున్నది. 2017-18 బడ్జెట్ సందర్భంగా అరుణ్‌జైట్లీ ఈ బిల్లు విషయాన్ని తొలిసారిగా ప్రస్తావించారు. దీనికి సంబంధించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ గత సెప్టెంబర్‌లోనే ఆమోదం తెలిపింది. అరెస్టువారంటు జారీ అయిన వ్యక్తి నేర విచారణను తప్పించుకున్నా, విదేశాలకు పారిపోయి, తిరిగి భారత్‌కు వచ్చేందుకు నిరాకరిస్తున్నా ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్‌గా పరిగణిస్తారు. రూ.100 కోట్లకు పైబడి బ్యాంకు రుణాలు ఎగవేసిన వ్యక్తులు బిల్లు పరిధిలోకి రానున్నారు. పార్లమెంట్ ఆమోదం పొంది ఈ బిల్లు అమల్లోకి వస్తే వేలకోట్లు ముంచి విదేశాలకు పారిపోయిన మాల్యా, నీరవ్‌మోదీ వంటివారు తగిన మూల్యం చెల్లించక తప్పదు.

మహానగరాల్లో మహిళల రక్షణకు నిర్భయ నిధులు

హైదరాబాద్ సహా ఎనిమిది మహానగరాల్లో మహిళ రక్షణ కోసం రూ.2,900 కోట్ల కేటాయింపులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అధ్యక్షతన గురువారం భేటీ అయిన మహిళా సాధికారత కమిటీ హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, లక్నో మహానగరాలకు నిర్భయ నిధులను కేటాయించింది. మూడేండ్ల కాలపరిమితితో 70:30 నిష్పత్తిలో కేంద్రం, రాష్ర్టాలు ఖర్చు భరించే విధానంతో నిధుల విడుదలకు కమిటీ ఆమోదించిందని ఉన్నతాధికారి తెలిపారు. కాగా, ఈ నిధుల్లో ఢిల్లీకి రూ.663.67 కోట్లు, బెంగళూరుకు రూ.667 కోట్లు, ముంబైకి రూ.252 కోట్లు, కోల్‌కతాకు రూ.181.32 కోట్లు మంజూరయ్యాయి. 2012లో ఢిల్లీ నిర్భయ ఘటన అనంతరం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ కేంద్రం నిర్భయఫండ్‌ను ఏర్పాటుచేసింది.

రైతు వేదికలకు 300 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

నియమితులయ్యారు. ప్రస్తుతం 2,500 మంది ఏఈవోలున్నారు. మూడు గ్రామాలకు కలిపి అందరికీ అందుబాటులో ఉండే గ్రామంలో రైతు వేదికలను నిర్మించనున్నారు. గ్రామంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతల ద్వారా స్థల సేకరణ చేయాలన్న సీఎం కేసీఆర్ పిలుపునకు పలువురు స్పందిస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ, జనగామ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, గద్వాల, మెదక్, సంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లో పలువురు దాతలు స్పందించి ఎకరం చొప్పున స్థలాలను విరాళంగా ప్రకటించారు. దాతలు ప్రకటించిన స్థలాలను త్వరలోనే రెవెన్యూశాఖ పరిశీలించి వ్యవసాయ శాఖకు అప్పగించనుంది. సమావేశ మందిరాలను మైకులు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా తీర్చిదిద్దనున్నారు. ఒక్కో వేదికలో మూడు గ్రామాల రైతు సమన్వయ సమితి సభ్యులు సమావేశాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. రైతులకు శిక్షణ, పథకాలపై అవగాహన వంటివి ఈ మందిరాల్లోనే నిర్వహిస్తారు. రైతులకు సంబంధించిన ప్రతీ కార్యక్రమం ఇక్కడే నిర్వహిస్తారు. దీంతో ఏఈవో క్లస్టర్లు కీలకం కానున్నాయి. ఇప్పటివరకు కనీసం వ్యవసాయాధికారులకు కూడా మండలాల్లో పూర్తిస్థాయిలో కార్యాలయాలు లేవు. అటువంటిది మూడు గ్రామాలకు కలిపి అన్ని విధాలుగా ఉపయోగపడే వేదికలనను నిర్మిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సమగ్రంగా లబ్ధిదారులకు చేరి సంపూర్ణ ఫలితాలు వచ్చే అవకాశముంటుందని భావిస్తున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.37 గంటలకు



సూర్యాస్తమయం: 6.19 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, పౌర్ణమి ఉదయం 6.23 వరకు, తదుపరి కృష్ణపక్షం పాడ్యమి, నక్షత్రం: పుబ్బ రాత్రి 10.08 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: సాయంత్రం 4.11 నుంచి 5.47 వరకు, రాహుకాలం: ఉదయం 11.00 నుంచి 12.28 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.58 నుంచి 9.44 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.52 నుంచి 1.38 వరకు, వర్జ్యం: ఉదయం 7.14 నుంచి 8.50 వరకు, తిరిగి రాత్రి 10.31 నుంచి 12.07 వరకు.

లోకం పోకడ



థియేటర్లను ఖాళీగా ఉంచడం ఎందుకు?! మీ రాజకీయ సభలు ఏర్పాటు చేయండి సార్.. జనాలకు సిన్మా చూసినట్టుంటుంది!



బోయింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు



గురువారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో అపాచీ హెలికాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవ వేదికపై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, టాటా గ్రూప్ సంస్థల గౌరవ చైర్మన్ రతన్‌టాటా, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బోయింగ్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు లెన్నీ కారిట్, భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్, టాటా సన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిఫెన్స్ అధ్యక్షుడు బానమలి అగర్వాల్, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్



హెలికాప్టర్ల విడిభాగాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్ తదితరులు కూడా ఉన్నారు.

రక్షణ ఎగుమతులే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

ఆమె మాట్లాడుతూ టీబీఏఎల్ సంస్థ నిర్దేశిత లక్ష్యంలోపే తన కార్యకలాపాలు ప్రారంభించడంపట్ల హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచస్థాయి భాగస్వామ్యంతో దేశంలో తయారీచేపట్టడం, రక్షణరంగానికి ప్రోత్సాహమివ్వడం సంతోషకరంగా ఉందని చెప్పారు. రోబోలు తయారుచేస్తే లోపాలుండవని, అదే తరహాలో ఎటువంటి లోపాలు లేని అపాచీ హెలికాప్టర్లు ఇక్కడ తయారుచేస్తున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదిభట్లలో ఉన్న సౌకర్యాలు ఆ కచ్చితత్వాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన మానవ శక్తితోనూ లోపాలు లేని హెలికాప్టర్లు తయారు చేయవచ్చని ఇక్కడి యూనిట్ తెలియజేస్తున్నదని ప్రశంసించారు. ఇక్కడ తయారుచేసిన హెలికాప్టర్లు నాణ్యతా పరీక్షల్లో ఎలాంటి లోపాలు లేవని (జీరో డిఫెక్ట్) తేలిందన్నారు. ఈ విషయంలో సంస్థ నిర్వాహకులు, ఉద్యోగులను ఆమె అభినందించారు. 'మన తెలంగాణ యువకులందరికీ ధన్యవాదాలు. మీరు తెలంగాణలో ఎక్కడి నుంచి వచ్చినా ఇంత త్వరగా, చాలా చక్కగా ట్రైనింగ్ పొంది, ఇవాళ చిన్న ప్రొడక్ట్ కాదు.. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో ఉన్నటువంటి ప్రొడక్ట్ విషయంలో మీ వంతు కృషిచేస్తున్నారంటే చాలా గర్వంగా ఉంది' అంటూ తెలుగులో వ్యాఖ్యానించారు. రతన్ టాటా నాయకత్వంలో టాటా సంస్థ దేశ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తున్నదని ఆమె ప్రశంసించారు.

రక్షణ ఉత్పత్తుల కారిడార్ ఇవ్వండి: కేటీఆర్

రక్షణరంగ ఉత్పత్తుల తయారీకి అనువైన వాతావరణం తెలంగాణలో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను కేటాయించాలని ఆయన రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరారు. హైదరాబాద్‌లో రక్షణ ఉత్పత్తులకు దేశంలోనే అతి పెద్ద ఎకో సిస్టం ఉందని తెలిపారు. 10 డీపీఎస్‌యూలు, 25 భారీ డొమెస్టిక్ మాన్యుఫాక్చరర్స్, 1000 ఎమ్మెస్‌ఎంఈ సంస్థలున్నాయన్నారు. వర్క్‌ఫోర్స్, శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో వైమానికరంగానికి ప్రత్యేకంగా మూడు సెజ్‌లు - అదిభట్ల, నాదర్‌గుల్, శంషాబాద్‌లో ఉన్నాయన్నారు. గత ఐదేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ (ఓఈఎం) భారతదేశానికి ప్రధానంగా తెలంగాణకు, హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. తాజాగా టాటా-బోయింగ్ సంయుక్తంగా సంస్థను ఏర్పాటుచేశాయన్నారు. టాటా-బోయింగ్ సంస్థలు హైదరాబాద్‌లో తమ సంస్థను ఏర్పాటుచేసినందుకు మంత్రి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. 18 నెలల కాలంలోనే నిర్మాణాన్ని పూర్తిచేసినందుకు అభినందించారు. విడిభాగాలను తయారుచేయడమే కాకుండా హెలికాప్టర్లను పూర్తిస్థాయిలో తయారుచేసే స్థాయికి ఎదుగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బోయింగ్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు లెన్నీ కారిట్, భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్, టాటా సన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిఫెన్స్ అధ్యక్షులు బానమలి అగర్వాల్, టీఏఎస్‌ఎల్ సీఈవో సుకరణ్‌సింగ్, బోయింగ్ ఇండియా అధ్యక్షులు ప్రత్యూష్‌కుమార్, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, హైదరాబాద్ అమెరికా కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో అపాచీ హెలికాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్‌లో ఓ విభాగం

భారత్‌లో బ్రహ్మాండమైన భవిష్యత్తు

భారతదేశంలో భవిష్యత్తు అద్భుతంగా ఉండబోతున్నదని, అందుకే తాము ఇక్కడ గణనీయ స్థాయిలో పెట్టుబడులు పెట్టామని బోయింగ్ డిఫెన్స్, స్పేస్ అండ్ సెక్యూరిటీ ప్రెసిడెంట్, సీఈవో లియాన్నే కేరెట్ చెప్పారు.

ప్రపంచంలోనే ఈ తరహా ఏకైక కేంద్రం

- టీబీఏఎల్ యూనిట్‌కు 2016 జూన్ 18న శంకుస్థాపన.
- 13 ఎకరాల్లో 14వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణం.
- 350 మంది అత్యంత నిష్ణాతులైన ఉద్యోగులు.
- ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ ప్రధాన విడిభాగాల (ఫ్యూజ్‌లాజ్)ను ఉత్పత్తిచేసే ఏకైక సంస్థ.
- అమెరికా ఆర్మీ సహా వివిధ దేశాల సేనలకు బోయింగ్ సంస్థ ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్లను అందిస్తుంది.
- ఇక్కడ సెకండరీ స్ట్రక్చర్స్, మల్టీరోల్ కంబాట్ హెలికాప్టర్లకు చెందిన వర్టికల్ స్పార్‌బాక్స్‌లు కూడా ఉత్పత్తి చేస్తుంది.
- ఈ కేంద్రం నుంచి తొలి ఫ్యూజ్‌లాజ్ డెలివరీ 2018లో
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 2300 అపాచీ హెలికాప్టర్లు
- అమెరికా ఆర్మీ ఒక్కటే అపాచీ హెలికాప్టర్లను 4.3 మిలియన్ ఫ్లైట్ అవర్స్ నడిపింది. వీటిలో జనవరి 2018 నాటికి 1.2మిలియన్ ఫ్లైట్ అవర్స్ యుద్ధరంగంలో ఉన్నాయి.
- ఈ హెలికాప్టర్లను భారత్ సహా 16 దేశాల ఆర్మీ వాడుతున్నాయి.
- భారత రక్షణశాఖ బోయింగ్‌తో 22 ఏహెచ్- 64 హెలికాప్టర్ల సరఫరాకోసం 2015 సెప్టెంబర్‌లో ఒప్పందం చేసుకుంది. వీటి సరఫరా 2019లో ప్రారంభమవుతుంది.

ట్విట్టర్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జెస్టర్ సంతోషం

టాటా, బోయింగ్ సంస్థల ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరవడం సంతోషాన్ని కలిగించిందని భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్‌జెస్టర్ సంతోషం వ్యక్తంచేశారు. అమెరికా, భారత్‌ల మధ్య బలపడనున్న బంధానికి ఇది నిదర్శనమని ఆమె ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

అంతర్జాతీయ పరిశ్రమను నిర్మించిన తెలంగాణ సంస్థ

నిర్ణీత గడువు కంటే ముందే నిర్మించిన ఆర్క్ బిల్డర్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదిభట్లలో గురువారం ఆరంభమైన టాటా బోయింగ్ పరిశ్రమను సందర్శించిన కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ప్రశంసలు కురిపించారు. సుమారు 13 ఎకరాల్లో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పరిశ్రమను నిర్మించారు. నిర్ణీత గడువు ఏడాది కంటే ముందే తొమ్మిది నెలల్లో అత్యుత్తమ ప్రమాణాలతో ఈ పరిశ్రమను కట్టిన సంస్థ తెలంగాణకు చెందిన 'ఆర్క్ బిల్డర్స్' కావడం గమనార్హం. పరిశ్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టాటా సంస్థ ఉన్నతాధికారులు సైతం దేశంలోనే ఇది అత్యుత్తమ ప్రమాణాలు గల పరిశ్రమగా అభివర్ణించారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించిందని ఆర్క్ బిల్డర్స్ సంస్థ ఎండీ గుమ్మి రాంరెడ్డి ఆనందం వ్యక్తంచేశారు.



బోయింగ్ పరిశ్రమ ఉన్నతాధికారికి జ్ఞాపికను అందజేస్తున్న ఆర్క్ బిల్డర్స్ ఎండీ గుమ్మి రాంరెడ్డి

ప్రజారోగ్యంపై తెలంగాణ ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ భాగస్వామ్యంతో మరిన్ని సేవలు
- సర్కారు దవాఖానల్లో అవయవమార్పిడి చికిత్సలు
- ప్రజారోగ్యంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు
- క్యాన్సర్ కేర్‌పై టాటాతో ప్రభుత్వం ఎంవోయూ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో మరింత సేవలందిస్తామని టాటా గ్రూప్ సంస్థల గౌరవ చైర్మన్ రతన్‌టాటా పేర్కొన్నారు. టాటా ట్రస్టుల ఆధ్వర్యంలో ఇదివరకే పలు విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంతో టాటా ట్రస్ట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం గర్వకారణంగా ఉందని చెప్పారు. 'కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ మేనేజ్‌మెంట్' కార్యక్రమం కింద టాటా ట్రస్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. శంషాబాద్ నోవాటెల్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మం త్రులు కే తారకరామారావు, లక్ష్మారెడ్డి, టాటా గ్రూప్ చైర్మన్ రతన్‌టాటా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పనితీరును రతన్‌టాటా కొనియాడారు. వినూత్న ఆలోచనలతో రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్నారని కేటీఆర్‌ను ఆయన ప్రశంసలతో ముంచెత్తారు. తాను స్వయంగా ఈ సమావేశంలో పాల్గొనడానికి పలు కారణాలున్నాయని, అందులో.. ఎప్పుడూ నిత్యనూతనంగా ఆలోచనలను ఆవిష్కరించే మంత్రి కేటీఆర్‌తో వేదికను పంచుకోవడం ఒకటని రతన్‌టాటా పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని సాకారం చేసేందుకు ప్రత్యేక చొరువ చూపించారంటూ కేటీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జంషెడ్‌పూర్ తర్వాత టాటా ప్రధాన కార్యాలయాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన గుర్తుచేశారు.

సర్కారు దవాఖానల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు: కేటీఆర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సర్కారు దవాఖానల్లో అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. 'ఎన్నడూ లేనివిధంగా సర్కారు దవాఖానల్లో అరుదైన అవయమార్పిడి చికిత్సలు చేయగలుగుతున్నాం. గుండె, కాలేయ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించగలుగుతున్నాం' అని కేటీఆర్ అన్నారు. ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రత్యేక దృష్టితో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫలితంగా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. సీఎం నాయకత్వంలో వైద్యరంగంలో చాలా మార్పులు తీసుకొచ్చినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ఆ శాఖ అధికారులు చేస్తున్న కృషితో సత్ఫలితాలు సాధించగలుగుతున్నామని మంత్రి వివరించారు. టాటా గ్రూప్‌తో తెలంగాణకు ఎంతో అనుబంధం ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. క్యాన్సర్ కేర్‌లో దేశంలో తెలంగాణ నాలుగో స్థానంలో ఉందన్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రసవాల్లో ప్రభుత్వ హాస్పిటళ్లలో 31 శాతం ఉండేవని, కేసీఆర్ కిట్లతో 50 శాతానికి పైగా పెరిగాయని వివరించారు.

మైక్రోసాఫ్ట్‌తో కలిసి ఐకేర్

చిన్న వయసులోనే కంటి చూపుకోల్పోయి, భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్న చిన్నారులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థతో కలిసి రాష్ట్రంలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ కారణంగా ఎవరూ మరణించకూడదన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రత్యేక విధానాలు అవలంబిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, టాటా ట్రస్టుల మేనేజింగ్ ట్రస్టీ ఆర్ వెంకటరమణన్, ట్రస్టు ప్రతినిధులు లక్ష్మణ్ సేతుర్మన్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ అద్భుతం | రతన్‌టాటా కితాబు

శంషాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు ప్రసవానంతరం అందజేస్తున్న కేసీఆర్ కిట్‌పై టాటా గ్రూప్ సంస్థల గౌరవ చైర్మన్ రతన్‌టాటా ఆసక్తికనబర్చారు. సర్కారు దవాఖానల్లో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, కేసీఆర్ కిట్లు అందజేయడం గురించి రతన్ టాటాకు మంత్రులు లక్ష్మారెడ్డి, కేటీఆర్ వివరించిన సందర్భంగా ఆయన కేసీఆర్ కిట్‌ను వేదికపైకి తెప్పించుకుని పరిశీలించారు. కిట్‌లోని 16 వస్తువులను చూపిస్తూ, వివరించడంతో స్పందించిన రతన్‌టాటా.. ఇది చాలా అద్భుతంగా ఉందని, నిరుపేదలకు వరంలా పనికి వస్తుందని చెప్పారు.



గురువారం శంషాబాద్‌లో టాటాగ్రూప్ సంస్థల గౌరవ చైర్మన్ రతన్‌టాటా, మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డిల సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టాటా ట్రస్ట్ మధ్య క్యాన్సర్ కేర్‌పై జరిగిన ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు



నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో రతన్‌టాటాకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రులు కే తారకరామారావు, లక్ష్మారెడ్డి. చిత్రంలో టాటా ట్రస్టుల మేనేజింగ్ ట్రస్టీ ఆర్ వెంకటరమణన్

రాష్ట్రమంతటా క్యాన్సర్‌కేర్ నెట్‌వర్క్

క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలందించేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం, టాటా ట్రస్ట్ సంతకాలు చేశాయి. మూడంచెల విధానంలో విద్య, పరిశోధన సామర్థ్యాలను పెంచడం ద్వారా అత్యంత నాణ్యమైన క్యాన్సర్ కేర్ అందిస్తారు. ఈ ఒప్పందంపై ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శాంతికుమారి, టాటా ట్రస్టుల మేనేజింగ్ ట్రస్టీ ఆర్ వెంకటరమణన్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, నిమ్స్‌ను క్లిష్టమైన క్యాన్సర్ కేసులకు చికిత్స అందించేలా అభివృద్ధిచేస్తారు. క్యాన్సర్ వ్యాధి పరీక్షలు, చికిత్స విషయంలో ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ మెడికల్ కాలేజీలను బలోపేతం చేస్తారు. కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లా హాస్పిటళ్ల క్యాన్సర్ వ్యాధి పరీక్షలు, డేకేర్ కీమోథెరపీ సదుపాయాలు కల్పిస్తారు. తద్వారా రాష్ట్రమంతటా కేన్సర్‌కేర్ నెట్‌వర్క్‌ను నెలకొల్పుతారు. తత్ఫలితంగా రోగులకు ప్రస్తుత ప్రజారోగ్య వ్యవస్థలోనే మెరుగైన చికిత్స లభిస్తుంది. క్యాన్సర్ రోగులు క్లిష్ట సమయాల్లో తప్ప.. ఇతర విషయాలకు హైదరాబాద్‌కు రావాల్సిన పరిస్థితి తప్పుతుంది.










టెక్సా అవార్డులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డ్స్ (టెక్సా) 2018 దరఖాస్తులకు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ అవార్డుల కోసం సివిల్ సర్వెంట్ అధికారులు మార్చి 3 అర్ధరాత్రి 12 గంటలలోగా http://texa.telagana.gov.in/ అనే వెబ్ అడ్రస్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బాలికావిద్య, పౌష్టికాహారం, పరిపాలనలో ఐటీ సంస్కరణలు, కేసీఆర్ కిట్స్, భూరికార్డుల ప్రక్షాళన, ఘనవ్యర్థాల నిర్వహణ, గొర్రెల పంపిణీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించిన సివిల్ సర్వెంట్ అధికారులకు టెక్సా అవార్డులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొన్నది.







విభిన్న మత విశ్వాసాలు ఈ దేశ విశిష్టతను ప్రపంచానికి చాటాయి. రెండువేల ఐదువందల ఏండ్ల క్రితమే బుద్ధుడు, గత శతాబ్దంలో గాంధీ ఈ గడ్డపై నుంచి ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారత్ ప్రపంచానికి ఆదర్శం. ఉగ్రవాదంపై పోరును మతంపై జరుగుతున్నదిగా భావించరాదు.

నరేంద్రమోదీ, ప్రధాని



తమిళనాడులో ఎక్కడచూసినా మద్యం దుకాణాలే కనిపిస్తాయి. ఇవి పోస్టాఫీసుల కన్నా ఎక్కువ. ఈ మద్యం దుకాణాలన్నీ నేతలవే. వారు అప్పుడప్పుడు మద్య నిషేధం గురించి మాట్లాడుతారు. ఎందుకంటే వారికి మహిళల ఓట్లు కావాలి కదా. నిజంగా మద్య నిషేధం జరిగితే మన నేతల బాగోతం బయటపడుతుంది.

కమల్ హాసన్, మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) అధినేత

చరిత్రలో నేడు



1498

మొజాంబిక్ ద్వీపాన్ని చేరుకున్న వాస్కో డ గామా.



1855

రష్యా చక్రవర్తిగా అలెగ్జాండర్ రొమెనోవ్ పట్టాభిషేకం.



1946

వియత్నాం అధ్యక్షుడిగా హోచిమిన్

మేఘాలయలో ఓటింగ్ శాతం తగ్గడానికి అనేక కారణాలున్నాయి. పలు చోట్ల ఓటింగ్ యంత్రాలు ఇబ్బంది పెట్టాయి. పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరిన ఓటర్లు, గంటల కొద్ది నిలబడలేక ఓటేయకుండానే వెళ్లిపోయారు. రాజకీయ పక్షాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేకపోవడం వల్ల ఓటేయాలనే ఆసక్తి తగ్గిపోతున్నది. రాజకీయ పక్షాలు నిలబెట్టే అభ్యర్థుల పట్ల కూడా ప్రజలకు సదభిప్రాయం లేదు. ఓటర్లు గతంలో మాదిరిగా రాజకీయ పక్షాల సిద్ధాంతాలు ఏమిటనేది పట్టించుకోవడం లేదు. 1972 నుంచి ఏ ఒక్కపార్టీ మెజారిటీ పొందలేకపోతున్నది. ఈసారి ఫలితాలు ఆసక్తికరంగా ఉండవచ్చు.

ది షిల్లాంగ్ టైమ్స్

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసి ఇరువై రెండేండ్లు దాటినప్పటికీ, ఈ వ్యవస్థను బలపడనీయడం లేదు. తమ సూచనలను పట్టించుకోవడం లేదని కమిషన్ బహిరంగంగా వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం అధ్యక్షులను, సభ్యులను నియమించడంలో జాప్యం చేయడం ద్వారా కమిషన్ పని చేయకుండా అవరోధం కలిగించింది. ఇప్పుడు న్యాయం కోసం ప్రజలు కమిషన్‌ను ఆశ్రయించడం ఎక్కువైంది. కమిషన్‌ను సరిగ్గా పనిచేయనిస్తే, కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితి వెలుగులోకి వస్తుంది.

గ్రేటర్ కశ్మీర్

తాలిబన్‌తో చర్చలు

దశాబ్దన్నరకు పైగా భీకర యుద్ధం సాగుతున్న అఫ్ఘనిస్థాన్‌లో శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నాలు జోరందుకోవడం తాజా పరిణామం. 'కాబూల్ ప్రాసెస్' పేరిట సాగుతున్న రెండవ విడుత చర్చల సందర్భంగా తాలిబన్‌తో చర్చలకు సిద్ధమని అఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ప్రకటించారు. చర్చలకు షరతులేవీ విధించ దలుచుకోలేదని ఘనీ అన్నారు. తాలిబన్లతో చర్చలు జరుపాలన్న ప్రతిపాదనకు భారత్ కూడా మద్దతివ్వడం విశేషం. శాంతి ప్రతిపాదన ప్రకారం– తాలిబన్ ఆయుధ సన్యాసం చేయవలసి ఉంటుంది. అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వాన్ని గుర్తిస్తామని ప్రకటించాల్సి ఉంటుంది. దేశ రాజ్యాంగాన్ని కూడా ఆమోదించాలె. ఇందుకు ప్రతిగా ప్రభుత్వం తాలిబన్‌ను రాజకీయపక్షంగా గుర్తిస్తుంది. తాలిబన్ నాయకులపై ఉగ్రవాద ముద్ర తొలిగిపోతుంది. ఎన్నిల్లో పోటీ చేయవచ్చు. ఇరుపక్షాలు చర్చలకు అంగీకరిస్తే కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో, శాంతి ప్రక్రియ విధానాలు ఖరారు చేసుకోవడం కష్టమేమీ కాదు. కానీ తాలిబన్‌ను చర్చలకు దింపడం అంత సులభం కాదు. తాజా ప్రతిపాదనకు కూడా తాలిబన్ల నుంచి అనుకూల సంకేతం రాలేదు. అట్లా అని చర్చలకు సిద్ధంగా లేరని కూడా భావించలేం. తాలిబన్లు అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వాన్ని అమెరికా మద్దతుతో కొనసాగుతున్న కీలుబొమ్మల ముఠాగానే భావిస్తున్నారు. తాము అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వాన్ని గుర్తించడం లేదనీ, అమెరికాతోనే చర్చలు జరుపుతామని తాలిబన్ ప్రకటించింది. ఖతర్‌లో ఉన్న తమ కార్యాలయం ద్వారా అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తున్నది. తమ దేశాన్ని అమెరికా సేనలు ఆక్రమించడమే సమస్య కనుక, ఆ దేశంతో చర్చలు జరిపితేనే ఫలితం ఉంటుందని తాలిబన్ స్పష్టం చేసింది. దీన్నిబట్టి శాంతి ప్రక్రియ అంత సులభంగా ముందుకుపోదని అర్థమవుతున్నది.

ఈ క్రమంలో అఫ్ఘనిస్థాన్‌లో ఏదోవిధంగా శాంతిని పునరుద్ధరించాలనే అభిప్రాయం బలపడుతున్నది. అమెరికా అభ్యంతరం చెప్పే పరిస్థితి కూడా లేదు. ఇందుకు క్షేత్రస్థాయి పరిస్థితులే కారణం. అమెరికా తమ సైన్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ తన బలగాలను కొనసాగిస్తున్నది. అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వ దళాలు ఏ మాత్రం బలంగా లేవు. అమెరికా వైమానిక దాడులు చేస్తుందనే భయం లేకపోతే, తాలిబన్ కాబూల్‌ను ఆక్రమించుకోవడానికి పొంచి ఉన్నది. ప్రభుత్వ అధీనంలో మూడోవంతు భూభాగం కూడా లేదని ఇటీవల బీబీసీ అధ్యయనంలో వెల్లడైంది. గతేడాదితో పోలిస్తే తాలిబన్ ఇంకా బలపడ్డది. క్రమంగా నగర ప్రాంతాలను వశం చేసుకుంటున్నది. 2015లో కాందహార్‌లో జరిపిన దాడుల్లో అనేకమంది సైనికులు మరణించారు. గత జనవరిలో తాలిబన్ కాబూల్‌లో జరిపిన దాడిలో వంద మందికిపైగా మరణించారు. గతేడాదిలోనే ఈ ఘర్షణల్లో మూడున్నర వేల మంది మరణించగా, దాదాపు ఏడువేల మంది గాయపడ్డారు. అమెరికా అనుకూల దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఐసిస్ ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నాయనే ఆరోపణ ఉన్నది. ఈ ఐసిస్ తాలిబన్‌కు పోటీగా ఎదుగుతుందనే అభిప్రాయం ఉండేది. కానీ తాలిబన్ బలం ముందు ఐసిస్ ప్రాబల్యం ఏ మాత్రం లేదు. అమెరికా బలగాలు తాలిబన్‌ను సైనికంగా ఓడించే పరిస్థితి లేదు కనుక, ఈ యుద్ధం ఇప్పట్లో ముగింపునకు రాదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నికల ప్రచారంలో అఫ్ఘనిస్థాన్ నుంచి సైనిక దళాలను ఉపసంహరించుకుంటానని అన్నారు. కానీ ఆయన అధికారం చేపట్టిన తరువా త మాట నిలబెట్టుకోలేదు, అఫ్ఘనిస్థాన్ పరిస్థితిలో ఆశాజనక మార్పు లేదు.

తాలిబన్‌తో సాగే శాంతి ప్రక్రియలో, ఆ తర్వాత అభివృద్ధిలో అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికి బాసటగా ఉంటామని భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే హామీ ఇచ్చారు. కాబూల్ శాంతి ప్రక్రియ మొదటి విడుత చర్చలు ఏడాది కిందట జరిగాయి. తాజా కాబూల్ చర్చలకు 23 దేశాలు హాజరయ్యాయి. ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్, నాటో ప్రతినిధులు కూడా హాజరయ్యారు. గతంతో పోలిస్తే అంతర్జాతీయ సమాజంలో తాలిబన్‌ను రాజ్యాంగ పరిధిలోకి తేవాలనే దృక్పథం బలపడుతున్నది. కానీ తాలిబన్ వంటి కరడుగట్టిన సంస్థతో వ్యవహరించడానికి చాలా సహనం అవసరం.

తాలిబన్ దేశవ్యాప్తంగా బలపడే కొద్దీ ఈ సంస్థ నాయకుల వైఖరిలో మార్పు కనిపిస్తున్నది. ఇటీవల టర్క్‌మెనిస్థాన్, పాకిస్థాన్, భారత్ సహజవాయువు పైప్‌లైన్‌కు తమ ప్రాంతంలో భద్రత కల్పిస్తామని తాలిబన్ తెలిపింది. అఫ్ఘన్ ప్రజలకు లబ్ధి చేకూరే మౌలిక వసతులకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించింది. దీంతో పలు దేశాలు తమ వ్యాపార సంస్థలను దింపవచ్చునని భావిస్తున్నాయి. ఇప్పటికే మౌలిక వసతుల రంగంలో భారీ పెట్టుబడులు పెట్టిన భారత్ విదేశీ బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత, మరింత భారీగా విస్తరణ కార్యక్రమం చేపట్టాలనుకుంటున్నది. ఇనుప గనుల తవ్వకం చేపట్టి, ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలనే ప్రతిపాదన ఉన్నది. విద్యుత్ ప్రాజెక్టులు, సరఫరా వసతులు, రహదారులు నిర్మించతలపెట్టింది. భారత్ సహకారంతో నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల 75 వేల హెక్టార్ల బీళ్ళు పంటపొలాలుగా మారాయి. ఇరాన్‌లోని చబహర్ రేవు ద్వారా అఫ్ఘనిస్థాన్‌తో రవాణా ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈ నేపథ్యంలోనే తాలిబన్‌తో సాగే శాంతి ప్రక్రియలో, ఆ తర్వాత అభివృద్ధిలో అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికి బాసటగా ఉంటామని భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే హామీ ఇచ్చారు. కాబూల్ శాంతి ప్రక్రియ మొదటి విడుత చర్చలు ఏడాది కిందట జరిగాయి. తాజా కాబూల్ చర్చలకు 23 దేశాలు హాజరయ్యాయి. ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్, నాటో ప్రతినిధులు కూడా హాజరయ్యారు. గతంతో పోలిస్తే అంతర్జాతీయ సమాజంలో తాలిబన్‌ను రాజ్యాంగ పరిధిలోకి తేవాలనే దృక్పథం బలపడుతున్నది. కానీ తాలిబన్ వంటి కరడుగట్టిన సంస్థతో వ్యవహరించడానికి చాలా సహనం అవసరం.

జనగళం

ప్రతిపక్షాల అవివేకం

రాష్ట్రంలో ప్రతిపక్షాలకు తొందరెక్కువైంది. ఎప్పుడు అధికారపీఠం ఎక్కుదామా అనే అత్యుత్సాహంతో ప్రతిపక్షాలున్నాయి. దీంతోనే కాలం వెల్లదీస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఏ అభివృద్ధి పథకం చేపట్టినా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నాయి. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూడటం విడ్డూరం. ఇప్పటికైనా ప్రతిపక్షాలు ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు సహకరించాలి. ప్రభుత్వం తప్పుదోవ నడిస్తే తగు సూచనలు చేయాలే తప్పా, అడ్డంకులు సృష్టిస్తే ప్రజలు హర్షించరు. ప్రతిపక్షాలు దీన్ని గమనించాలె. దానికి అనుగుణంగా నడుచుకోవాలె.

- గాలి రవీందర్, ముంజంపల్లి, కరీంనగర్

కల్తీని అరికట్టాలె

ఎక్కడ చూసినా కల్తీ రాజ్యమేలుతున్నది. నిత్యావసర వస్తువులు మొదలు పెద్దపెద్ద హోటళ్లలో ఆహారాలు కల్తీమయం అవుతున్నాయి. ఇటీవల పోలీసుల దాడుల్లో కుళ్లిపోయిన మాంసాన్ని విక్రయిస్తున్న నిజాలు బయటపడ్డాయి. ఇలాంటి కల్తీతో ప్రజల ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోతున్నది. ఆహార కల్తీతో ప్రజలు రోగాల బారిన పడుతారు. కాబట్టి హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో శానిటరీ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలి. కల్తీ కారకులను కఠినంగా శిక్షించాలి.

- ప్రవీణ్ కొత్వాల్, బేగంపేట్, హైదరాబాద్

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలె

యాదాద్రి అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అదే స్థాయిలో భువనగరి ఖిలా పర్యాటక కేంద్రంగా మార్చే పనులు జరుగటం లేదు. అరకొర నిధులతో పనుల్లో నత్తనడత ఉన్నది. వెంటనే తగు నిధులు సమకూర్చి ఖిలాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అప్పుడే యాదాద్రికి మరింత శోభ వస్తుంది.

- జంపాల అంజయ్య, సామాజిక కార్యకర్త, యాదాద్రి భువనగిరి జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

వ్యవసాయం



డాక్టర్ పిడిగెం సైదయ్య

రైతు సాధికారతకు పునాది

దశాబ్దాల వ్యవసాయ చరిత్రలో సాగుచేసే రైతన్నకు తాను పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం లేదు. ప్రభుత్వాలు మారినా రైతు దశ, దిశ మారలేదు. రైతు శక్తిని సంఘటితం చేయలేదు. అధికారంలో రైతును భాగస్వామిని చేయలేదు. ఆహారోత్పత్తి శ్రామికులుగా, బానిసలుగా చూస్తూ వచ్చారు. ఎన్నికలప్పుడు తాత్కాలిక ఊరడింపు ఉపన్యాసాలే తప్ప రైతు కష్టాలకు చరమగీతం పాడే నిర్ణయాలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో అధికార నిర్ణయం లేని ఓటరు పాత్ర రైతుది. ఇది నిన్నటివరకు. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న 'రైతు సమన్వయ సమితి' ఏర్పాటుతో రైతు సాధికారతకు పునాది పడింది.

దేశంలోని అన్నిరంగాల్లో సంఘటిత శక్తి ఎక్కువ. ఒక్క వ్యవసాయరంగంలో మాత్రమే రైతుకు సంఘటిత శక్తిలేదు. ఒక చట్టబద్ధ వ్యవస్థ లేదు. విత్తనం దగ్గరి నుంచి పంట మార్కెట్‌లో అమ్మేవరకు అడుగడుగునా మోసానికి గురవుతున్నాడు రైతన్న. ప్రభుత్వం అధికారికంగా ఒక సంస్థను ఏర్పాటుచేసి అందులో పూర్తిగా రైతులకు, నిపుణులకు భాగస్వామ్యం కల్పించే ప్రయత్నం చేయటం ముదావహం. తెలంగాణ రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ఏర్పాటు దేశ వ్యవసాయ చరిత్రలోనే నూతన అధ్యాయం. అన్నిరంగాల్లో లాగే తమ ఉత్పత్తులకు ధరలను నిర్ణయించుకునే శక్తి ఈనాటికి రైతుకు అందింది. అందుకు తెలంగాణ రాష్ట్రం వేదికైంది. అంటే రాష్ట్రం తాను రైతులకు చేస్తున్న సేవలలో లోపాలుంటే నేరుగా ప్రశ్నించే చట్టబద్ధ హక్కును రైతులకు కల్పిస్తున్నది. అందులో అట్టడుగుస్థాయి నుంచి ప్రాతినిధ్యం ఉంటుంది. కాబట్టి క్షేత్రస్థాయి సమస్యలు కచ్చితంగా వెలుగులోకి వస్తాయి. రాష్ట్రస్థాయి కమిటీ 42మందిలో 12 మంది వ్యవసాయరంగ నిపుణులను నియమించటం వల్ల పూర్తి శాస్త్రీయత వస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో రైతులు పండించే పంటలు, ఖర్చులపై సమగ్ర శాస్త్రీయ విశ్లేషణకు వీరి సహకారం అవసరం. రాష్ట్ర అవసరాలకు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించాలి? ఆయా పంటలకు అనువైన ప్రాంతాలు ఏమిటి? సరిపోయే రకాలు ఏమిటి? దిగుబడి ఎంత రానున్నది? అందులో రాష్ట్ర అవసరాలు తీర గా మిగులెంత? ఏయే ఉత్పత్తులకు ఏ రాష్ట్రంలో గిరాకీ ఉన్నది? ఎంత మొత్తంలో ఉత్పత్తిని మార్కెట్ చేయవచ్చు? ధరలు, మార్కెట్ నిబంధనలు, పోటీదారులు, వారి పంటల నాణ్యత తదితర విషయాలపై ఎప్పటికప్పుడు సమగ్ర విశ్లేషణతో కూడిన సమాచారాన్ని రైతులకు అందించేందుకు నిపుణులు ఉపయోగపడుతారు. వీటితోపాటు విదేశీ మార్కెట్లకు ఎగుమతికి రాష్ట్రంలో పుష్కల అవకాశాలున్నాయి. అయితే నాణ్య త, ఆ దేశంలో అమల్లో ఉన్న ప్రమాణాలకు మన ఉత్పత్తులు సరిపోయేలా ఉండాలి. అందుకు అనుగుణంగా సాగులో మార్పులు, ప్రత్యేక పరిజ్ఞానాన్ని వాడాల్సి ఉంటుంది. వీటిపై సమగ్ర అధ్యయనం చేయాల్సిన బాధ్యత నిపుణులదే. వీరిది 'విధానపర' నిర్ణయాల్లో కీలక పాత్ర. వారికి రాష్ట్ర వ్యవసాయంపై పూర్తిస్థాయి పట్టు అవగాహన ఉండాలి.

రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీటిని అందించే ప్రయత్నం జరుగుతున్నది. శరవేగంతో ప్రాజెక్టులు పూర్తవుతున్నాయి. నీటి లభ్యత పెరిగితే ప్రస్తుతం ఉన్న పంటల దిగుబడులు రెండు నుంచి మూడింతలు పెరుగుతాయి. దీంతో సప్లై పెరిగి డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి ఇప్పటినుంచే భూములను ఏ పంటలు పండించేందుకు వాడుకోవాలో ప్రణాళిక ఉండాలి. ఇప్పటికే రాష్ట్రం దేశ విత్తన భాండాగారం గా వర్ధిల్లుతున్నది. గద్వాల్‌లో పత్తి, వనపర్తిలో పల్లీలు, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో వరి, హైదరాబాద్ పరిసర జిల్లాలో అన్నిరకాల కూరగాయలు, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలో సోయాబీన్ పంటలకు అనుకూల వాతావరణం ఉన్నది. అందుకుగాను అవసరమైన శిక్షణనివ్వాలి. అక్కడే విత్తన ప్రాసెసింగ్ ప్లాంటులు ఏర్పాటుచేసి తెలంగాణ బ్రాండ్‌తో విక్రయించాలి. విత్తనోత్పత్తి చేపట్టి నేపాల్, భూటాన్, శ్రీలంక, ఇండోనేషియా వంటి దేశాలకు ఎగుమతి చేయవచ్చు.

రాష్ట్రంలో సాగులో ఉన్న ప్రతి ఎకరా భూమికి వానాకాలంలో నాలుగు వేలు, యాసంగిలో మరో నాలుగు వేల రూపాయలు ఇచ్చేందుకు ప్రభుత్వం 'పెట్టుబడి సహాయ పథకం' ప్రకటించింది. దీని అమలుకు అవసరమైన నిధులను ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌లో ఉంచింది. దేశంలో, రాష్ట్రంలో 86 శాతం పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వారికి పెట్టుబడి సామర్థ్యం చాలా తక్కువ. ఆస్తులు, అప్పుల నిష్పత్తిలో సమతుల్యం లోపించింది. ఇప్పుడు మరో పంట వేసేందుకు పెట్టుబడి కావాలి. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ఖరీఫ్ పంటలకు ఎకరాకు రూ.4 వేలు ఇవ్వనుండటంతో పెట్టుబడికి కొదువలేదు. ఎరువులు, విత్తనాలు సకాలంలో కొనుగోలు చేయవచ్చు. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు.

దేశ వ్యవసాయ చరిత్రలో రైతును ఆదుకునే విప్లవాత్మక పథకం ఇది. సాగుభూమి ఉన్న ప్రతి రైతుకు సహాయం అందుతుంది. చిన్న, సన్నకారు, పెద్ద రైతులనే తారతమ్యం లేదు. ఎందుకంటే సాగులో ఉన్న ప్రతి రైతు నష్టంలోనే ఉన్నాడు. వారికి సహాయం కచ్చితంగా ఆహ్వానించదగినదే. అయితే తాము ఆర్థికంగా బాగానే ఉన్నామనుకునేవారు ఎల్పీజీ సబ్సిడీ తరహాలో 'గివ్ అప్' ఆప్షన్‌తో వదులుకోవచ్చు. ఇప్పటికే ముఖ్యమంత్రి తాను పెట్టుబడి సాయం తీసుకోనని ప్రకటించారు. రైతులు ప్రమాదవశాత్తు చనిపోతేనో, అనారోగ్యంతో అకాల మరణం చెందితేనో రూ.5 లక్షల ప్రమాద బీమా ప్రకటించిన ప్రభుత్వం.. అందుకు బీమా ప్రీమియంను 72 లక్షల మంది రైతులకు చెల్లించనున్నది. ప్రమాద బీమా కుటుంబానికి పెద్ద ఆసరా అవుతుందనటంలో సందేహం లేదు.

మద్దతు ధరలేని పంటలు, ముఖ్యంగా ఉద్యాన పంటల్లో కోత అనంతరం నష్టం చాలా ఎక్కువ. మార్కెట్‌లో ఎక్కువ కాలం నిల్వ ఉండవు. ఇందుకు ఆహారశుద్ధి అదనపు ఆదాయం సైతం సుసాధ్యం. కాబట్టి పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం ద్వారా రైతు తన ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా విక్రయించి ప్రీమియం ధర పొందవచ్చు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సేంద్రీయ సాగుకు, ఎగుమతుల్లో అంతర్జాతీయ ప్రమాణాలు ఆదుకునేలా శిక్షణ ఇవ్వాలి. సంబంధిత ప్రాసెసింగ్ యంత్రాలు సబ్సిడీపై అందించాలి. దాల్‌మిల్‌లు, నూనె తీసే యంత్రాలు, ఉప ఉత్పత్తుల తయారీ మెషిన్‌లను రైతు సమన్వయ సమితులకు అందించాలి. ఇప్పటికే 75 శాతంపై టార్పాలిన్‌లు, వరినాట్లు వేసే యంత్రాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించటం హర్షణీయం.

ఏటేటా పెరుగుతున్న కూలీ రేట్లతో సాగు రైతులకు గిట్టుబాటు కావటం లేదు. కూలీల కొరత కూడా ఎక్కువ ఉన్నది. ఇక కూరగాయల ధరలు పడిపోయినప్పుడు కనీసం తెంపటానికి అయ్యే కూలీ ఖర్చులు కూడా రాని స్థితి ఏర్పడుతున్నది. ఇలాంటి సమయాలలో నైనా కనీసంగా రైతులను ఆదుకునేందుకు, సాగు ఖర్చులు తగ్గేందుకు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుబంధం చేయాలి.

రాష్ట్రంలో రైతే రాజుగా పథకాల రూపకల్పన మొదలైంది. రైతే ప్రధాన అజెండాగా, జెండాగా కార్యాచరణ, కసరత్తు జరుగుతున్నది. విత్తనం మొదలుకొని పంట కోత వరకు సబ్సిడీలు వస్తున్నాయి. పెట్టుబడికి నేరుగా ప్రభుత్వ సాయం అందుతున్నది. దీంతో దళారుల నుంచి విముక్తి కలుగనున్నది. ఇకనుంచి రైతు ఇంటి అవసరాలు తీరిన తర్వాత మిగులును గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చు. లేకపోతే ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా రైతు సమన్వయ సమితులు ఉంటాయి.

రాష్ట్రంలో రైతే రాజుగా పథకాల రూపకల్పన మొదలైంది. రైతే ప్రధాన అజెండాగా, జెండాగా కార్యాచరణ, కసరత్తు జరుగుతున్నది. విత్తనం మొదలుకొని పంట కోత వరకు సబ్సిడీలు వస్తున్నాయి. పెట్టుబడికి నేరుగా ప్రభుత్వ సాయం అందుతున్నది. దీంతో దళారుల నుంచి విముక్తి కలుగనున్నది. ఇకనుంచి రైతు ఇంటి అవసరాలు తీరిన తర్వాత మిగులును గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చు. లేకపోతే ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా రైతు సమన్వయ సమితులు ఉంటాయి.

ఇలాంటి ప్రతిష్ఠాత్మక పథకాలకు కేంద్రం సైతం తన వంతు ఆర్థిక చేయూతనివ్వాలి. పెట్టుబడి సహాయ పథకానికి 50 శాతం భరించాలి. హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. రైతు కేంద్రంగా వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర పథకాలను మోడల్‌గా వ్యవసాయ ప్రధాన రాష్ట్రాల్లో కేంద్రం ప్రవేశపెట్టాలి. దేశ రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే 'రైతు రాజ్యం' సాకారమవుతుంది.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

గురుకుల విద్యాతో వెలుగులు

విద్య



జూలూరు గౌరీశంకర్

కుల, మత, వర్ణ, వర్గ, జాతి, లింగ వివక్షలేకుండా ప్రజలందరికీ సమాన అవకాశాలు లభించాలని మన రాజ్యాంగం చెబుతున్నది. 'పిల్లలు స్వేచ్ఛగా, సగౌరవంగా ఆరోగ్యంగా పెరిగే అవకాశం ఉండాలని' రాజ్యాంగంలోని 39 (ఎఫ్) చెబుతున్నది. బాలలందరికీ 14 ఏండ్ల వయస్సు వచ్చేదాకా నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను అందించాలని రాజ్యాంగం చెబుతున్నది. కానీ ఇప్పటిదాకా వచ్చిన ప్రభుత్వాలు ఏం చేశాయి? మురికివాడల్లో పిల్లలు మురికివాడల్లోనే మగ్గుతున్నారు. పేదవర్గాల పిల్లలకు చదువు ఆమడదూరంలోనే ఉండిపోయింది. సంచారజాతులు, బాగా వెనుకబడిన బీసీలు, దళితులు, మైనార్టీలు, గిరిజనులు, పేదల పిల్లలకు సరైన చదువులేదు.

రాష్ట్రసాధన ఉద్యమ సమయంలోనే ఈ చదువుల ముఖచిత్రం మారాలన్న నినాదాలు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం వస్తే మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకుందామని అధ్యాపక, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలన్నీ నినదించాయి. తెలంగాణ ఉద్యమకర్తగా, ఉద్యమనేతగా కేసీఆర్ మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకుందామన్నారు. రాష్ట్రసాధన తర్వాత ఉద్యమకాలం నాటి మాట సాక్షిగా కేజీ టు పిజీ విద్యా విధానానికి రూపకల్పన చేసి అట్టడుగున చదువందని పేదపిల్లల వాకిళ్లదాకా చదువుల సరస్వతిని తీసుకపోయారు. అందుకు గురుకుల విద్యావ్యవస్థను ప్రారంభించారు.

తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 85 శాతం ఉన్నారు. తెలంగాణ వికాసమంటే ఈ వర్గాల వికాసమేనన్న దార్శనికతతో కేసీఆర్ రాష్ట్రంలో 545 గురుకుల విద్యాలయాలను ప్రారంభించారు. చదువు అందరికి అందితే సమాజ ముఖచిత్రమే మారుతుంది. ఆధిపత్య సంస్కృతికి చరమగీతం పాడాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని చెప్పటం కాకుండా కేసీఆర్ ఆచరణాత్మకంగా వాస్తవం చేస్తున్నారు.

రాష్ట్రం అవతరించాక సంచారజాతులు, బాగా వెనుకబడిన కులాల వారి పిల్లలు బడికి వస్తున్నారు. తొలిసారిగా బడిమెట్లు ఎక్కుతున్న కులాల పిల్లలకు అన్ని వసతులతో గురుకులాలు వారికి స్వాగతం పలుకుతున్నాయి. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా వారందరినీ తిరిగి బడిబాటకు మళ్లించటం జరుగుతున్నది.

గతంలో వెనుకపడేసిన, వెనుకపడిన తెలంగాణ ఇప్పుడు తననుతాను మానవ సంపదగా మార్చుకుంటున్నది. సాంకేతిక తెలంగాణగా మార్చుకునేందుకు మానవసంపదే ముఖ్యం. అందుకు సాంకేతిక సైన్యాన్ని తయారుచేసేందుకు విద్యారంగాన్ని పునాది నుంచి పటిష్టం చేసేపనికి సీఎం కేసీఆర్ పూనుకున్నారు. ముఖ్యంగా బడికిరాని పేద పిల్లలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల పిల్లలను బడికి తీసుకరావటమే కాదు, వచ్చిన పిల్లలకు నాణ్యమైన చదువు అందించటం, పౌష్టికాహారం అందించటం గొప్ప విషయం. కేసీఆర్ దార్శనికతకు సకల సదుపాయాలతో ఉన్న గురుకుల విద్యాలయాలే నిదర్శనం. రాబోయే ఐదు పదేండ్లలో ఈ గురుకులాల నుంచి వచ్చిన బహుజన మైనార్టీవర్గాల పిల్లలు తెలంగాణలో కొత్త చరిత్రను రాసి తీరుతారు. ఇది జోస్యం చెప్పటం లాంటిది కాదు. ఇటీవల బీసీ కమిషన్ సభ్యునిగా తెలంగాణ రాష్ట్రంలో పర్యటనలు చేస్తుంటే గురుకుల విద్యాలయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటం జరిగింది. ఎక్కడ ఏ స్కూలుకు వెళ్లినా మొదట వాతావరణం, పరిశుభ్రత, ఆహారం, వంటకాలు, టాయిలెట్స్, హాస్టల్స్ గదులు చూస్తే సంతోషమేసింది. విద్యార్థుల పాలిట స్వర్ణయుగంగా తోచింది. భవిష్యత్తులో తాము ఏ దిశగా పోదలుచుకున్నారో తమ లక్ష్యాలేమిటో కూడా ఆ పిల్లలు చెబుతుంటే ఒళ్లు పులకరించింది.

గతంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు ఇప్పటి గురుకులాలకు పోలికే లేదు. గతంలో నీళ్ల సాంబరు, అల్యూమినియం కంచాలతో పిల్లలు రోడ్డెక్కి నినదించేవారు. ఇప్పుడు సన్నబియ్యంతో రుచికి, శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అతిశయోక్తి కాదనుకుంటే ఇంటికంటే మంచి ఆహారం అందిస్తున్నారు. సమాజంలో సగభాగమైన బీసీల పిల్లలు ప్రభుత్వ స్కూళ్లల్లో యాభై శాతానికి మించి ఉన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 119 గురుకులాల నిండా ఉన్నారు. బహుజనులకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పిస్తే వాళ్లు ప్రపంచాన్నే తమ చిటికెన వేళ్లతో మార్చగలరని, ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదన్న విషయాన్ని గురుకుల విద్యాలయాలు తేల్చిచెబుతున్నాయి. భవిష్యత్ తెలంగాణ ఎట్లా ఉండబోతుందో, దాని రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయో అన్న దాన్ని దర్శించాలంటే గురుకుల విద్యాలయాలలోని పిల్లలను తట్టితే తెలుస్తుంది. గురుకులాలు సమర్థవంతంగా నడిస్తే పిల్లలే తెలంగాణ తలరాతలు మార్చేస్తారు. అందుకే ఈ గురుకుల విద్యాలయాలపై ఈగ వాలకుండా బహుజనులే సంరక్షించుకోవాలి.

తెలంగాణ పునర్నిర్మాణంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పూడిక తీసినట్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు అందబోతున్నట్లు, చదువులు కూడా బహుజనుల గడపలదాకా చేరాలన్న లక్ష్యంతో ముందుకుసాగున్న కేసీఆర్ ఆలోచనలను ప్రతి ఒక్కరూ హృయపూర్వకంగా అభినందించాలి. తెలంగాణ విద్యావంతుల సమాజమైతేనే అది వివేకవంతమైన విజ్ఞాన సమాజాన్ని ప్రతిష్ఠిస్తుంది. గురుకుల విద్యాలయాలపై విమర్శలు చేసేవాళ్లు ఉండవచ్చు. సద్విమర్శలకు ఎవరూ అడ్డు చెప్పరు. ఈ గురుకుల విద్యాలయాలు వయసు రీత్యా ఒక సంవత్సరం బిడ్డన్న విషయం మరువరాదు. ఇప్ప టివరకు బడిగడప తొక్కని అట్టడుగు వర్గాల పిల్లలు గురుకుల విద్యాలయాలకు వస్తున్నారు. సంచారజాతుల పిల్లలు, గంగిరెద్దులు ఆడించేవారి పిల్లలు, పటం కథలు చెప్పే వారి పిల్లలు, ఇప్పటివరకు ఈ ఆధునిక సమాజానికి తెలియని కొన్ని కులాలవారి పిల్లలు గురుకుల విద్యాలయాలకు వస్తున్నారు. ఇది పెద్దమార్పు. వెలివాడల్లో వెలివేతలకు గురైన ఏకలవ్యులు గురుకులాలకు వస్తున్నారు. ఇది నిశ్శబ్ద విప్లవం. రాబోయే కాలం తలరాతలను ఈ గురుకుల విద్యాలయాలు మార్చేదశకు వచ్చి తీరుతాయి. సమాజంలో ఇప్పటివరకు అడ్డుగా ఉన్న ఆధిపత్యవర్గాల అడ్డుగోడలను కూల్చే శక్తి సామర్థ్యాలు గురుకుల విద్యాలయాల పునాదుల్లో ఉన్నాయి. ఈ విద్యాలయాలను బహుజన వర్గాలే సంరక్షించుకుంటాయి. సంచారజాతులు, ఎంబీసీలు, సబ్బండవర్ణాల పిల్లల చేయి పట్టుకొని గురుకులం వైపునకు నడిపిస్తున్న ఈ ప్రభుత్వానికి ఆ వర్గాలు ఎప్పటికీ కృతజ్ఞత గా ఉంటాయి. తెలంగాణలో మార్పు గురుకుల విద్యాలయాల గదుల నుంచే మొదలవుతున్నది. గురుకులాలు ఏర్పాటుచేసి ఏడాది కాలమే కాబట్టి కొన్నిచోట్ల కొన్ని సమస్యలున్నాయి. అత్యధిక గురుకులాల్లో మం చి భవనాలున్నాయి. వసతులున్నాయి. ఇంకా కొన్ని సమస్యలు మిగిలి ఉన్నాయి. అన్నీ ఒక్కసారే ఒనగూరకపోవచ్చును. అందుకు కొంత సమ యం పడుతుంది.

చేసే ప్రతిపనిని విమర్శించే విమర్శాస్త్రాలు కూడా ఎప్పుడూ ఉంటాయి. సద్విమర్శలు వ్యవస్థకు మేలు చేస్తాయి. కానీ ప్రతిదాన్నీ విమర్శించాలన్న దానితో సమాజానికి ఒనగూరేదేమీ ఉండదు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బాగా డబ్బున్న పిల్లలకు అందే విద్యావసతులు తెలంగాణలో గురుకుల విద్యాలయాల్లో పేదలకు అందుతున్నది. దాన్ని కాదనలేరు. మంచిని మరింతగా ఉన్నతీకరించేందుకు సద్విమర్శలు ఎల్లప్పుడూ అవసరం.

చేసే ప్రతిపనిని విమర్శించే విమర్శాస్త్రాలు కూడా ఎప్పుడూ ఉంటాయి. సద్విమర్శలు వ్యవస్థకు మేలు చేస్తాయి. కానీ ప్రతిదాన్నీ విమర్శించాలన్న దానితో సమాజానికి ఒనగూరేదేమీ ఉండదు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బాగా డబ్బున్న పిల్లలకు అందే విద్యావసతులు తెలంగాణలో గురుకుల విద్యాలయాల్లో పేదలకు అందుతున్నది. దాన్ని కాదనలేరు. మంచిని మరింతగా ఉన్నతీకరించేందుకు సద్విమర్శలు ఎల్లప్పుడూ అవసరం. బాధ్యతాయుత భాగస్వామ్యం ప్రతిపనిలో ఉంటే తెలంగాణను మహోన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. దీన్ని అందరూ గుర్తించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.


ఈ ఏడాదంతా అనుకూలమే!

- ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు పెద్దగా పెరుగవు
- అనుకున్న సమయానికే రానున్న రుతుపవనాలు
- అంచనాలు విడుదల చేసిన భారత వాతావరణ శాఖ
- లానినో ప్రభావంతో వాతావరణం చల్లబడుతుందని వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 1: ఎండాకాలం ప్రారంభంలోనే భారత వాతావరణ శాఖ ఓ తీపి కబురు అందించింది. ఈ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పెద్దగా పెరుగవని, రుతుపవనాలు సైతం సరైన సమయంలో వచ్చి మంచి వర్షాలు పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. మొత్తంగా ఈ ఏడాది దేశమంతటా అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నది. గత ఏడాది ఎండాకాలం చివర్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగడంతో రుతుపవనాల విస్తరణ ఆలస్యమై సరైన వర్షపాతం నమోదు కాలేదు. అయితే ఈసారి భూమధ్యరేఖ మీదుగా పసిఫిక్ సముద్రంలో లానినో పరిస్థితులు ఏర్పడినట్టు గుర్తించామని వాతావరణ శాఖ పేర్కొన్నది. దీంతో సముద్ర ఉపరితలం చల్లగా ఉంటుందని, ఫలితంగా దేశంలో ఉష్ణోగ్రతలు పెద్దగా పెరుగవని వెల్లడించింది. ఈ ఎండాకాలంలో దక్షిణ భారతదేశంలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 0.5 డిగ్రీలు, ఉత్తర భారత దేశంలో 1–2.3 డిగ్రీలు అధికంగా నమోదు కావొచ్చని పేర్కొన్నది. నాలుగు ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని చెప్పింది. కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు, ఏపీలోని రాయలసీమలో సాధారణం కన్నా 0.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది.

'లోక్‌పాల్' భేటీని బహిష్కరించిన ఖర్గే

- ప్రత్యేక ఆహ్వానితునిగా పిలువడంపై ఆగ్రహం
- ప్రతిపక్షం గొంతునొక్కాలనే ప్రయత్నమని మండిపాటు



న్యూఢిల్లీ, మార్చి 1: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన లోక్‌పాల్ ఎంపిక సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. తనను ప్రత్యేక ఆహ్వానితునిగా సమావేశానికి పిలవడంపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ప్రభుత్వ ఆహ్వానాన్ని తిరస్కరించారు. లోక్‌పాల్ ఎంపికలో ప్రతిపక్షం గొంతును నొక్కాలనే ఉద్దేశంతో ప్రత్యేక ఆహ్వానితునిగా తనను సమావేశానికి పిలిచారని పేర్కొంటూ ఖర్గే ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013 ప్రకారం.. లోక్‌సభ ప్రతిపక్ష నేత ఎంపిక కమిటీలో సభ్యుడిగా ఉంటారు. కాగా లోక్‌సభలో తగిన సంఖ్యాబలం లేని కారణంగా ఖర్గేకు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు. దాంతో సమావేశానికి ఆయనను కేవలం ప్రత్యేక ఆహ్వానితునిగా మాత్రమే పిలిచారు. కాగా, గురువారంనాటి సమావేశంలో లోక్‌పాల్ నియామకంపై ఏ నిర్ణయం తీసుకున్నారన్నది ఇంకా తెలియరాలేదు.

హలో చందమామ!

బెర్లిన్, మార్చి 1: టెలికం దిగ్గజం వొడాఫోన్ చంద్రుడిపై 4జీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. వచ్చే ఏడాది నాటికి ఈ కలను సాకారం చేయాలన్న కృతనిశ్చయంతో ఉన్నది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని వొడాఫోన్ జర్మనీ భుజానికెత్తుకుంది. టెక్నాలజీ భాగస్వామిగా నోకియాను నియమించుకుంది. బెర్లిన్‌కు చెందిన స్పేస్ కంపెనీ, పీటీ సైంటిస్ట్స్ కంపెనీల సహకారం తీసుకున్నది. మిషన్ మూన్‌లో భాగంగా 2019లో స్పేస్ ఎక్స్ కెనవరల్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. అంతేగాక తొలిసారిగా లైవ్ స్ట్రీమింగ్ ద్వారా హెచ్‌డీ వీడియోను ప్రసారం చేసి చరిత్ర సృష్టించడానికి వొడాఫోన్ ప్రయత్నిస్తున్నది.





ఈ చిత్రంలో కనిపిస్తున్నది ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్. దీనిని కర్ణాటకలోని తుముకూరు జిల్లా పావగడలో గురువారం సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. దాదాపు 13వేల ఎకరాల్లో రూ.16,500 కోట్లతో ఈ సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. 2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ పార్క్‌కు 'శక్తిస్థల' అని పేరు పెట్టారు.

తగ్గిన ఎల్పీజీ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: హోలీ పండుగ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గిస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. గురువారం నుంచే కొత్త ధరలు అమలులోకి వస్తాయని చమురు సంస్థలు తెలిపాయి. సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌పై రూ.2.54 ధర తగ్గగా, సబ్సిడీ లేని సిలిండర్‌పై రూ.47 తగ్గించినట్లు చమురు సంస్థలు ప్రకటించాయి.



రక్తధార సిరియా!



- మోర్టార్ కాల్పులు, బాంబు పేలుళ్లు.. వైమానిక దాడులు
- ఏడేండ్లుగా అంతర్యుద్ధం.. నిత్య నరమేధం
- సమిధలవుతున్న సామాన్య ప్రజలు
- ఇప్పటివరకు 4.7లక్షలమంది హతం
- ఎటు చూసినా మృతదేహాలు.. దారులన్నీ రక్తపుటేరులు
- దేశాన్ని శిథిలాల దిబ్బ గా మార్చిన ఆధిపత్య పోరు

బాంబుపేలుళ్లు, విస్ఫోటనాల భీకర శబ్దాలు.. శిథిలాల దిబ్బగా మారిన నగరాలు.. రహదారుల్లో రక్తపుటేరులు.. నెత్తుటి చారికలతో బిక్కుబిక్కుమంటున్న పసిమోములు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఏ రోజుకారోజు బతుకు గడియల్ని లెక్కపెట్టుకుంటున్న ప్రజలు.. బంకర్లలో, భవనాల పునాదుల్లో తలదాచుకుని నెలలతరబడి సూర్యోదయం కూడా చూడని చీకటి జీవులు.. ఇక బతుకుతామన్న నమ్మకాన్ని, బతుకాలన్న ఆశనూ కోల్పోయిన పౌరులు.. తిండికోసం ఆకలికేకలు.. జీవితం ఇంత దుర్భరంగా ఉంటుందా? అనిపించే ఆ మారణహోమం పేరు సిరియా!.. నరకం భూమ్మీదే ఉంటుందా? అనిపించే ఆ నిత్య నరమేధం.. సిరియా!


గౌటా (సిరియా), మార్చ్ 1: సిరియాలో అంతర్యుద్ధానికి ఏడేండ్లు. ప్రభుత్వ దళాలు, వేర్పాటువాద మిలిటెంట్లు, ఉగ్రవాద సంస్థల మధ్య నిత్యం యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పటివరకు సుమారు 4.70లక్షలమంది హతమయ్యారు. అరబ్‌దేశాల్లో తిరుగుబాటు మొదలైన సమయంలో అంటే 2011 జనవరి నుంచి సిరియాలోనూ తిరుగుబాటు మొదలైంది. సున్నీ జనాభా అధికంగా ఉన్న సిరియాలో దేశాధ్యక్షుడు బషర్–అల్ అసద్ మాత్రం షియా. దీనికితోడు నియంతృత్వ ధోరణి, పాలనావైఫల్యాలపై తిరుగుబాటు మొదలైంది. అదే సమయంలో ఉగ్రవాద సంస్థ ఐఎస్ తన ప్రాబల్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. తన ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నిస్తున్న తిరుగుబాటుదారులతోనూ, ఐఎస్ దళాలతోనూ బషర్–అల్–అసద్ ప్రభుత్వ సేనలు పోరు సాగిస్తున్నాయి. అసద్ ప్రభుత్వానికి రష్యా అండగా నిలుస్తుండగా, తిరుగుబాటుదారులకు అమెరికా మద్దతు ఇస్తున్నది. రెండు అగ్రరాజ్యాలు రెండువైపులా మద్దతుగా నిలువడంతో సిరియా అనే చిన్న దేశంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. మరోవైపు ఇతర దేశాలు కూడా ఈ వ్యవహారంలో తలదూర్చాయి. అసద్ ప్రభుత్వానికి ఇరాన్ ప్రభుత్వం, హిజ్బుల్లా సంస్థలు అండగా నిలిచాయి. దేశ భద్రత పేరిట ఇజ్రాయెల్ కూడా సిరియా అంతర్యుద్ధంలోకి ప్రవేశించింది. టర్కీ తిరుగుబాటు సేనలకు మద్దతునిస్తున్నది.

గౌటాలో ఏం జరుగుతున్నది?

సిరియా రాజధాని డమాస్కస్ సమీపంలో ఉన్న తూర్పు గౌటా ప్రాంతం ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు దారుల నియంత్రణలో ఉంది. రష్యా మద్దతుతో దేశాధ్యక్షుడు బషర్‌అల్–అసద్ ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని తిరిగి నియంత్రణలోకి తెచ్చుకునేందుకు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య పోరులో అమాయకులైన ప్రజలు సమిధలుగా మారుతున్నారు. ఉగ్రవాదుల స్థావరాలు ఉన్నాయనే పేరుతో ఎలాంటి హెచ్చరికలు లేకుండా దాడులు చేయడంతో సామాన్యులే ఎక్కువగా ప్రాణా లు కోల్పోతున్నారు. గౌటా యుద్ధ వాతావరణంలో ఇప్పటికీ 3.9లక్షలమంది ప్రజలు చిక్కుకుపోయారని ఐక్యరాజ్యసమితి భద్రతావిభాగం ప్రకటించింది. ఫిబ్రవరి 24న ఐక్యరాజ్యసమితి 30రోజుల కాల్పుల విరమణకు పిలుపునిచ్చినా, బాంబుల మోత ఆగక పోవడంపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నది. గత మంగళవారం కాల్పుల విరమణ నిర్ణయాన్ని ప్రకటించిన రష్యా కొన్ని గంటలకే శతఘ్నులను పేల్చింది. గత ఎనిమిదిరోజులుగా ప్రభుత్వ దళాలు జరుపుతున్న వైమానిక దాడుల కారణంగా ఇప్పటివరకు 700మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఎక్కువమంది ముక్కుపచ్చలారని చిన్నారులు, మహిళలే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఈ దాడులతో బిక్కచచ్చిపోయిన ఉగ్రవాదులు నగరంలోకి చొచ్చుకొచ్చి పౌరుల్లో కలిసిపోయారు. దీంతో పరిస్థితి మరింత విషమించింది. 2011 నుంచి ఇప్పటివరకు తూర్పు గౌటాలో 12,763 మంది ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

బాధ్యులెవరు?

సిరియా అంతర్యుద్ధంలో ఇప్పటివరకు 4.66లక్షల మంది చనిపోయారని సిరియా మానవ హక్కుల పరిశీలన సంస్థ (ఎస్ఓహెచ్ఆర్) గణాంకాలు చెబుతున్నాయి. ఐదులక్షలమందికిపైగా మృతిచెందారని సిరియన్ నెట్‌వర్క్ ఫర్ హ్యూమన్ రైట్స్ లెక్కలు చెబుతున్నాయి. మృతుల్లో అత్యధికులు సాధారణ పౌరులే. ఈ హత్యలకు ఎవరిది బాధ్యత?.. విచిత్రంగా ప్రభుత్వ వర్గాలు మాత్రం తాము ప్రజలపై ఎలాంటి దాడులూ చేయలేదని, పౌరులను లక్ష్యంగా చేసుకోవడానికి తాము వ్యతిరేకమని వాదిస్తున్నాయి. ఇక తిరుగుబాటుదారులు, టర్కీ సేనలు కూడా తాము పౌరులెవరినీ చంపలేదని వాదిస్తున్నాయి. అమెరికా సంకీర్ణ సేనలు మాత్రం ఇలాంటి యుద్ధ సందర్భాల్లో పౌరులను మినహాయించి చూడలేమని, వారి ప్రాణనష్టం నివారించలేమని వాదిస్తున్నాయి.



4,70,000 2011 మార్చి నుంచి ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య. వీరిలో 1,45,000 మంది మృతదేహాలు నేటికీ దొరుకలేదు.

83,500 సైన్యం, ప్రభుత్వ మద్దతుదారుల చేతిలో హతమైన పౌరుల సంఖ్య. వీరిలో జైళ్లలో వేధింపులకు 14,600మంది చనిపోయారు.

60లక్షలు ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్లిన పౌరులు.

14,940 అమెరికా సంకీర్ణ సేనలు ఇప్పటివరకు సిరియాలో జరిపిన వైమానికదాడులు

500 గత రెండునెలల్లో మరణించిన చిన్నారులు.. యూనిసెఫ్ లెక్కల ప్రకారం మరో 400మంది జైళ్లలో వేధింపులకు బలయ్యారు.

3700 ఐఎస్ జిహాదీలు పొట్టనబెట్టుకున్న సిరియా పౌరుల సంఖ్య.

7,000 తిరుగుబాటుదళాల దాడుల్లో చనిపోయినవారి సంఖ్య. వీరిలో 920మంది అమెరికా సంకీర్ణ సేనల దాడుల్లో, 510మంది టర్కీ దాడుల్లో చనిపోయారు.



ప్రే ఫర్ సిరియా.. తల్లడిల్లుతున్న సోషల్ మీడియా

సిరియాలో రక్తమోడుతున్న బాల్యంపై సోషల్‌మీడియా తల్లడిల్లుతున్నది. రక్తచారికలతో ఉన్న చిన్నారి ఫొటోలు నెటిజన్లను కదిలిస్తున్నాయి. 'ప్రే ఫర్ సిరియా' (సిరియా కోసం ప్రార్థించండి) అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఈ ఫొటోలను పంచుకుంటున్నారు. సిరియా ఛిన్నాభిన్నమవుతున్న బాల్యాన్ని కాపాడాలని, ఆ దిశగా ప్రపంచ దేశాలు కదలాలని కోరుతూ ప్రస్తుతం ఈ హ్యాష్‌ట్యాగ్ ఉద్యమం నడుస్తున్నది.

కార్తీ కస్టడీ పొడిగింపు

- సీబీఐ వాదనతో ఏకీభవించిన జడ్జి.. బెయిల్ నిరాకరణ
- సీబీఐ 'కుంభకర్ణ' నిద్రపోతున్నదా? అని నిలదీసిన సింఘ్వీ

న్యూఢిల్లీ/ చెన్నై: కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం తనయుడు కార్తీకి ఈ నెల ఆరో తేదీ వరకు సీబీఐ కస్టడీ పొడిగిస్తూ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు జడ్జి సునీల్ రాజా గురువారం ఆదేశించారు. బెయిల్ నిరాకరించారు. ప్రతి 24 గంటలకోసారి కార్తీకి వైద్య పరీక్షలు నిర్వహించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించారు. విచారణ సమయంలో న్యాయవాది సాయం కోరొచ్చునన్నారు. కానీ ఇంటి భోజనం తెప్పించుకునేందుకు అనుమతి నిరాకరించారు. జడ్జి అనుమతితో చిదంబరం దంపతులు తమ కొడుకు కార్తీతో మాట్లాడారు. బుధవారం కార్తీకి విధించిన ఒకరోజు పోలీస్ కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు హాజరు పరిచారు. కార్తీకి వ్యతిరేకంగా సాక్ష్యాలున్నాయని, విదేశాలకు వెళ్లినప్పుడల్లా కార్తీ ముడుపుల ఖాతాలను మూసేస్తున్నారని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ఇదే కేసులో అరెస్టయిన కార్తీ సీఏ భాస్కర రామన్‌కు బెయిల్‌పై ఈ నెల 7న నిర్ణయం వెల్లడిస్తామన్నారు.



ఢిల్లీలోని పటియాలా కోర్టులో కార్తీ

కోర్టు ధిక్కార పిటిషన్ ఎందుకు వేయలేదని నిలదీసిన సింఘ్వీ

కార్తీ తరపున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ 'గతేడాది ఆగస్టులో 22 గంటలపాటు ప్రశ్నించిన సీబీఐ.. అకస్మాత్‌గా సహాయ నిరాకరణ చేస్తున్నాడన్న సీబీఐ 'కుంభకర్ణ' నిద్రపోతుందా?' అని సింఘ్వీ ప్రశ్నించారు. ఐఎన్ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్ ఇంద్రాణి ముఖర్జీ వాంగ్మూలంపై కేవలం మీడియాలో కథనాలు మాత్రమే వచ్చాయన్నారు. తాను ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 2013 నవంబర్‌లోనే దీనిపై ఎస్ఎఫ్ఓఐతో విచారణకు ఆదేశించారన్నారు. ఐఎన్ఎక్స్ కుంభకోణం కేసులో సీబీఐతో కేంద్రం 'చిలుక పలుకులు' పలికిస్తున్నదని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. మరోవైపు సుప్రీంకోర్టులో కార్తీ తరపున విచారణకు హాజరైన సిబల్.. కూతురు హత్య కేసులో నిందితురాలు ఇంద్రాణి వాంగ్మూలం ఎలా విశ్వసిస్తారన్నారు. ఈ అవినీతిని ప్రోత్సహించింది చిదంబరమేనని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నర్సింహారావు ఆరోపించారు.

పాక్ కాల్పుల్లో ఇద్దరు సైనికులకు గాయాలు

జమ్ము, మార్చి 1: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి పాక్ ఆర్మీ శతఘ్నులు, ఆటోమెటిక్, చిన్న ఆయుధాలతో విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో భారత జవాన్లు ఇద్దరు గాయపడ్డారు. పూంచ్ జిల్లా భింబేర్‌గలి సెక్టార్‌లో ఎల్వోసీ వెంబడి గురువారం ఉదయం 8 గంటలప్రాంతంలో పాక్ కాల్పులకు తెగబడింది. రాజౌరీ జిల్లాలో నౌషేరా, కలాల్, సుందర్‌బని సెక్టార్లలో ఎల్వోసీ వెంబడి 10.30 ప్రాంతాల్లో కూడా కాల్పులు జరిపింది. వారి కాల్పులకు భారత బలగాలు ధీటుగా సమాధానమిచ్చాయి. ఈ ఘటనల్లో ఇద్దరు జవాన్లు స్వల్పంగా గాయపడ్డారని, వారిని దవాఖానకు తరలించామని ఆర్మీ అధికారులు తెలిపారు. బుధవారం కూడా పాక్ ఆర్మీ నౌషేరా, కలాల్, సుందర్‌బని సెక్టార్లలో కాల్పులకు తెగబడింది. పాక్ ఆర్మీ వరుసగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నది. కాగా, భారత బలగాలు జరిపిన కాల్పుల్లో తమ సైనికులు ఇద్దరు మృతి చెందారని పాకిస్థాన్ ఆర్మీ పేర్కొన్నది.

ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం

జమ్ముకశ్మీర్‌లోని బండిపార జిల్లా హజిన్ ప్రాంతంలో గురువారం భద్రతాదళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది హతమైనట్టు పోలీసులు తెలిపారు. ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం మేరకు భద్రతా బలగాలు షక్రూద్దీన్ గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. వారి రాకను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులు జరుపగా.. భద్రతాబలగాల ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది చనిపోయినట్టు వెల్లడించారు.

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు

- ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్, మరోచేతిలో కంప్యూటర్ పట్టుకున్నప్పుడే అభివృద్ధి: ప్రధాని మోదీ
- ఇరుదేశాల సంబంధాలను మరింత బలపర్చుకోవాలి: జోర్డాన్ రాజు అబ్దుల్లా-2

న్యూఢిల్లీ: ఉగ్రవాదం, ద్వేషానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం కానీ, మతాలకు వ్యతిరేకం కాదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. యువత ఆలోచనా విధానాలను తప్పుదోవపట్టిస్తూ అమాయకులపై దురాఘతాలకు పాల్పడే వారికి వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కంప్యూటర్‌ను పట్టుకున్నప్పుడే అభివృద్ధితోపాటు సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. గురువారం ఢిల్లీలో 'ఇస్లామిక్ వారసత్వం– అవగాహన, ఆధునీకరణ పెంపు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు ఉంటాయన్నారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 మాట్లాడుతూ ప్రపంచమంతా ఉగ్రవాదంపై యుద్ధం చేస్తున్నదని, ఇది వివిధ మతాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం కాదన్నారు. ఇంటర్నెట్ ద్వారా జరిగే అలాంటి ప్రచారాలను నిలిపేయాలన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.



జోర్డాన్ రాజు అబ్దుల్లాతో ప్రధాని మోదీ

ఇరు దేశాల మధ్య ఒప్పందాలు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, రక్షణరంగంలో సహాయ సహకారాలు మరింత పెంచుకొనేందుకు జోర్డాన్‌తో భారత్ పలు ఒప్పందాలను కుదుర్చుకున్నది. జోర్డాన్ రాజు అబ్దుల్లా –2తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై సమగ్రంగా చర్చించారు. 12 ఒప్పందాలు ఉన్నాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ తెలిపారు.

శ్రీదేవి నా చెల్లెలాంటిది

- మా మధ్య ప్రణయం తెరమీదికే పరిమితం: కమల్‌హాసన్

చెన్నై: శ్రీదేవి తనకు చెల్లెలు లాంటిందని నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్ హాసన్ పేర్కొన్నారు. తాము పలు సినిమాల్లో ప్రేమికులుగా నటించినా, హిట్‌పెయిర్‌గా నిలిచినా.. అది తెర మీదికే పరిమితమన్నారు. తెరవెనుక అన్నాచెల్లెళ్లుగా ఆప్యాయతతో మెలిగేవాళ్లమని తమిళ పత్రిక ఆనంద వికటన్‌కు రాసిన ఓ వ్యాసంలో శ్రీదేవితో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'అప్పట్లో పెండ్లి జరుగుతుంటే పీటల మీద ఉన్న జంట శ్రీదేవి, కమల్ ఉన్నారని పోల్చేవారు. మేము తెరవెనుక ఉన్న మా అనుబంధాన్ని దాచడంతో ఆ ఊహలకు తెరపడేది కాదు' అని అన్నారు. శ్రీదేవి బాలీవుడ్‌కు వెళ్లినా తరుచూ తన సలహాలు తీసుకునేదన్నారు. కమల్, శ్రీదేవి కలిసి తెలుగు, తమిళం, హిందీలో దాదాపు 21 సినిమాల్లో నటించారు.

ఇంత జనసంద్రం ఇదే తొలిసారి

శ్రీదేవి అంతిమయాత్రకు అభిమానులు లక్షల్లో తరలివచ్చారు. భారీగా వచ్చిన జనసంద్రానికి ముంబై సాక్షీభూతమైంది. అభిమాన అందాల తారకు వీడ్కోలు పలికేందుకు దేశంలోని అన్ని ప్రాంతాల అభిమానులు తరలొచ్చారు. ఎక్కడ చూసినా ఆమె మృతిపై సానుభూతి చూపేవారే కనిపించారు. ముంబైలో ఒక వ్యక్తి అంతిమయాత్రకు ఇంతగా జనం రావడం ఇదే తొలిసారని ముంబైవాసులు భావిస్తున్నారు. తన స్వరంతో బాలీవుడ్‌ను ఒక ఊపు ఊపిన మహ్మద్ రఫీ అంతిమయాత్రకు (1980) 10 లక్షలు, రాజేశ్‌ఖన్నా అంతిమయాత్ర (2012)లో అంతకన్నా తక్కువగా అభిమానులు వచ్చారు. రాజ్ కపూర్ (1988), వినోద్‌ఖన్నా అంతిమయాత్ర (2017)కూ భారీగా అభిమానులు హాజరయ్యారు.



ముంబై పోలీసులకు కృతజ్ఞతలు

శ్రీదేవి అంతిమయాత్రలో సంయమనంతో విధు లు నిర్వర్తించిన ముంబై పోలీసులకు నటుడు అనిల్ కపూర్ కృతజ్ఞతలు తెలిపారు. 'కడసారి నివాళులర్పించే సమయంలో మాకు అండగా నిలిచిన స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. దహనసంస్కారాలు జరిగినప్పుడు మా ఏకాంతానికి భంగం కలుగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నందుకు ముంబై పోలీసులకు కృతజ్ఞతలు' అని అనిల్ కపూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం

- ముగిసిన అంతిమ సంస్కారాలు
- తమిళ నాడు గవర్నర్, కేంద్ర మంత్రులు హాజరు

కాంచీపురం: కంచికామకోటి మఠం 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం (మహాసమాధి) గురువారం పూర్తయింది. సంప్రదాయంగా జయేంద్ర సరస్వతిని చంద్రశేఖరేంద్ర సరస్వతి స మాధి పక్కనే బృందావన ప్రవేశం చేయించారు. ఆ యన పార్థివదేహాన్ని ఏడడుగుల గోతిలో సమాధి చేశారు. ఉదయం 7.45 గంటలకు అభిషేకంతో మొదలై మూడున్నర గంటలపాటు కొనసాగిన క్రతువు.. మహాహారతితో ముగిసింది. కంచికామకోటి పీఠం ఉత్తరాధికారి శ్రీ విజయేంద్ర సరస్వతి అంతిమ సంస్కారాలను నిర్వహించారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్, కేంద్ర మంత్రులు పొన్ రాధాకృష్ణన్, సదానందగౌడ పాల్గొన్నారు. భక్తులు చివరి నిమిషంలో మఠంలోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో గందరగోళం నెలకొన్నది.





జయేంద్ర సరస్వతి మహాసమాధి క్రతువులు నిర్వహిస్తున్న శిష్యులు; కాబోయే పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

ప్రతిభా పాటవాలతో పీఠాధిపతిగా ఎదుగుదల

దశాబ్దాల క్రితం కంచి పీఠంలో జరిగిన ఓ వైదిక కార్యక్రమంలో పండితుడి పొరపాటును బాలుడు (13) సవరించాడు. అతడి ప్రతిభకు జయేంద్ర సరస్వతి ఆకర్షితులయ్యారు. ఆ బాలుడే ప్రస్తుతం కంచి పీఠానికి ఉత్తరాధికారి, కాబోయే పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తండళం వాసి తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వేదపండితుడు ఎం కృష్ణమూర్తి అంబలక్ష్మి దంపతులకు 1969లో విజయేంద్ర సరస్వతి జన్మించారు. తల్లిదండ్రులు ఆ బాలునికి శంకర నారాయణ అని నామకరణం చేశారు.

రాష్ట్రపతి కోవింద్ క్షమాపణలు చెప్పాల్సిందే

- క్షమాపణలు చెబితేనే రానిస్తామంటున్న ఏఎంయూ విద్యార్థి నేత

లక్నో: ముస్లింలు, క్రిస్టియన్లకు క్షమాపణలు చెప్పిన తర్వాతే రాష్ట్రపతి కోవింద్ అలీగఢ్ యూనివర్సిటీలో అడుగుపెట్టాలని ఏఎంయూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు సజ్జాద్ సుభాన్ డిమాండ్ చేశారు. 2010లో బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్న సమయంలో రంగనాథ మిశ్రా కమిషన్ నివేదికపై కోవింద్ మాట్లాడారు. 'ముస్లింలు, క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చడం రాజ్యాంగవ్యతిరేకం. వారు విదేశీయులు' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సుభాన్ మాట్లాడుతూ ఈనెల 7న ఏఎంయూ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి హాజరుకానున్నారని, ముందుగా తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాకే అడుగు పెట్టాలని అన్నారు.



సిద్దిపేట కోమటి చెరువు కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు



కోమటి చెరువు కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు



ఆటపాటతో అలరిస్తున్న ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

కళలకు మాగాణి సిద్దిపేట

కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులకు పెట్టని కోట

- గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం
- పాలమూరును ఆకుపచ్చగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యం
- సిద్దిపేటలో కోమటి చెరువు కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు
- వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు గౌరవ సత్కారం
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎంతోమంది కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులకు సిద్దిపేట పుట్టినిల్లని, కళలకు పెట్టనికోటగా వెలుగొందుతున్నదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ.1.25 కోట్లతో నిర్మించిన కోమటి చెరువు కళాక్షేత్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు రూ.50 వేల నగదును అందించి, గౌరవ సత్కారం చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజల ఆనందమే తమ ఆనందమని, కళా ప్రదర్శనల ద్వారా కళాభిమానుల ఆయుష్షు పెరుగుతుందని చెప్పారు. ఈ వేదికపై నిత్యం కళాప్రదర్శనలు జరుగాలని ఆకాంక్షించారు. కోమటి చెరువు అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఇటీవల రూ.25 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. ఈ నిధులతో కోమటిచెరువు వద్ద శిల్పారామం, బొటానికల్ గార్డెన్, మల్టీప్లెక్స్ థియేటర్‌ను నిర్మించనున్నట్టు తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తామన్నారు. గతంలో కరువుతో అల్లాడిన పాలమూరు స్వరాష్ట్రంలో నీళ్లతో పరవళ్లు తొక్కే చెరువులు, పచ్చని పంట పొలాలతో దర్శనం ఇస్తున్నదన్నారు. పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించినట్టు చెప్పారు. ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ.. తెలంగాణలో ఎంతో మంది ప్రసిద్ధ కవులు, కళాకారులు ఉన్నారని, వారంతా ఇలాంటి గొప్ప కళా వేదికలు కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. సిద్దిపేట కళా క్షేత్రం కొత్త చరిత్రను సృష్టిస్తుందని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ఈ కళా క్షేత్రం అంతర్జాతీయ స్థాయి కళా ప్రదర్శనలతో పునీతమవుతూ 30 జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, అంచనాల కమిటీ చైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషాసాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, వైస్ చైర్మన్ అక్తర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కోమటి చెరువు కళాక్షేత్రం ప్రారంభోత్సవంలో కళాకారుల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

మూడురోజులపాటు ఉత్సవాలు

కళాక్షేత్రం ప్రారంభోత్సవం సందర్భంగా మూడురోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం భాషాసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని క్లాక్‌టవర్ నుంచి కోమటి చెరువు కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. 11 రకాల కళా బృందాలతో నిర్వహించిన ఈ ర్యాలీని మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు.



లైఫ్‌ట్యాక్స్‌ను మింగేశారు

బండ్లగూడ ఆర్టీవోలో వెలుగుచూసిన మరో కుంభకోణం

ప్రభుత్వానికి రూ.2 కోట్లు శఠగోపం? • అంతర్గత విచారణ కమిటీని వేసిన రవాణాశాఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ బండ్లగూడ ఆర్టీవో ఆఫీస్‌లో రోజుకో కుంభకోణం వెలుగులోకి వస్తున్నది. ఇప్పటికే విజయవాడలో లారీల బాడీ బిల్డింగ్ పూర్తి కాకముందే క్లియరెన్స్ ఇచ్చి ఓ ఎంవీఐ దొరికిపోగా, రెండు రోజుల కిందట స్క్రాప్ వాహనాలకు కొత్త ఆర్సీలు ఇస్తూ సిబ్బంది టాస్క్‌ఫోర్స్ పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తాజాగా వాహనాలకు లైఫ్ ట్యాక్స్ విధించడంలో భారీ అవకతవకలు వెలుగుచూశాయి. కొందరు అధికారులు మధ్యవర్తులతో కుమ్మక్కై వాహనాల వయసును ఎక్కువగా చూపిస్తూ ప్రభుత్వ ఖజానాకు రూ.2 కోట్ల మేర గండి కొట్టినట్టు తెలుస్తున్నది. స్క్రాప్ కేసు, ఈ కేసులో బండ్లగూడలోని ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. అతడి సూచనల ప్రకారం ఇద్దరు సెక్షన్ క్లర్కులు బ్రోకర్లు, సెకండ్‌హ్యాండ్ వ్యాపారులతో కుమ్మక్కై ఆర్టీవోకు తెలియకుండా అక్రమ దందా నడిపిస్తున్నట్టు తెలుస్తున్నది.

అవినీతి సాగుతోందిలా..

వేరే రాష్ట్రంలో వాహనం కొని మన రాష్ట్రానికి తీసుకొచ్చినప్పుడు అక్కడి రవాణాశాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ)తోపాటు ఆర్సీ, ఇన్‌వాయిస్ తెచ్చుకోవాలి. ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రమంలో ఆర్సీలో ఉన్నట్టు ఇంజిన్, ఛాసిస్ నంబర్లు సరిగ్గా ఉన్నాయో లేదో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సర్టిఫై చేస్తారు. ఆ తర్వాత వాహన విలువను లేదా దాని వయస్సును బట్టి లైఫ్‌ట్యాక్స్ వసూలు చేస్తారు. కొత్త వాహనాలకైతే ఇన్‌వాయిస్ ప్రకారం కారుకు 12 శాతం, బైక్‌కు 8 శాతం, రూ.10 లక్షలకు మించిన వాహనమైతే 14 శాతం లైఫ్‌ట్యాక్స్ వసూలు చేస్తుంటారు. సెకండ్‌హ్యాండ్ వాహనాలైతే దాని వయసు ఆధారంగా ట్యాక్స్ విధిస్తారు. వయసు పెరిగిన కొద్దీ పన్ను తగ్గుతుంది. బండ్లగూడ ఆర్టీవోలో ఈ విషయంలోనే అక్రమాలు జరుగుతున్నాయి. వాహనాల వయసును ఎక్కువగా చూపుతూ రూ.వేలల్లో మిగుల్చుకుంటున్నారు. ఉదాహరణకు 2015 మోడల్ వాహనాన్ని 2005 మోడల్‌గా చూపెడుతున్నారు. దీంతో ఒక్కో వాహనంపై ప్రభుత్వానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు రెవెన్యూ నష్టం జరుగుతున్నది. ఇలా మిగిలిన మొత్తంలో అడ్మిన్ ఆఫీసర్, క్లర్కులు, వ్యాపారులు పంచుకుంటున్నారు.

విచారణకు త్రిసభ్య కమిటీ

ఈ అవినీతి గురించి బయటికి పొక్కితే రవాణాశాఖ పరువుపోతుందనే ఉద్దేశంతో అంతర్గతంగా విచారించడంతోపాటు ప్రభుత్వానికి కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీని వేసినట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక సీనియర్ ఎంవీఐతోపాటు హైదరాబాద్ సెంట్రల్‌జోన్‌కు చెందిన ఒక అడ్మిన్ ఆఫీసర్, మరో ఆర్టీవోను కమిటీలో నియమించినట్టు తెలిసింది. ప్రాథమికంగా ఇప్పటివరకు 1500కు పైగా వాహనాల బదిలీల్లో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వానికి రూ.2 కోట్ల వరకు నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. మరోవైపు ఈ వ్యవహారంలో క్లర్కులను ఇరికించి తాను బయటపడేందుకు కీలక పాత్రధారైన ఏవో ప్రయత్నిస్తున్నట్టు సమాచారం.

21 ఏండ్లు ప్రత్యక్ష నరకం

- పాక్ నుంచి క్షేమంగా హైదరాబాద్‌కు చేరిన మహిళ
- ఒమన్ షేక్‌గా చెప్పుకొని పెండ్లి.. పాక్‌కు తీసుకెళ్లి హింసలు
- మంత్రి కేటీఆర్ చొరవతో క్షేమంగా భారత్‌కు బాధితురాలు



వివరాలు వెల్లడిస్తున్న మాజీ కార్పొరేటర్ అమ్జదుల్లాఖాన్. చిత్రంలో బాధితురాలు మహ్మదియా బేగం(మధ్యలో), ఆమె తల్లి హజ్రా బేగం

చాదర్‌ఘాట్: భర్త చేతిలో చిత్రహింసలు అనుభవిస్తూ ఏండ్లపాటు పాకిస్థాన్‌లో దుర్భరజీవనం గడిపిన ఓ హైదరాబాద్ మహిళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో క్షేమంగా ఇంటికి చేరుకున్నది. ఈ ఘటన వివరాలను గురువారం చంచల్‌గూడలోని ఎంబీటీ కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ వెల్లడించారు. హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడ మండలం మహ్మద్‌నగర్‌లో మహ్మద్ అక్బర్, అతడి భార్య హజ్రాబేగం, వారి కూతురు మహ్మదియా బేగం నివసిస్తున్నారు. స్థానికంగా నివాసం ఉండే ఓ వ్యక్తి మధ్యవర్తిత్వం వహించి మహ్మదియాకు ఒమన్‌కు చెందిన యూనస్ షేక్‌తో పెండ్లి జరిపించాలని ప్రతిపాదించాడు. యూనస్ బాగా ఆస్తిపరుడని, అందగాడని చెప్పి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో చూపించి ఒప్పించాడు. ఫోన్ ద్వారా వారిద్దరికీ పెండ్లి జరిపించాడు. యూనస్ వెంటనే మహ్మదియాను ఒమన్‌కు రప్పించుకున్నాడు. కొంతకాలం తర్వాత చిత్రహింసలకు గురిచేయడం ప్రారంభించాడు. వారికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు జన్మించారు. దాదాపు పదేండ్ల తర్వాత యూనస్ తాను పాకిస్థాన్ దేశీయుడినంటూ అసలు విషయం బయటపెట్టాడు. వెంటనే మహ్మదియాను పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్ జిల్లా బేలోహాకు తీసుకెళ్లి గ్యారేజ్‌లో బంధించాడు. మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేసేవాడు. పాస్‌పోర్టును పునరుద్ధరించలేదు. మహ్మదియాను ఆమె తల్లిదండ్రులతోనూ సరిగా మాట్లాడనిచ్చేవాడు కాదు. రెండేండ్లుగా చిత్రహింసలు మితిమీరడంతో తట్టుకోలేక ఆమె జరిగిన విషయాన్నంతా హైదరాబాద్‌లో ఉన్న తల్లిదండ్రులకు వివరించింది. దీంతో మహ్మదియా తల్లిదండ్రులు 2016 డిసెంబర్‌లో ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్‌ను సంప్రదించారు. ఆయన విషయాన్ని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి కేటీఆర్ స్పందించి కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధికారులు నిరంతరం కేంద్ర విదేశాంగశాఖ, పాకిస్థాన్‌లోని భారత హై కమిషనర్‌తో ఏడాదికిపైగా సంప్రదింపులు జరిపి అహ్మదియా బేగంను హైదరాబాద్‌కు రప్పించారు. ప్రస్తుతం తమ కూతురు ఆరోగ్యం బాగోలేదని, చికిత్సకు ప్రభుత్వం సహకరించాలని అహ్మదియా తల్లిదండ్రులు అక్బర్, హజ్రాబేగం కోరారు. తమ బిడ్డను రప్పించడంలో సహకరించిన మంత్రి కేటీఆర్‌కు, కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గోల్స్ ఆన్ వీల్స్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కవిత, సంస్థ వ్యవస్థాపకుడు అఖిలేశ్‌రెడ్డి తదితరులు


సామాజిక రుగ్మతలపై గోల్స్ ఆన్ వీల్స్ కృషి భేష్

అఖిలేశ్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలువాలి: ఎంపీ కవిత

చర్లపల్లి: సామాజిక రుగ్మతలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గోల్స్ ఆన్ వీల్స్ సంస్థను నెలకొల్పిన సింగిరెడ్డి అఖిలేశ్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలువాలని నిజామాబాద్ ఎంపీ కవిత పిలుపునిచ్చారు. ఐకరాజ్య సమితి అవార్డు కోసం జరుగుతున్న ఓటింగ్‌లో భాగంగా అఖిలేశ్‌రెడ్డి గురువారం ఎంపీ కవితను కలిశారు. తమ సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు, అవార్డు కోసం చేస్తున్న ఓటింగ్ ప్రచారం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు అఖిలేశ్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి ఆయనకు ఓటు వేయాలని కోరారు. అఖిలేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 57 దేశాలు పాల్గొన్న ఐక్యరాజ్య సమితి అవార్డు కార్యక్రమం చివరి దశకు చెరుకున్నదన్నారు. ఫైనల్లో ఏడు దేశాలు పోటీ పడుతున్నాయని, మన దేశం తరపున గోల్స్ ఆన్ వీల్స్ సంస్థ పోటీలో ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేయాలని కోరారు. వాట్సప్ లింక్‌లో 5వ నంబర్‌లో ఉన్న తన సంస్థకు ఓటు వేయడం ద్వారా అరుదైన ఘనత సాధించే అవకాశాన్ని కల్పించాలన్నారు.

సీపీ మహేశ్‌భగవత్‌కు అరుదైన గుర్తింపు

- మనుషుల అక్రమ రవాణా నిరోధక బిల్లులో భాగస్వామ్యం



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న మనుషుల అక్రమ రవాణా నిరోధక బిల్లులో రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్‌కు భాగస్వామ్యం కల్పించారు. ఆయన 13 ఏండ్లుగా మనుషుల అక్రమ రవాణా నిరోధానికి చేసిన కృషి, అనుభవాన్ని కేంద్రం పరిగణనలోకి తీసుకొని బిల్లు రూపకల్పనలో ఆయన సూచనలను కోరింది. ఇటీవల పీఎంవో అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో దాదాపు 45 నిమిషాలపాటు సీపీతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన సూచించిన అంశాలను ముసాయిదా బిల్లులో పొందుపరిచారు. ఈ బిల్లు కేబినెట్‌లో ఆమోదం పొందిందని సమాచారం.

సీపీ సూచనలు ఇవే..

- ఈ కేసులో బాధితులు, సాక్ష్యులు, ఫిర్యాదుదారులకు పూర్తి భద్రత ఉండాలి.
- బాధితులకు నష్టపరిహారం, పునరావసం వేగంగా, సమయానుసారంగా అందాలి.
- దందా సూత్రదారుల ఆస్తులను జప్తుచేయాలి. నిర్వాహకులకు కఠిన శిక్షలు ఉండాలి.
- ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో కేసుల విచారణ జరుగాలి.

ఇంటి అనుమతులపై తమిళనాడు ఆసక్తి!

హైదరాబాద్‌లో అధ్యయనానికి వచ్చిన ఐఏఎస్ అధికారి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలో అమలుచేస్తున్న సులభతర ఇంటి అనుమతుల విధానంపై తమిళనాడు ప్రభుత్వం ఆసక్తి చూపుతున్నది. ఆ రాష్ట్ర గృహనిర్మాణ, నగరాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ కృష్ణన్ గురువారం హైదరాబాద్‌కు వచ్చి జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశమయ్యారు. సింగిల్ విండో ప్లానింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ పర్మిట్ విధానం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాదర్శకతకు పెద్దపీట వేస్తూ చేపట్టిన డీపీఎంస్ విధానంపై ఆయన ఆసక్తి ప్రదర్శించారు. ఇటీవల మంత్రి కేటీఆర్ చెన్నై పర్యటన సందర్భంగా అక్కడి అధికారులు, డెవలపర్లు హైదరాబాద్‌లో చేపడుతున్న విధానాలపట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శించిన నేపథ్యంలో ఎస్ కృష్ణన్ ఇక్కడికి వచ్చారు.కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, డీటీసీపీ, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డితో సమావేశమైన తమిళనాడు ఐఏఎస్ అధికారి కృష్ణన్

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శుక్రవారం 2 మార్చి 2018
WWW.NTNEWS.COM



అందాల బుడతలకి..

ఈ కలర్ కాంబినేషన్ చాలా బాగుంటుంది. బ్లూ కలర్ రాసిల్క్‌తో స్కర్ట్ కుట్టాం. దానికి రాసిల్క్ రామాగ్రీన్ బార్డర్‌ని జతచేశాం. టాప్‌కి కూడా బార్డర్ మెటీరియల్‌నే వాడాం. స్లీవ్‌లెస్ ఇచ్చాం. బ్లూ కలర్ నెట్ ఫ్యాబ్రిక్‌తో కేప్ కుట్టాం. దానికి గోల్డెన్ బీడ్స్ జత చేయడంతో సూపర్‌గా కనిపిస్తున్నది.

షిఫాన్ మెటీరియల్‌ను యెల్లో, ఆరెంజ్ కాంబినేషన్ వచ్చేలా టై అండ్ డై చేయించాం. దీంతో ఈ ఫ్రాక్ కుట్టాం. ట్యూబ్ టైప్‌లో పైన ఫ్రాక్ డిజైన్ చేశాం. దీనికి వన్‌షోల్డర్ హైలైట్. పింక్, గ్రీన్ శాటిన్ మెటీరియల్ తో ఫ్లవర్‌లా డిజైన్ చేసి ఫ్రాక్‌కి అటాచ్ చేశాం. గోల్డెన్ బార్డర్ డ్రెస్ లుక్‌నే మార్చేసింది.

బోసినవ్వుల బుజ్జాయిలను చూస్తే ముచ్చటేస్తుంది.. అందులో ఆడపిల్లలుంటే ఆ ఇంటికొచ్చే కళే వేరు.. బుడిబుడి అడుగులతో లెహంగా వేసి ఇల్లంతా నడుస్తుంటే.. అందమైన గౌను తొడిగి ఇల్లంతా కలియతిరుగుతుంటే.. ఆ దృశ్యాలు చూడడానికి రెండు కళ్లూ చాలవు.. పాపాయిలకు ఎన్ని డ్రెస్‌లు ఉన్నా ఇంతేనా అనిపిస్తుంది.. అందుకే కొత్త కలెక్షన్‌ని మీ కోసం తీసుకొచ్చాం..



రితీషా సతీష్‌రెడ్డి
ఈశా డిజైనర్ హౌస్
సుచిత్రా, హైదరాబాద్
ఫోన్ : 8500767476
https://www.facebook.com/eshadesignerworks/







బుట్ట బొమ్మలా మెరిసేందుకు ఈ డ్రెస్ వేయాల్సిందే! ఆరెంజ్, పీచ్ కలర్ కాంబినేషన్‌లో రెండు లేయర్లుగా షిఫాన్ ఫ్యాబ్రిక్‌తో ఈ ఫ్రాక్ కుట్టాం. దీనికి శాటిన్ బార్డర్‌ను జతచేయడంతో మెరిసిపోతున్నది. పైన నెట్ ఫ్యాబ్రిక్‌ని జత చేశాం. ఆరెంజ్ కలర్ స్లీవ్స్‌ని కూడా రెండు లేయర్లుగా ఇవ్వడం ఈ డ్రెస్‌కి అదనపు ఆకర్షణ.

రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకుంటే ఈ డ్రెస్ వేయండి. పీచ్ కలర్ రాసిల్క్‌తో హాఫ్ షోల్డర్ టాప్ డిజైన్ చేశాం. దీనికి యెల్లో కలర్‌తో చేసిన పువ్వును అటాచ్ చేయడం హైలైట్. లెహంగాగా పక్షులు వచ్చిన సిల్క్ ఫ్యాబ్రిక్‌నీ ఎంచుకున్నాం. దానికి గోల్డెన్ బార్డర్ జత చేశాం.

స్కైబ్లూ, ఆరెంజ్ కలర్ కాంబినేషన్‌లో ఈ క్రాప్ టాప్ డిజైన్ చేశాం. టాప్ కోసం ఫ్లవర్ టెక్చర్డ్ నెట్ ఫ్యాబ్రిక్‌ని ఉపయోగించాం. దీన్ని వన్ షోల్డర్ క్రాప్‌టాప్‌గా కుట్టాం. ఇంకొకటి ఫుల్ హ్యాండ్ ఇచ్చాం. ఆరెంజ్ కలర్ సిల్క్ ఫ్యాబ్రిక్‌తో ఒక పువ్వు యాడ్ చేశాం. స్కై బ్లూ కలర్ బెనారస్‌తో లెహంగా కుట్టి దానికి ఆరెంజ్ కలర్ రాసిల్క్ మెటీరియల్‌ని బార్డర్‌గా వేయడంతో మరింత అందంగా మెరిసిపోతున్నది.



అభాగ్యులకు అండగా ఎకో కిచెన్

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పేరుతో అభాగ్యులైన మహిళలను ఆదుకుంటున్నది ఓ సంస్థ. అంతేకాదు వారికి ఉపాధి మార్గాలు చూపి, సమాజంలో గౌరవంగా బతికే అవకాశం కల్పించింది. ఆ ఒక్క సంస్థ పరిధిలోనే దాదాపు 150 మంది మహిళలు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

చెన్నైకి చెందిన వై ఆర్ గైటోండో ఫౌండేషన్.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలకు, భర్తను కోల్పోయినవారికి, గృహహింస బాధితులకు అండగా నిలుస్తున్నది. బాధితులందరినీ ఒక దగ్గరికి చేర్చి.. ఎకో కిచెన్ పేరిట వారికి ఉపాధి మార్గాన్ని చూపింది. దీంతో అక్కడ పనిచేసే మహిళలు రోజుకు వెయ్యి రూపాయల వరకూ సంపాదిస్తున్నారు. ఎకో కిచెన్‌లో ఏం చేస్తారంటే.. బాధితులైన మహిళలతో సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలు, బియ్యంతో వంటచేయిస్తారు. ఆ ఆహారాన్ని సొడెక్సో అనే వెబ్‌సైట్ ద్వారా వినియోగదారులకు అందిస్తారు. వారికి ఖతీర్ అనే సంస్థ ద్వారా రుచికరమైన, పోషకాలు కలిగిన, ఆరోగ్యవంతమైన వంటలు చేయడంలో శిక్షణ ఇచ్చారు. అలా వారు తయారు చేసిన ఆహారాన్ని వెబ్‌సైట్ ద్వారా విక్రయిస్తుంటారు. వారి పిల్లలకు మంచి పాఠశాలల్లో చదువులు కూడా చెప్పిస్తూ.. తమ బాధ్యత చాటుకుంటున్నారు.



ఏడువారాల నగలు ఎలా?

అందాల తార శ్రీదేవికి ఏడువారాల నగలు అంటే చాలా ఇష్టం. ట్రెడిషన్‌గా కనిపించిన ప్రతీసారి ఆమె వాటిని ధరిస్తుండేది. ఇండియాలో జరిగే వారి కుటుంబ శుభకార్యాలకు శ్రీదేవి ఏడువారాల నగలతో మెరిసిపోయేదట. అలాంటివి మీరూ ధరించాలనుకుంటున్నారా?

చాలామంది ఏడువారాల నగలంటే మొత్తం బంగారు నగలే అనుకుంటారు. బాగా డబ్బున్నవాళ్లు మాత్రమే వీటిని ధరిస్తారనుకునేవాళ్లూ ఉన్నారు. కానీ ఏడు వారాల నగల్ని ఎవ్వరైనా ధరించొచ్చని.. ఎప్పుడైనా వీటిని వేసుకోవచ్చని ఫ్యాషన్ డిజైనర్లు సూచిస్తున్నారు. శ్రీదేవికి ఈ నగలంటే ఇష్టమని తెలియడంతో ఫ్యాషన్ డిజైనర్లు ఏడువారాల నగలపై దృష్టి పెట్టారట. ఎవరెవరు.. ఎప్పుడెప్పుడు ఏ నగలు వేయాలో చెప్తున్నారు. వీటిని వారాలను బట్టి గ్రహాధిపతిని అనుసరించి ధరిస్తే మంచిదట. ఆదివారం సూర్యునికిష్టమైన రోజు కాబట్టి ఆరోజు కెంపులతో చేసిన నగలు.. హారాలు.. చెవిపోగులు ధరిస్తారు. సోమవారం చంద్రునికి ఇష్టమైన రోజు కాబట్టి ముత్యాల ఆభరణాలు ధరించడం శ్రేష్టం. మంగళవారం కుజుడికి ఇష్టమైన రోజు కాబట్టి పగడాలతో చేసిన నగలు ధరించవచ్చు. బుధవారం పచ్చ రంగు హారాలు.. గాజులు ధరించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయట. గురువారం పుష్పరాగంతో చేసిన చెవిపోగులు.. ఉంగరాలు ధరించాలి. శుక్రవారం వజ్రాల హారాలు.. ముక్కుపుడక ధరించడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం కూడా పొందవచ్చు. శనివారం నీలమణి నగలు ధరించాలట. నీలంతో చేసిన కమ్మలు.. నగలు.. ముక్కుపుడక పెట్టుకోవచ్చని డిజైనర్లు సూచిస్తున్నారు.

తలనొప్పి భరించలేను ఎలా?

నా వయసు 41 సంవత్సరాలు, టీచర్‌గా పనిచేస్తున్నాను. ఏడాది క్రితం తీవ్రమైన తలనొప్పి బాధిస్తే కళ్ల డాక్టర్‌కు చూపించుకున్నా. డాక్టర్ పరీక్షలు చేసి కంటి జోడు వాడమని చెప్పారు. అప్పటి నుంచి తలనొప్పి తగ్గింది. కానీ మళ్లీ నెల రోజులుగా తలనొప్పి చాలా ఎక్కువగా ఉంటున్నది. కళ్లు పరీక్ష చేయించుకుంటే కళ్ల జోడు పవర్ ఏమీ మారలేదన్నారు. మందులు సూచించారు. ఆ టాబ్లెట్ వేసుకున్న కొద్దిసేపటి వరకూ పెద్దగా నొప్పి ఉండడం లేదు. టాబ్లెట్ ప్రభావం తగ్గిపోగానే తిరిగి మళ్లీ తలనొప్పి రెట్టింపు అవుతున్నది. ఏ పని తోచడం లేదు. ఇంత తీవ్రమైన తలనొప్పి రావడానికి కారణం ఏమిటి? దీనికి సరైన పరిష్కారం తెలుపగలరు?

- మానస, కోదాడ



తలనొప్పి రావడానికి చాలా కారణాలు ఉంటాయి. మెదడులో నొప్పిని తెలియజేయగల నాడులు లేవు. అందువల్ల మెదడు చుట్టూ ఉండే కణజాలాల్లో నొప్పి తలనొప్పిగా వ్యక్తం అవుతుంది. కపాలం, కళ్లు, చెవులు, సైనస్‌లను దాచి ఉంచే ఎముకలు, కండరాలను పెరిస్టోరియం అనే పలుచని పొర కప్పి ఉంటుంది. దీనిలో వాపు వల్ల లేదా మరేదైనా సమస్య వల్ల తలనొప్పి రావచ్చు. ఈ నొప్పి ఒక్కోసారి భరించలేనంతగా కూడా రావచ్చు. సాధారణంగా తలనొప్పి కొద్ది గంటల పాటు మాత్రమే ఉండవచ్చు. లేదా రోజుల తరబడి విడువని వేదనగానూ ఉండొచ్చు. తలనొప్పికి కారణాన్ని కచ్చితంగా చెప్పటం కష్టం. చిన్న సమస్యే కదా అని నిర్లక్ష్యం కూడా చెయ్యకూడదు. ఒక్కోసారి మెదడులో రక్తస్రావం, కణితి, మెనింజైటిస్ వంటి ప్రాణాంతక కారణాలు కూడా కావచ్చు. కాబట్టి తలనొప్పి విడువకుండా వేధిస్తున్నపుడు సమస్యను కచ్చితంగా గుర్తించి చికిత్స తీసుకోవడం అవసరం. ఇందుకు న్యూరాలజిస్ట్‌ను సంప్రదిస్తే మీ నొప్పికి కారణాలను నిర్ధారించి అందుకు తగిన చికిత్సను సూచిస్తారు. తలనొప్పి ప్రతిసారీ ప్రమాదకరం కాకపోవచ్చు. కానీ విడువకుండా వేధిస్తుంటే మాత్రం ఆలస్యం తగదు.



డాక్టర్ ఆనంద్ బాలసుబ్రమణ్యం
సీనియర్ న్యూరోసర్జన్
యశోద హాస్పిటల్
సికింద్రాబాద్

ప్రతిరోజూ నారింజ..



నారింజ పండ్ల రసం తీసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

- కాల్షియం వంటి రసాయనాల గాఢత విపరీతంగా పెరిగిపోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడుతాయి.
- ఆపరేషన్ ద్వారా వీటిని తొలగించినా మళ్లీ రాళ్లు ఏర్పడుతూనే ఉంటాయి.
- పొటాషియం సిట్రేట్ సప్లిమెంట్లు వాడడం ద్వారా ఈ సమస్యను కొంత వరకు నివారించవచ్చు.
- సప్లిమెంట్ల కన్నా సహజ సిద్ధమైన సిట్రేట్‌లు లభించే సిట్రస్ ఫలాలను తీసుకుంటే మంచిది.
- మిగిలిన సిట్రస్ ఫలాల కన్నా నారింజ పండ్లలోని సిట్రేట్లు మరింత సమర్థవంతగా పనిచేసి రాళ్లు ఏర్పడడాన్ని నివారిస్తాయి.

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 2 మార్చి 2018

బుద్ధమార్గం

మనస్సు.. మట్టి కుండ

బాలుడు అంటే పిన్నవాడు, మూర్ఖుడు అని అర్థాలున్నాయి. తెలిసీ తెలియని ఆ వయసులో తప్పులు చేస్తే పెద్దలు క్షమించాలి, సరిదిద్దాలని చెప్తాడు బుద్ధుడు. పిల్లల్లాగే తొందరపడితే పెద్ద రికం పోతుందని మందలిస్తాడు.

బుద్ధుడు కోసలదేశ రాజధాని శ్రావస్తిలోని జేతవనంలో ఉంటున్నాడు. ఆయన అక్కడున్నాడని తెలిసి ఎందరో భిక్షువులు ఆయన దర్శనం కోసం, ప్రబోధాలు వినడం కోసం వస్తున్నారు. వారిలో కశ్యపుడనే ఒక వృద్ధ భిక్షువు ఉన్నాడు. అతనికి ఇద్దరు కొడుకులు. వారూ భిక్షువులే.



వారికి జేతవనంలో ఒక కుటీరం ఉంది. వారు దూరప్రాంతానికి పోయి ఇప్పుడే వస్తున్నారు. వారిలో పెద్ద కుమారుడు –

'తండ్రీ! నేను త్వరగా జేతవనానికి పోతాను. మీరు మెల్లగా రండి. నేను వెళ్లి మన ఆరామాన్ని శుభ్రం చేసి ఉంచుతాను. మీరు వచ్చి విశ్రమించవచ్చు' అని చెప్పి, 'తండ్రిగారిని జాగ్రత్తగా తీసుకురా' అని తమ్మునికి చెప్పి వెళ్లిపోయాడు.

వృద్ధ భిక్షువు వేగంగా నడవలేకపోతున్నాడు. 'త్వరగా నడవండి' అంటూ ఒక యువ భిక్షువు వృద్ధ భిక్షువుని ముందుకు నెట్టాడు. అలా రెండుమూడుసార్లు జరిగింది. దాంతో వృద్ధ భిక్షువుకి కోపం వచ్చింది. 'నేను ముందుకు నడవను' అంటూ ఆ యువ భిక్షువుని వెనక్కి నెట్టుకుంటూ వచ్చి, అక్కడి నుండి మెల్లగా నడవడం మొదలుపెట్టాడు. చిన్న కొడుకు చెప్పినా వినలేదు. ఇలా యువ భిక్షువులతో గొడవ పడుతూ చీకటి పడి దీపాలు పెట్టే వేళకి జేతవనం చేరాడు. అలా.. మధ్యాహ్నానికి రావలసినవారు పొద్దు పోయాక వచ్చారు. ఆ విషయం మరునాడు బుద్ధునికి తెలిసింది. ఆ వృద్ధ భిక్షువుని పిలిచి –

అపి కస్సప మందియా యువా సపతి హంతి వా
సబ్బం తం ఖమతే ధీరో, పండితో తం తితిక్ఖతి!

ఓ భిక్షూ! కశ్యపా! కుర్రవాళ్లు కురుచబుద్ధి గలవారు. ఆకతాయిలు. తెలిసీ తెలియనివారు. వారి చేష్టల్ని అన్నీ తెలిసిన ప్రాజ్ఞుడు సహించాలి. ఓర్పుతో సర్ది చెప్పాలి. సంస్కరించాలి. వారికి పోటీగా మనమూ తప్పుగా ప్రవర్తించకూడదు. ఆ లేత మనస్సు మట్టికుండ లాంటిది. ఎప్పుడు జారవిడుచుకుంటారో వారికే తెలియదు. అది పగిలితే అతకదు. కాబట్టి వారిని జాగ్రత్తగా ఓర్పుతో, నేర్పుతో సంస్కరించాలి' అని చెప్పాడు.

కశ్యపుడు తన తప్పు తెలుసుకున్నాడు. అందుకే పిన్నవారికి వాడే 'బాల' శబ్దం మయస్సుని తెలియజేస్తే పెద్దవారికి వాడే 'బాల' శబ్దం మూర్ఖత్వాన్ని తెలియజేస్తుంది.

... బొర్రా గోవర్ధన్

ఉపనిషత్సుధ- 11

మనసు ఖాళీ అయితేనే ఆనంద సిద్ధి



యముడు నచికేతుడితో ఇంకా ఇలా చెప్పాడు. 'సత్యాన్వేషణను ప్రారంభించి చివరకు తన స్వరూపం ఆత్మేనని తెలుసు కోగలిగితే సుగతి సులభమే. ఈ అన్వేషణకు నైతికత మూలం కావాలి. దాన్ని ఆధారం చేసుకొని జీవనం కొనసాగించాలి. భౌతిక, మానసిక, సామాజిక క్షేత్రాలను నియమ నిష్ఠలతో, నిబద్ధత, శ్రద్ధ, ఓర్పుతో, వినయంతో, చక్కని స్పృహతో జీవించగల ఆంతరంగికమైన భావనా బలమే నైతికత.

నైతికతను నిలబెట్టేది మనసే. ఏ వస్తువునైనా చూసీ చూడటంతోనే దాని పట్ల ఆకర్షణ పొంది, దాన్ని పొందేదాక యాతన పడి, దాన్ని నిలబెట్టుకోవడంలో అలసిపోయి, కడకు ఆ వస్తువే తన నుండి దూరమైనప్పుడు మిగిల్చే దుఃఖం దుర్భరం కావడంతో విలువైన కాలం కాలిపోతుంది. అది మిగిలిన అన్ని శక్తులను హరించివేస్తుంది. అంటే మనసును రెండుగా చీలి ఒక చీలికలో ఇటువంటి దుర్భర అనుభవాన్ని మిగులుస్తుంది.

పశు ప్రవృత్తి నుంచి ఎంతో తొందరగా బయటపడి మనిషి తనలోని పశుపతి తత్వాన్ని అనుభవమయం చేసుకోవాలి. ప్రాపంచిక సుఖం సాలెగూడు, విషవలయం, సుడిగుండం, అఘాతం.. దీనత్వానికి దానత్వానికి ఇది నిలయం. మానవ జన్మకున్న పరమార్థాన్ని ధ్వంసం చేయగల మహమ్మారి. అదంతా ఇంద్రియాలకు లోబడిన బానిసత్వమే. ఎదుగుదలకు నోచని స్థితి.

నైతిక మార్గం ఇదే..!

నిత్య, సత్య, శాశ్వతమైన వస్తువొకటి ఉన్నదని దాన్ని అనుభవంలోకి తెచ్చుకోగలిగితే కాల గమనంలో సంపూర్ణ శాంతిని, నిర్మలానందాన్ని కలిగించి జీవన పరమార్థాన్ని సుస్పష్టం చేస్తుంది. ఇంద్రియాతీతమైన అద్భుత స్థితి మరొకటి ఉన్నదని, దాన్ని అందుకోగలిగితే ఈ వైకల్యం నుండి బయటపడి సత్యం, ధర్మం, ప్రేమ, శాంతిమయమైన జీవితం అనుభవ రససిద్ధమౌతుందని అనుభవంలోకి వస్తుంది. సంపద పాపిష్టిది కాదు. కానీ పాపిష్టివాని చేతిలో సంపద ఉండకూడదు. అది వినాశకారి.

ఇతరులను ఎవర్నీ బాధించక నిరంతరం సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ సంఘ వికాసానికి పాటుబడగలిగితే అదే అసలైన నైతిక జీవనం. ఆరాటం, పోరాటం వంటి శక్తులన్ని అభ్యుదయాన్ని అలదుకొని అనుకూల భావనలుగా ఆచరణీయ సంకల్పాలుగా రూపాంతరీకరణం పొందుతాయి. ఇవన్నీ సమాజ పురోగమనానికి రాజమార్గాన్ని ఏర్పరుస్తాయి.

నైతికతతో కూడిన స్వేచ్ఛే శుభేచ్ఛ. అది ఆనందాన్ని పరిపూర్ణంగా అనుగ్రహిస్తుంది. సంఘమంతా నిత్య కల్యాణ భూమిక కావాలంటే ఇటువంటి నైతికతే కావాలి. నిజానికి మానవ జీవన పరమార్థం ఇదే.

అంతరంగ శుద్ధి

దేహ భావనను, వస్తువుల యందు ఆసక్తిని క్రమంగా తగ్గించుకుని నైతిక జీవనాన్ని సాగించగలిగిన వ్యక్తి సమాజానికి ఒక బలీయమైన శక్తిగా నిలకడ చెందుతాడు. అంతరంగమనే పాత్రను నిరంతరం, అనుక్షణం శుద్ధి చేసుకుంటుండాలి.
ఎప్పటికప్పుడు మనస్సును ఖాళీ చేసుకుంటుండాలి.

ప్రాపంచిక సుఖాలన్నీ క్షణికాలనీ, అవి దుఃఖారామాలనీ ఇంద్రియాలను రెచ్చగొట్టి చింతలను తుంచివేస్తూ చింతను రగిలిస్తుంటయ్ అనే భావనను బలోపేతం చేస్తూ శాశ్వత సురుచిర ఆనందారామంలోకి ప్రవేశించాలి. ఇదొక దివ్య సాధన.
మానవులు మాత్రమే సాధించగల భవ్య యోగ సాధన.

ఈ సాధన తీవ్రతరం కావాలంటే త్యాగం అవసరం. దీనికి విచక్షణ, దృఢ సంకల్పం, నైతికత ఆధారం. ఇంతటి అధ్యాత్మ మార్గాన్ని ఎన్నుకొని ఎవరు సత్యాన్వేషణను సాగిస్తూ శ్రేయోగామిగా, ఆనంద స్వరూపుడిగా ఉంటాడో వాడే ధీరుడు, వీరుడు, గంభీరుడు..''

'నచికేతా! ఈ మార్గాన్ని నీ విచక్షణతో ఎంచుకొని నీవు ధీరుడవైనావు..' అన్నాడు యముడు.

నత శిరస్కుడైనాడు నచికేతసుడు.

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఐదుగురు దంపతులు!

ప్రపంచంలో ఎన్ని కోట్ల మంది దంపతులు ఉన్నప్పటికీ వాళ్లంతా కేవలం ఈ అయిదు రకాల్లో ఏదో ఒక రకానికి చెందిన వారై ఉంటారు.



లక్ష్మీనారాయణులు

లక్ష్మీ దేవి విష్ణుమూర్తి వక్షస్థలం మీద ఉంటుంది. వక్షస్థలంలోని హృదయం ఆలోచనలకు కూడలి. అక్కడే లక్ష్మి ఉంటుంది. అంటే ఏ భార్యా భర్తల హృదయం ఒక్కటై, ఆలోచన ఒకటై ఉంటుందో ఆ జంటే లక్ష్మీనారాయణుల జంట.

గౌరీశంకరులు

వీరిది అర్ధనారీశ్వర స్వరూపం. తల నుంచి కాలిబొటనవేలి వరకు నిట్టనిలువునా చెరిసగంగా ఉంటారు. రెండూ కలిసిన ఒకే రూపంతో ఉండడం వీరి ప్రత్యేకత. ఆలోచనలకు తల, కార్యనిర్వహణకు కాలు సంకేతం. కాబట్టి భార్యను గొప్పగా చూసుకునే భర్త, భోళాతనంతో భర్త ఆపదలో ఉంటే రక్షించే భార్య ఉండే వారు గౌరీశంకరులు.





బ్రహ్మ సరస్వతులు

బ్రహ్మ నాలుక మీద సరస్వతి ఉంటుందని అంటారు. నాలుక మాటకు సంకేతం. దాని అర్థం ఇద్దరి మాట ఒకటే అవుతుందని అర్థం. ఏ మాట మాట్లాడినా, భార్య మాటే మాట్లాడే భర్త, భర్త మాటే మాట్లాడే భార్యగా ఉండే జంటను బ్రహ్మసరస్వతుల జంటగా చెప్పుకోవచ్చు.

ఛాయా సూర్యులు

చండ ప్రచండుడిగా వెలిగే సూర్యుడిని తట్టుకుంటూ సాగుతుంది అతడి భార్య ఛాయాదేవి. తన భర్త లోకోపకారం కోసం పాటుపడే వాడు, విపరీతమైన తీక్షణత కలవాడైనా తాను నీడలా పరిస్థితికి అనుగుణంగా సర్దుకుపోతూ ఉంటుంది ఛాయాదేవి. భర్త కఠినంగా కోపంగా, పట్టుదలతో ఉండి, భార్య మాత్రం నెమ్మదిగా, శాంతంగా అణకువగానూ ఉండి, సంసారాన్ని తీర్చిదిద్దుకొనే తత్వంతో ఉంటుందో అలాంటి జంట ఛాయా సూర్యుల జంట.






రోహిణీ చంద్రులు

చంద్రుడు ఆహ్లాదాన్ని కలుగజేసి విపరీతమైన ఆకర్షణ కలిగి ఉంటాడు. చాలా మృదుస్వభావి. కానీ రోహిణీ కార్తె మహా వేడిగా, ఉగ్రంగా ఉంటుంది. ఏజంటలో భర్త మెత్తగా, ఆకర్షణీయంగా ఉండి, భార్య మాత్రం కఠినాతి కఠినంగా, కోపంతో, పట్టుదలతో ఉంటుందో ఆ జంట రోహిణీ చంద్రులు.

గీతాంజలి



మాతా నాస్తి, పితా నాస్తి
నాస్తి బంధు సహోదర
అర్థం నాస్తి, గృహం నాస్తి
తస్మాత్ జాగృత, జాగృత

తల్లి లేదు, తండ్రి లేదు, సోదరీసోదరులు, బంధువులు లేరు. ఆస్తి పాస్తులు, ఇతర బంధాలు అన్నీ తాత్కాలికం, సత్యం కానివి. తస్మాత్ జాగ్రత్త!

కామ క్రోధంచ లోభంచ
దేహీ తిష్ఠంతి తస్కరా
జ్ఞాన రత్నాపహారాయ
తస్మాత్ జాగృత, జాగృత

కామం, క్రోధం, లోభత్వం మనలో మనకు తెలియకుండా ప్రవేశించే దొంగల వంటివి. ఇవి మనలోని జ్ఞానం, అవగాహన వంటి రత్నాలను దొంగిలిస్తాయి తస్మాత్ జాగ్రత్త!

ఆది శంకరాచార్య

ఆశయబద్ధతే లోకా
కర్మణా బహుచింతయా
ఆయుక్షీణం నజానాతి
తస్మాత్ జాగృత జాగృత

మనలోని ఆశ మన జీవితాన్ని చాలా పరిమితుల్లో బంధిస్తుంది. అందులో ఎంత కూరుకుపోతామంటే మన ఆయువు తరిగిపోతున్న విషయమే స్ఫురణకు రాదు. తస్మాత్ జాగ్రత్త!

సువార్త

బలహీనతలను వదిలితేనే...

ఈస్టర్ ఆదివారానికి ముందు క్రైస్తవులు లెంట్/శ్రమల దినములను 45 రోజుల పాటు ఆచరిస్తారు. బూడిద బుధవారంతో ప్రారంభమై ఈస్టర్ సండే వరకు ఇది కొనసాగుతుంది. ఈ కాలాన్ని దేవునికి మరింత సన్నిహితం కావడానికి వారు ఉపయోగించుకుంటారు. ఉపవాస ప్రార్థనలు చేస్తారు, ఏమైనా దురలవాట్లు, వ్యసనాలు ఉంటే వదులుకోవడానికి ప్రయత్నిస్తారు. కొంతమంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఇటువంటి ఆచారాలను గూర్చి బైబిల్‌లో ఎక్కడా ప్రస్తావన లేనప్పటికీ క్రైస్తవులలో చాలామంది వాటిని పాటిస్తున్నారు. కేవలం కొన్ని రోజుల మట్టుకు తమ దురలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉన్నంత మాత్రాన ఎవరూ దేవునికి సన్నిహితం కాలేరు. 'ఎవడైనను నన్ను వెంబడించగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువ ఎత్తుకొని నన్ను వెంబడింపవలెను' (లూకా 9:23) అని యేసు చెప్పాడు. తన్ను తాను ఉపేక్షించుకోవడమంటే తమను తాము తగ్గించుకోవడం. ఉపవాసం ఉండటమంటే భోజనం మానటం కాదు తమ



లోని బలహీనతలను వదులుకోవడం. మానవుల్లో దేవునితో సాన్నిహిత్యాన్ని దూరం చేసే అనైతికత, స్వార్థం, లంచగొండితనం, ఇతరులపై అసూయ, కోపం, ద్వేషం, దూషణ వంటి బలహీనతలు ఉంటాయి (ఎఫెసి 4:31) ఇవన్నీ దేవుని పట్ల విశ్వాసాన్ని దూరం చేస్తాయి. అందువల్ల 'ఒకనియెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తు నందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి' అని బైబిల్ చెప్తుంది (ఎఫెసి 4:35). అలాగే దేవునిపై విశ్వాసమున్న వారు తమలోని నిరాశను, నిస్పృహను నిరుత్సాహాన్ని వదులుకోవాలి. తమకు లేనిదానిని గూర్చి చింతించకుండా ఉన్నదాని పట్ల సంతృప్తి చెందాలి. రెండోది సిలువను ఎత్తుకోవడమంటే క్రీస్తు భారాన్ని మోయటం. మానవులను ప్రేమించి, వారిని పాపమును నుండి రక్షించుటకు దేవుడు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చి తన ప్రాణమును బలిగా అర్పించాడు. 'నేను సాత్వికుడను, దీనమనస్సుగలవాడను.. నా యొద్ద నేర్చుకొనుడి. నా కాడి సులువుగాను నా భారము తేలికగాను ఉన్నది' అని యేసు చెప్పాడు. కాడి అనే సిలువను మోయటమంటే ఆయనవలె ఇతరులను ప్రేమించడం. యేసును అనుసరించేవారు ఆయన తమ పట్ల చూపిన ప్రేమను వారు ఇతరుల పట్ల చూపించాలి. ఈ లెంట్ కాలంలో ఫిర్యాదులను మాని కృతజ్ఞతగా ఉందాం, నిరాశను వదిలి ఆశావాదాన్ని అలవర్చుకుందాం, ద్వేషాన్ని వదిలి ప్రేమించడం నేర్చుకుందాం, చింతను వదిలి దేవునివైపు చూద్దాం. మన దురలవాట్లు, వ్యసనాలను వదులుకోవడం వల్ల మిగిలే సొమ్మును పేదలకు ఇచ్చేందుకు ప్రయత్నిద్దాం. యేసును పోలి జీవించుదాం.

... జాషువా

ఖురాన్ మాట



అవినీతికి అసలు మూలం

ఈనాడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో అవినీతిది అగ్రతాంబూలం. వేల కోట్ల రూపాయలు ఇట్టే కైంకర్యం అయిపోతున్నాయి. స్వార్థం, స్వలాభం– తద్వారా పుట్టుకొచ్చిన ధనాశ దీనికి మూలం. ఎలాగైనా సంపాదించాలి.. వెండి బంగారాలు కూడబెట్టాలి. పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకోవాలి. అపార్టుమెంట్లు, వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకోవాలి. లక్షలు కాదు, కోట్లకు పడగలెత్తాలి. కోటీశ్వరులైతేనే కోరుకున్నది పొందవచ్చు. సిరిసంపదలే సమస్త అవసరాలూ తీర్చగల సాధనం. కాబట్టి వీలైనంత ఎక్కువగా సంపాదించి, బ్యాంకు బ్యాలెన్సు పెంచుకోవాలి. స్విస్ బ్యాంకుల్లో దాచుకోవాలి. అర్థబలంతోనే అంగబలం.. అధికారం.. అందలం.. అన్నీ వస్తాయి. అవినీతికి అసలు మూలం ఇదే.

మానవుడి ధనాశ ఎన్నటికీ తీరేది కాదు. తాను మాత్రమే కాదు తన పిల్లలు, మనవలు, ముని మనవలు సైతం కోటీశ్వరులైపోవాలని కోరుకుంటాడు. మనిషి కోట్లకు పడగలెత్తిన తరువాత దాని సంరక్షణకు గుండాలను పోషిస్తాడు. అధికారులకు లంచాలిస్తాడు. తరువాత ఎన్నికల బరిలో నిలిచి రాజకీయ రక్షణ కవచం సంపాదిస్తాడు. వీటన్నింటికీ పెట్టిన ఖర్చులు వడ్డీతో సహా రాబట్టుకోవడానికి రాజకీయం ముసుగులో పెద్ద పెద్ద కుంభకోణాలకు తెరలేపుతాడు. అయినప్పటికీ అతని ధనపిపాస తీరదు, సంతృప్తి లభించదు. ఈ విషయాన్ని ముహమ్మద్ ప్రవక్త (స) ఎంత సోదాహరణంగా వివరించారో చూడండి.

''మానవుడికి బంగారంతో (సిరిసంపదలు) నిండిన ఒక పెద్ద లోయ లభిస్తే అతను మరొకటి కావాలని కోరుకుంటాడు. రెండవది కూడా లభిస్తే మూడవది కావాలని అభిలషిస్తాడు. మానవ ఉదరం మట్టితో మాత్రమే నిండుతుంది (అంటే సమాధికి చేరిన తరువాతనే ధనాశ అంతమవుతుందని అర్థం). అయితే ప్రాపంచిక వ్యామోహాన్ని వదిలిపెట్టి పశ్చాత్తాప హృదయంతో అల్లాహ్ వైపుకి మరలితే ఆయన వారిని మన్నిస్తాడు. పశ్చాత్తాపాన్ని స్వీకరించి వారిని అనుగ్రహిస్తాడు'' (అలాంటి వారికి ఆత్మ సంతృప్తి ప్రాప్తమవుతుంది).

ముహమ్మద్ ప్రవక్త ఇలా చెప్పారు –

'అత్యధిక సిరిసంపదలతో కలిమి రాదు. అసలైన కలిమి ఆత్మ సంతృప్తి ద్వారానే ప్రాప్తమవుతుంది'.

అందుకని మనిషి వక్రమార్గాలు విడిచి, అవినీతి, అధర్మాలకు పాల్పడకుండా ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అవలంబించాలి. ఆశ ఉన్నా అది దురాశగా మారకుండా జాగ్రత్తపడాలి. ఎప్పుడూ మధ్యేమార్గాన్ని అవలంబించాలి. సర్వకాల సర్వావస్థలో ధర్మాధర్మాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితిలోనూ మధ్యేమార్గాన్ని విడిచిపెట్టకూడదు. కొంతమేరకైనా స్వార్థాన్ని వీడి సమాజం కోసం ఆలోచిస్తే అవినీతికి అణువంతైనా ఆస్కారం ఉండదు. దీనికోసం సర్వసంగ పరిత్యాగం చెయ్యవలసిన అవసరం లేదు. మంచీ చెడు, ధర్మాధర్మాలు, సత్యాసత్యాలు, న్యాయాన్యాయాల లాంటి విషయాల పట్ల విచక్షణతో ఉండాలి. ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవచించినట్లు 'మనిషి తన స్వయానికి ఏ స్థితిని కోరుకుంటాడో పరుల విషయంలో కూడా అదే స్థితిని అభిలషించేవాడై ఉండాలి'. ప్రతి ఒక్కరూ ఈవిధంగా ఆలోచిస్తే ఈనాడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సకల సమస్యలూ వాటంతట అవే పరిష్కారమైపోతాయి.

... – మదీహా అర్జుమంద్

సుడోకు

డైలీ సుడోకు 142 సమాధానం

1	8	7	9	2	4	5	3	6
5	6	2	8	1	3	4	7	9
3	4	9	6	5	7	1	8	2
7	5	6	2	3	1	9	4	8
2	1	4	5	8	9	3	6	7
8	9	3	7	4	6	2	1	5
4	7	8	3	9	2	6	5	1
9	3	5	1	6	8	7	2	4
6	2	1	4	7	5	8	9	3


డైలీ సుడోకు -143

	8		5			7		
	2				7			9
				4	9			3
		4		2		6		
	9						5	
		5		1		9		
7			4	6				
2			1				3	
		8			3		6	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



అల్లు అర్జున్
@alluarjun

రెండు మిలియన్ల ఫాలోవర్స్ అయ్యారు. ప్రతి ఒక్కరి ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు.

అల్లు అర్జున్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
2,008,975

కామన్‌మ్యాన్ వాయిస్

కొందరిని జగద్గురువు అని అభిమానులు సంభోదిస్తూ ఉంటారు కదా! ఇంతకూ ఈ సందర్భంలో జగత్తుకు అర్థమేమిటి? ఈ జగద్గురువు అనే మాటను విశిష్టాద్వైత పీఠాధిపతులు కూడా అంగీకరిస్తారా?
–Shivaramakrishna Penna

దొంగలు బ్యాంకులను దోచుకెళ్తుంటే.. ఈ బ్యాంకు వాళ్లు కష్టమర్ల దగ్గర దోచుకుంటున్నారు. వాళ్లకు వీళ్లకు పెద్దగా తేడా ఏం లేదు బాస్.
–Raj Uragonda

మంచి చెయ్యాలనుకునే వారికి ఏ విషయంలోనూ తోడుండని దేవుడు.. చెడు చేసే వారికి మాత్రం అన్ని విషయాల్లోనూ తోడుంటాడు.
–Harish Kuvvakula

వైరల్ వీడియో



రంగా రంగ రంగస్థలాన పాటకు పనిచేసిన టెక్నీషియన్స్‌ను పరిచయం చేసిన వీడియో యూట్యూబ్‌లో ట్రెండ్ అయింది.

Rangasthalam 2nd Single Sneak Peek | Ranga Ranga Rangasthalana | Ram Charan | Samantha | Aadhi | DSP

Total views : 470,726+
Published on Feb 28, 2018

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 2 మార్చి 2018

రక్షణ కవచం..గ్రేట్ వాల్ ఆఫ్ చైనా!

ట్రావెలాగ్-9

అక్కడి నించి బీజింగ్‌కి ఉత్తర దిశలో ఉన్న ఏడు ప్రాచీన ప్రపంచ వింతల్లో ఒకటైన చైనా వాల్‌కి బయలుదేరాం. చైనాకి దక్షిణం వైపు హిమాలయాలు పెట్టని గోడలు. కాని ఉత్తర సరిహద్దులో మంగోలియా నించి శత్రువుల దాడి ఎక్కువగా ఉండేది. మంగోలియన్లు బాగా క్రూరులు. దాంతో రక్షణగా క్రీస్తు పూర్వం 220-206లో ఉత్తర దిశలో తూర్పు నించి పడమర వైపుకి ఓ పెద్ద గోడని నిర్మించారు. క్విన్ షి హుయాంగ్ అనే చక్రవర్తికి ఈ ఆలోచన వచ్చింది. ఆయన మొదటి గోడని మంగోలియా సరిహద్దులో తూర్పున షాన్ హైగ్యుయార్ నించి, పడమర లాప్ లేక్ అనే ప్రదేశం దాకా నిర్మించాడు. ఆ తర్వాతి రాజులు అందరూ శిథిలమైన ఆ గోడ స్థానంలో కొత్త గోడలని నిర్మిస్తూ దాని ఎత్తుని పెంచుతూ వచ్చారు. నేడు కనబడే గోడ, వాచ్ టవర్స్ మింగ్ డైనాస్టీకి చెందినవి. క్రీ. శ. 1600లో దీని నిర్మాణం పూర్తయింది. ఇటుకల మధ్య ఉపయోగించిన సిమెంట్‌లో బియ్యపు పిండిని కూడా కలిపారని ఎక్కడో చదివాను.

ఈ గోడ పొడవు 6, 259 కిలో మీటర్లు. దీనికి తోడు 359 కిలోమీటర్ల పొడవైన ట్రెంచ్‌లు, 2,232 కిలోమీటర్ల పొడవైన సహజమైన రక్షణలు అంటే పర్వతాల లాంటి అడ్డంకులు కూడా ఉన్నాయి. ఈ మొత్తానికి గ్రేట్ వాల్ ఆఫ్ చైనా అని పేరు. గోడ పొడవునా అనేక సైనిక బేరక్స్, గేరిసన్ స్టేషన్లు ఉన్నాయి. రక్షణకే కాక బార్డర్ కంట్రోల్‌కి, వస్తు రవాణా మీద సుంకం విధించడానికి, వలసల రాకపోకలని నియంత్రించడానికి కూడా ఈ గోడ ఉపయోగపడేది. విశాలమైన గోడ పై భాగాన్ని సరుకు రవాణాకి రోడ్డుగా కూడా ఉపయోగించేవారు. సరుకులని కూడా అక్కడే భద్రపరిచేవారు.

నిజానికి మూడు చైనా వాల్స్ ఉండేవి. మొదటి రెండూ మట్టి, రాళ్లు కలిపి కట్టిన గోడలు. అవి శిథిలమయ్యాయి. మొదటి చైనా వాల్ ఐదు వేల కిలోమీటర్ల పొడవు, రెండోది 8 వేల కిలోమీటర్ల పొడవు ఉండేది. నేడు మనం చూసేది మూడోది. యంత్రాలు లేని ఆ రోజుల్లో కొండల్లో ఇంత బలమైన, పొడవైన, విశాలమైన గోడని నిర్మించడం అద్భుతం. 1961లో దీన్ని చైనా జాతీయ సంపదగా గుర్తించింది. దీనిమీద కొన్ని చోట్ల కారుని డ్రైవ్ చేయవచ్చు. నేటి చైనా వాల్ మీద నడవడానికి మొత్తం రెండేళ్లు పడుతుంది.

ఇది ఎడారులు, కొండలు, మైదానాల మీంచి వెళ్తుంది. సిగ్నల్ టవర్స్‌లో సైనికులు నివసిస్తూ, ఆ గోడ పొడవునా గుర్రాల మీద తిరుగుతూ పహారా కాసేవారు. ఆ రోజుల్లో సైనికులు ఓ టవర్ నించి ఇంకో టవర్‌కి సమాచారం పంపడానికి పగలు పొగతో, రాత్రి నిప్పుతో సంకేతాలు పంపేవారు. అందుకని ఆ వాచ్ టవర్స్‌ని బీకన్ టవర్స్ అంటారు. తోడేళ్ల పేడతో ఈ పొగ సందేశాలను పంపేవారు. ఒక స్మోక్ సిగ్నల్ అంటే ఐదు వందల మంది, రెండు సిగ్నల్స్ అంటే వెయ్యిమంది దాడి చేస్తున్నారని అర్థం. గంటల శబ్దాలతో, డోళ్లతో కూడా సమాచారాన్ని ఓ టవర్ నించి మరో టవర్‌కి పంపేవారు. గోడ ఉత్తరం వైపు ఎత్తుగా, బలంగా ఉండడానికి కారణం, శత్రువులు అటువైపు నించే దాడి చేస్తారని. దక్షిణం వైపు తక్కువ ఎత్తుండి, అటునించి ప్రవేశ ద్వారాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ పదమూడో శతాబ్దంలో చంఘీజ్‌ఖాన్ (మంగోలియన్లు) పదిహేడో శతాబ్దంలో మంచూరియన్స్ దీన్ని దాటి రాగలిగారు. మంగోలియన్ నేత



చంఘీజ్ ఖాన్ 1211-1223 మధ్య ఈ గోడని దాటి చైనా భూభాగాన్ని జయించి పాలించాడు.

1966-76 మధ్య చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవ సమయంలో అనేక చోట్ల గ్రేట్‌వాల్ చుట్టుపక్కల గ్రామస్థులు దాన్నించి ఇటుకలని దొంగిలించి ఇళ్లని నిర్మించుకున్నారు. స్థానికులు ఇళ్ల నిర్మాణం కోసం ఇటుకలని పీక్కువెళ్లడం వల్ల చైనా గోడ క్రమంగా మాయం అవుతోది. ఇప్పటికి 1,962 కిలోమీటర్ల గోడ తవ్వకాలకి గురయింది. గోడ మొత్తానికి కాపలా పెట్టడం కష్టమైన పని. 1987లో యునెస్కో దీన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. నిజానికి యూరోపియన్స్ గ్రేట్ వాల్ ఆఫ్ చైనా అనే పేరు పెట్టి ఆరాధించడం ఆరంభించాకే చైనీస్‌కి దీని గొప్పదనం తెలిసింది. చంద్రుడి మీంచి తీసిన ఫొటోల్లో భూగోళం మీద కనిపించే కట్టడం కేవలం గ్రేట్ వాల్ ఆఫ్ చైనానే అనేది వదంతి మాత్రమే. ఇది అంతరిక్షం నించి కనిపించదు. ఐతే అంతరిక్షం నించి చైనా గాల్లోని కాలుష్యం కనిపిస్తుంది.

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి



గుర్రం లాంటి మనిషి!

సెలవుల్లో ఎటైనా టూర్ వెళదామని నా చిన్నప్పట్నుంచి చెబుతుండేవాడు నాన్న . సమయాభావమో, మరే ఇతర కారణమో తెలియదు, ఎన్నో సెలవులు వచ్చి వెళ్లిపోయాయిగాని నాన్న మాట కార్యరూపం దాల్చలేదు. నేను పీజీ చదువుతున్నప్పుడు అనుకోకుండా ఒక మంచి టూర్ ప్లాన్ వేసుకున్నాం. అమ్మానాన్న, అక్కబావ, మేనమామ-మేనత్త, నేను, తమ్ముడు, మరో నలుగురు కజిన్స్.. అంతా కలిసి తూఫాన్ వాహనంలో ప్రముఖ దేవస్థానాల్ని సందర్శించేందుకు బయల్దేరాం. మాతో పాటే మా నాయనమ్మ కూడా వచ్చింది. స్పెషల్‌గా ఎందుకు చెబుతున్నానంటే.. ఆ ప్రయాణంలో పెద్ద షాక్ ఇచ్చింది ఆవిడే. పొరపాటున జరుగకూడనిది ఏమైనా జరిగిఉంటే మరోసారి టూర్ అంటే మా ఫ్యామిలీ ఉలిక్కిపడే పరిస్థితి వచ్చేది.

అది 2009...

నేను పీజీ చివరి సంవత్సరం చదువుతున్నా. సెమిస్టర్ హాలిడేస్ రావడంతో మా నాన్నను టూర్ వెళ్దామని అడిగాను. మా అమ్మతో సహా కుటుంబమంతా వన్‌సైడ్ అయిపోవడంతో మా నాన్న ఓకే అనక తప్పలేదు. పదిహేను మంది కులాసాగా వెళ్లగలిగే వాహనంలో మొత్తం పద్నాలుగు మందిమయ్యాం. మరీ ఇరుకిరుకుగా కాకుండా రిలాక్స్‌గా ప్రయాణం చేయగలిగాం. ఒక సాయంత్రం వేళ ఇష్టదైవాన్ని తలుచుకొని ఒక కొబ్బరికాయ కొట్టి ప్రయాణాన్ని ప్రారంభించాం.

అప్పటివరకూ మా ఇంట్లో వాళ్లెవ్వరూ తిరుపతిని దర్శించలేదు. నేనైతే అప్పటికే చాలాసార్లు వెళ్లొచ్చాను. అందుకే మొదటగా వెంకటేశ్వరుణ్నే దర్శించుకోవాలనుకొన్నాం. అలా మొదలైన ప్రయాణం రాత్రంతా సాగి పొద్దున్నే తిరుపతి చేరుకున్నాం. అప్పటివరకూ మా ఊరు చుట్టుపక్కల ఉండే చిన్నచిన్న దేవస్థానాలనే చూసిన మా ఫ్యామిలీ.. నిత్యకల్యాణం-పచ్చతోరణంలా వెలిగిపోయే ఆ ఇలవైకుంఠాన్ని, అక్కడి భక్తజన సంద్రాన్ని, తిరుమలేశుడి వైభవాన్ని చూసి ఆశ్చర్యపోయింది. అదేమిటో! మేము వెళ్లే సమయానికి ఏడు కొండలపై విపరీతమైన రద్దీ. అందరం తలనీలాలు సమర్పించి, స్నానాదులు పూర్తిచేసి సర్వదర్శనం లైన్‌లో నిల్చున్నాం. పదిగంటలు వేచిఉన్న తర్వాతగాని స్వామివారు మాకు దర్శనమివ్వలేదు. ఆ ఆపదమొక్కుల వాణ్ని దర్శించుకొన్నామనే ఆనందంలో అందరం బయటికొస్తున్నాం. ఆ కోలాహలంలో తప్పిపోయే ప్రమాదం ఉండడంతో ఒకరిచేయి ఒకరం పట్టుకొని నడుస్తున్నాం. అంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ మాకందరికీ అనుకోని షాక్. మా నాయనమ్మ (అవ్వ) తప్పిపోయింది. నీళ్లలా ప్రవహిస్తున్న జనాల్లో ఆమె ఎక్కడుందో తెలుసుకోవడం కష్టమే అనిపించింది. ఏం చేయాలో దిక్కు తోచలేదు. మా అమ్మానాన్నల్లో అందరికన్నా ఎక్కువ టెన్షన్. పెద్దావిడ లేకుండా తిరిగి ఇంటికెలా వెళ్లేది? అని తమలో తామే బాధపడుతున్నారు. మేమంతా తలా ఒకదిక్కు వెతుక్కుంటూ వెళ్లాం. అయినా ఎక్కడా కనిపించలేదు. వెంకటేశ్వరుణ్ని దర్శించుకొన్న ఆనందం అక్కడే ఆవిరైపోయింది మాకు. తీర్థయాత్రలకు తీసుకెళ్లి ముసలావిడను వదిలేసి వచ్చారంటూ నలుగురూ నానా రకాలుగా మాట్లాడుకుంటారేమోనని మా అమ్మలో మరింత టెన్షన్ మొదలైంది. ఆపద తీర్చే భారం ఆపదమొక్కుల వాడిపైనే వేసింది. ' స్వామీ! గుర్రం లాంటి మనిషి. నీ కొండకొచ్చి తప్పిపోయింది. మళ్లీ మా చెంతకొచ్చేట్టు చూడు. నీకొక వెండి గుర్రాన్ని చేయించి పంపుతా' అని మొక్కుకుందట మనసులో(తర్వాత మాతో చెప్పింది). నిజంగానే ఆమె గుర్రమంత శక్తి కలిగిన మనిషి. వయసు డెబ్బై దాటినా పదిహేడేళ్ల అమ్మాయితో పోటీపడి పనులు చేయగల హుషారు ఆమె సొంతం. అందుకే అమ్మ అలా సంబోధించడంలో మాకేం ఆశ్చర్యం కలుగలేదు.

> ' స్వామీ! గుర్రం లాంటి మనిషి. నీ కొండకొచ్చి తప్పిపోయింది. మళ్లీ మా చెంతకొచ్చేట్టు చూడు. నీకొక వెండి గుర్రాన్ని చేయించి పంపుతా'

స్వామి మహిమో మరేమిటో తెలియదుగాని, పది నిమిషాల తర్వాత ఒక పోలీసాయన చేయిపట్టుకొని అటు నుంచి మా అవ్వ రావడం గమనించాం. పైపైనే ఎగిరిపోయిన మా ప్రాణాలు.. మళ్లీ మా దగ్గరికొచ్చినట్టు అనిపించింది. అందరం వెళ్లి ఒక్కసారిగా ఆమెను గట్టిగా పట్టుకొన్నాం. కన్నీళ్లు కాస్తా ఆనందబాష్పాలుగా మారిపోయాయి. 'ఏంటే ముసలి.. అందరం చేయి పట్టుకొనే కదా నడుస్తున్నాం, ఎప్పుడు విడిచిపెట్టేశావ్? ' అని అడిగితే ' మీరే నా చేయి విడిచిపెట్టేసి ముందుకెళ్లిపోయారు' అని రివర్స్ పంచ్ వేసింది.

అసలింతకు ఏం జరిగింది?

ఇప్పటివరకూ ఎక్కడున్నావ్? అని అడిగితే ఒక కథలా చెప్పింది నాయనమ్మ. అది విన్నాక నిజంగా ఆమె స్థానంలో వేరే ఎవరున్నా హడలిపోయేవారేమో అనిపించింది. కానీ మా నాయనమ్మ మాత్రం.. మా నుంచి తప్పిపోయానని తొందరగానే గ్రహించింది. ఈ కోలాహలంలో మళ్లీ మమ్మల్ని కలువడం కష్టమే అనుకున్నది. కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయ్. దుఃఖం ముంచుకొస్తున్నది. అయినా అధైర్య పడకుండా తన జాగ్రత్తలో తాను ఉన్నది. చెవులకు ఉన్న కమ్మలు, మెడలో ఉన్న గుండ్ల హారం తీసి మెల్లగా తన ఆకుల సంచీలో వేసేసుకున్నది. అక్కడే ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటే వెళ్లి పలుకరించింది. 'అయ్యా నేనిట్లా మా వాళ్ల నుంచి తప్పిపోయాను.. నన్ను మా ఊరి బస్సెక్కిస్తావా?' అని అడిగింది. అలాగే అంటూ ఆయన ఆమెను పట్టుకొని నడుచుకుంటూ వస్తుండగా మా కంట పడింది. అవ్వొచ్చేసింది! అని అనగానే అందరి కళ్లూ వెలిగిపోయాయ్. ప్రాణాలు ఒక్కసారిగా కుదుటపడ్డాయ్. అప్పటివరకూ మరిచిపోయిన ఆకలి మళ్లీ గుర్తొచ్చి భోజనాలు కానిచ్చాం. మా ప్రయాణంలో అది దేవుడు పెట్టిన పరీక్షలా భావించాం. కాసేపు బాధపడ్డాం, కాసేపు నవ్వుకున్నాం. మా అవ్వని కొద్దిసేపు ఆటపట్టించాం. ఇంతటి ఉపద్రవాన్ని తప్పించిన భగవంతుడికి దండం పెట్టుకుంటూ శ్రీకాళహస్తికి పయనమయ్యాం. అనంతరం కాణిపాకం సిద్ధివినాయకుడి దర్శనం చేసుకొని ఇంటికి బయల్దేరాం. దాదాపు దశాబ్దం గడిచినా ఆ సంఘటన మాత్రం నా జ్ఞాపకాల నుంచి తొలిగిపోలేదు. ఏ టూర్ వెళ్లినా ఇప్పటికీ అది గుర్తొస్తే.. నవ్వొచ్చేస్తుంది.

... పి.నవీన్ కుమార్
బిలాల్‌పూర్

పేరులోనే ముంది?

'హయత్' నగర్

శతాబ్దాల చరిత్ర కలిగిన మన భాగ్యనగరంలో అణువణువూ అద్భుతమే. ప్రతి ప్రదేశమూ చూడదగినదే. నగరంలోని పలు ఏరియాలకు ఉన్న పేర్లు కూడా విభిన్నంగా ఉంటాయి. కానీ వాటి నేపథ్యం మాత్రం చరిత్రతో ముడిపడి ఉన్నదే. అలా తరతరాలుగా నగర ప్రజల నోళ్లలో నానుతున్న పేర్లలో ఒకటి హయత్‌నగర్.

హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రాంతాల్లో ఒకటి హయత్‌నగర్. అసలీ ప్రాంతానికి ఈ పేరెలా వచ్చిందో చాలామందికి తెలియదు. నిజాంల కన్నా ముందు హైదరాబాద్‌ను కుతుబ్‌షాహీలు పాలించారు. అసలు ఇంతటి అందమైన నగరాన్ని నిర్మించిందే వాళ్లు. నాలుగో కుతుబ్‌షాహీ అయిన కులీ.. తన భార్య భాగమతి పేరిట ఈ నగర నిర్మాణానికి పునాది వేశాడు. వాళ్లిద్దరి సంతానమే హయత్‌బక్షీ బేగం. మూడు పదుల వయసులోనే భర్తను పోగొట్టుకొన్న హయత్.. ధీశాలిగా పేరుగాంచింది. పన్నెండేళ్ల తన కుమారుడు అబ్దుల్లాను పట్టాభిషిక్తుణ్ని చేసి రాజ్యాన్ని సమర్థవంతంగా పాలించింది. అతనికి స్వతంత్రంగా బాధ్యతలు నిర్వర్తించే వయసు వచ్చేవరకు.. రాజమాతగా పాలనాబాధ్యతలను పర్యవేక్షించి గొప్ప రాజనీతిజ్ఞురాలిగా పేరు తెచ్చుకున్నది. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు తొలిసారిగా హైదరాబాద్‌ను ఆక్రమించేందుకు దండెత్తి వచ్చినప్పుడు దౌత్యం నడిపి యుద్ధవాతావరణాన్ని తప్పించిన ఆమె చతురత హైదరాబాద్ చరిత్రలో చెక్కు చెదురని అంశం. అలాంటి పరిస్థితుల్లో తన మనుమరాలిని ఔరంగజేబు కుమారుడికిచ్చి వివాహం చేసిందామె. అలా చాలా కాలం పాటు మొగలులతో ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చేసి పాలనలో తన ఘనతను చాటుకొన్నది. ఆ వీరనారి పేరు మీద ఏర్పడిందే నేటి హయత్‌నగర్. కుతుబ్‌షాహీల అనంతరం నిజాంల పాలన వచ్చినా, ఆ తర్వాత హైదరాబాద్ స్వతంత్ర భారత్‌లో విలీనమైనా, అరువై ఏండ్ల పాటు సీమాంధ్రుల పాలనలో ఉన్నా.. హయత్‌నగర్ పేరిట ఆమె పేరు నేటికీ చిరస్థాయిగా నిలిచి ఉన్నది.

నమస్తే తెలంగాణ
చిత్రం



రాజ్‌తరుణ్

పవిత్ర ప్రేమికుడు

రాజ్‌తరుణ్, రిద్ధికపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'లవర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. అనీశ్‌కృష్ణ దర్శకుడు. జూన్ 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. ఆధునిక ప్రేమికుడి కథతో తెరకెక్కిస్తున్నాం. తన ప్రేమను అతడు ఎలా సఫలం చేసుకున్నాడన్నది ఆసక్తిని పంచుతుంది. పవిత్ర ప్రేమకు నిర్వచనంలా కథ సాగుతుంది. ఆద్యంతం వినోదభరితంగా సాగుతూనే చక్కటి ఫీల్‌ను కలిగిస్తుంది. రాజ్‌తరుణ్, రిద్ధికపూర్ పాత్రలు కొత్త పంథాలో వుంటాయి. సమీర్‌రెడ్డి ఛాయాగ్రహణం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి.

యదార్థ ఘటనలతో..



కె.టి.నాయక్, శ్రీకాంత్, వెంకట్

వెంకట్ మూవీస్ సంస్థ రూపొందిస్తున్న చిత్రం 'దండుపాళ్యం-4'. కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మిస్తున్నారు. ఈ నెల 8న చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ ''దండుపాళ్యం మొదటి రెండు భాగాల్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. దండుపాళ్యం-4కోసం దర్శకుడు కె.టి.నాయక్ ఆసక్తికరమైన కథ చెప్పారు. మంచి స్క్రిప్ట్‌తో ఈ సినిమాను మొదలుపెడుతున్నాం. ఇందులో రెండు గ్యాంగ్‌లుంటాయి. ఆద్యంతం ఉత్కంఠకరమైన మలుపులతో స్క్రీన్‌ప్లే ప్రధానంగా ఈ కథ నడుస్తుంది. దండుపాళ్యం ముఠాకు సంబంధించిన పరిశోధన ద్వారా మాకు ఎంతో సమాచారం లభించింది. దీనితో పది సీక్వెల్స్ తీయొచ్చు. యదార్థ సంఘటనల స్ఫూర్తితో దండుపాళ్యం-4ను తెరకెక్కించబోతున్నాం' అన్నారు. 'నేను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పుట్టి పెరిగాను. తమిళనాడు, కర్ణాటకలో స్థిరపడ్డాను. ప్రేక్షకుల అంచనాల్ని అందుకునేలా సీక్వెల్ ఉంటుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ సీక్వెల్ పెద్ద విజయాన్ని సాధించాలని కార్యక్రమానికి అతిథిగా హాజరైన హీరో శ్రీకాంత్ పేర్కొన్నారు.

ఆర్‌ఎక్స్ 100

రామ్‌గోపాల్‌వర్మ శిష్యుడు అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఆర్‌ఎక్స్ 100'. 'ఆన్ ఇన్‌క్రెడిబుల్ లవ్‌స్టోరీ' ఉపశీర్షిక. కార్తికేయ, పాయల్ రాజ్‌పుత్ నాయకనాయికలుగా నటిస్తున్నారు. కేసీడబ్ల్యూ పతాకంపై అశోక్‌రెడ్డి గుమ్మకొండ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్ర ప్రీలుక్‌కు ఆదివారం విడుదల చేశారు. భావోద్వేగాలు మేళవించిన ప్రేమకథా చిత్రమిదని, కథ, కథనరీతి సహజంగా వాస్తవాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని చిత్ర బృందం చెబుతున్నది. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



'రంగస్థలం'చిత్రంలో రామ్‌చరణ్

రంగా..రంగా..రంగస్థలానా

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.ఎమ్) నిర్మిస్తున్నారు. సమంత కథానాయిక. మార్చి 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. ఈ చిత్ర తొలి గీతం 'వేరుసెనగా కోసం మట్టిని తవ్వితే ఏకంగా తగిలిన లంకేబిందెలాగా ఎంత సక్కగున్నావే' పాటకు అద్భుతమైన స్పందన లభించిన విషయం తెలిసిందే. సోషల్‌మీడియాలో ఈ పాట టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతున్నది. తాజాగా ఈ సినిమాలోని 'రంగా రంగా రంగస్థలనా' అనే గీతాన్ని నేడు విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఈ పాటకు సంబంధించిన ప్రోమోను సోషల్‌మీడియాలో చిత్రబృందం విడుదల చేసింది. 'రంగ..రంగా...రంగస్థలానా' అనే పల్లవితో హుషారెత్తించే జానపద శైలిలో ఈ గీతం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. చంద్రబోస్ ఈ గీత రచన చేశారు. అభిమానులు ఉర్రూతలూగించేలా చక్కటి బాణీలో ఈ పాటు అభిమానులందరికి ఆకట్టుకుంటుందని చిత్రబృందం చెబుతున్నది.

నిధి అన్వేషణలో 'గులేబకావళి'

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సీనియర్ నటి రేవతి ఓ శక్తివంతమైన పాత్రలో నటించారు. ఈ చిత్రం సంక్రాంతికి విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ నెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా వుంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా వుంటుంది' అని తెలిపారు. ప్రభుదేవా, హన్సిక, రేవతి, మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టంట్స్: పీటర్ హెయిన్స్, సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్‌ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు: సామ్రాట్, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.

నందికొండ వాగుల్లోన



గట్టు రామచంద్రరావు, ఆర్.కె.గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్


షఫీ, సాయికిరణ్, పూజశ్రీ, మేఘన, జ్యోతిక యాదవ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నందికొండ వాగుల్లోన'. సత్యనారాయణ దర్శకుడు. రఘు.హెచ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర గీతాల్ని ఎర్రోళ్ల శ్రీనివాస్, ట్రైలర్ శివారెడ్డి ఇటీవలే హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. నందికొండ వాగుల్లోన ఏం జరిగింది? రెండు జంటలకు ఆ ప్రదేశంలో ఎలాంటి అనూహ్య పరిణామాలు ఎదురయ్యాయన్నది ఆసక్తికరంగా ఉంటుంది. నవతరం మనోభావాలకు దర్పణంలా ఉండే చిత్రమిది' అని తెలిపారు. 'రొమాన్స్, ప్రేమ, కామెడీ అంశాల సమాహారంగా సినిమా ఉంటుంది. చిన్న సినిమా అయినా ఆ భావన కలగకుండా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించాం. కష్టపడి చేసిన మా ప్రయత్నానికి చక్కటి ఫలితం దక్కుతుందనే నమ్మకముంది' అని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుదేవా, హన్సిక



WUNDERBAR FILMS PVT.LTD
DHANUSH
Proudly Presents
LYCA PRODUCTIONS
TEASER FROM TODAY
SUPERSTAR RAJINI IN & AS
కాలా
కరికాలుడు
PA.RANJITH
MURALI.G SANTHOSH NARAYANAN SREEKAR PRASAD T.RAMALINGAM ANTHONY BJ RUBAN
SREERAMAKRISHNA DHILIP SUBBARAYAN KABILAN, UMADEVI, ARUNRAJA KAMARAJ, ARIVU BRINDA
SANDY SUREN.G R.RAKESH S.P. CHOKALINGAM RS RAJA ANUVARDHAN, SUBIKA, SELVAM
BANU, RAJA SARAVANAN RIAZ K AHMED MAKUTA REDDOT PAVAN
EXECUTIVE PRODUCER S.VINOD KUMAR
PRODUCED BY DHANUSH
MUSIC ON Wunderbar Studios
divo
APRIL 2018


THANKS TO ALL
FOR MAKING A BIG SUCCESS
-C. KALYAN
CK సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
50th DAY
జైసింహా
సి.కళ్యాణ్ కె.యస్.రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
యం.రత్నం సి.రాంప్రసాద్ రామ్-లక్ష్మణ్ ప్రవీణ్ ఆంథోని అన్‌బరివు వెంకట్ నారాయణరెడ్డి వంశీ శేఖర్
ADITYA MUSIC



హోళీ పండుగ సందర్భంగా తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను ఆధ్వర్యంలో రూపొందించిన సీడీని గురువారం తన నివాసంలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్, తెలంగాణ జాగృతి చెల్లంశెట్టి హరిప్రసాద్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీను, యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

-హైదరాబాద్, నమస్తే తెలంగాణ



రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమితుడైన గుత్తా సుఖేందర్‌రెడ్డి గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తాను కేటీఆర్‌ను అభినందించారు.

సీఐ మహేశ్‌కు మంత్రి కేటీఆర్ అభినందన

శంషాబాద్ రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ చిన్నారిని ఆర్జీఐఏ సీఐ మహేశ్ స్వయంగా తన కారులో దవాఖానకు తీసుకెళ్లి చికిత్స కోసం ఆర్థికంగా సహకరించిన తీరును మంత్రి కేటీఆర్ గురువారం అభినందించారు. మరో ఘటనలో ఓ మహిళ శంషాబాద్ బస్టాండ్‌లో మృతి చెందడంతో ఆమె కుమారుడికి ఆర్థికసాయం అందించి స్వగ్రామానికి వెళ్లడానికి సీఐ మహేశ్ సహకరించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ ఇప్పటికే ట్విట్టర్‌లో సీఐ మహేశ్‌ను అభినందించారు. గురువారం నొవాటెల్ హోటల్ వద్ద జరిగిన కార్యక్రమానికి బందోబస్తుగా వచ్చిన సీఐ మహేశ్‌ను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.



శృంగేరి శంకరాచార్య శ్రీవిధుశేఖర భారతీస్వామి గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా నందిన్నె గ్రామానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వామి వారికి స్వాగతం పలికారు. పూర్ణకుంభం, వేదసూక్తులు, ప్రభుత్వ లాంఛనాలతో స్వామిని ఆహ్వానించారు.

- హైదరాబాద్, నమస్తేతెలంగాణ

త్వరలోనే కొత్త పంచాయతీలు

ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు
కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ
నాలుగువేలకుపైగానే జోడింపు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామపంచాయతీల పునర్విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. వారం పది రోజుల్లో ఈ పక్రియ అంతా పూర్తికానుంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు చేరాయి. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల నుంచి దాదాపు 4,122 కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 1,879 సాధారణ ఆవాసాలు.. 2,243 తండాలు ఉన్నాయి. నల్లగొండలో 309, మహబూబ్‌నగర్‌లో 265, కొత్తగూడెంలో 258, వికారాబాద్‌లో 221, ఆదిలాబాద్‌లో 209 కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 110కి పైగా తండాలు గ్రామపంచాయతీలుగా మారనున్నాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ పెద్ద సంఖ్యలో తండాలు పంచాయతీలుగా మారనున్నాయి. జిల్లాల కలెక్టర్లు మండలాలవారీగా కొత్త గ్రామపంచాయతీల ప్రతిపాదనలను మ్యాపులతోసహా రూపొందించి పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదికలు సమర్పించారు. పరిశీలన ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 8,684 గ్రామపంచాయతీలున్నాయి. తాజాగా వచ్చిన ప్రతిపాదనలన్నింటికీ ఆమోదం లభిస్తే వాటి సంఖ్య 12,806కు చేరుతుంది. కొత్త పంచాయతీల ఏర్పాటుతోపాటు గ్రామ పరిపాలనలో పలు విధివిధానాలు, మార్గదర్శకాలతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నది. ఇందుకు సంబంధించిన బిల్లును ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతమున్న గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జూలై 31తో పూర్తికానున్నది. గడువు ముగిసేలోపే కొత్త పంచాయతీలను ఏర్పాటుచేసి.. అన్నింటికి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది.

నేడు కృష్ణా బోర్డు భేటీ

- వాడివేడిగా జరుగనున్న సమావేశం
- మరో 30.38 టీఎంసీలు కావాలన్న ఏపీ
- లెక్కతేల్చేందుకు త్రిసభ్య సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కృష్ణానది నీటివాడకంపై శుక్రవారం జరిగే బోర్డు సమావేశం వాడిగావేడిగా చర్చలు చోటుచేసుకునే అవకాశమున్నది. ఓవైపు వాటాకంటే అధికమొత్తంలో నీటిని వాడుకోవడమే కాకుండా ఇంకా నీళ్లు కావాలని అడుగుతున్న ఏపీకి తెలంగాణ గట్టి జవాబు చెప్పేందుకు సమాయత్తమవుతున్నది. న్యాయమైన వాటాకోసం బలమైన వాదనలు సిద్ధం చేసింది. కృష్ణా జలాల్లో ఏపీ అదనంగా నీటిని వాడుకున్నట్టు ఓ వైపు లెక్కలు తేలుస్తుంటే అదనంగా ఇంకా నీరు కావాలని ఆ రాష్ట్రం నదీ యాజమాన్య బోర్డు ముందు పేచీ పెడుతున్నది. దీంతో బోర్డు నీటివాటాలు తేల్చేందుకు శుక్రవారం త్రిసభ్య సమావేశం ఏర్పాటు చేసింది. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి మరో 30.38 టీఎంసీల నీరు విడుదల చేయాలంటూ ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు కృష్ణాబోర్డుకు లేఖ రాశారు. ఏపీలో పంటలు ఎండుతున్నాయని, వాటిని కాపాడుకునేందుకు నీటిని కేటాయించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కృష్ణాజలాల వినియోగంపై గత నెల 8న నిర్వహించిన బోర్డు సమావేశంలో ఏపీ 60 టీఎంసీలు, తెలంగాణ 50 టీఎంసీలు వినియోగించుకునేందుకు ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం ఏపీకి 60 టీఎంసీలు తరలించాల్సి ఉండగా... మంగళవారం నాటికి 62.33 టీఎంసీలను తరలించినట్టు గుర్తించారు. దీనిపై బోర్డుకు తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో, సాగర్ కుడికాల్వ నుంచి రెండువేల క్యూసెక్కులను నిలిపివేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మరో 30 టీఎంసీల నీరు కావాలంటూ ఏపీ పట్టుపడుతుండటంతో... కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని శుక్రవారం జలసౌధలో నిర్వహిస్తున్నారు. ఈ భేటీలో ఏపీ కోటా పూర్తికావడంతో తదుపరి నీటి విడుదలపై చర్చించడం, సాగర్, శ్రీశైలం నుంచి నీటి విడుదలను పునరుద్ధరించడం, వాటాలో వినియోగాన్ని లెక్కించడం వంటి అంశాలను చర్చించనున్నారు. నాగార్జునసాగర్ కుడికాల్వ నుంచి 78.351 టీఎంసీలకు అనుమతివ్వగా 77.730 టీఎంసీలు వినియోగించామని, ఇంకా 10.66 టీఎంసీలు విడుదలకు అవకాశం ఇవ్వాలని ఏపీ ఈఎన్సీ తన లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా ఎడమ కాల్వ నుంచి 14.427 టీఎంసీలకు అనుమతిచ్చారని, ఇప్పటివరకు 10.210 టీఎంసీలు వినియోగించామని, మరో 7.72 టీఎంసీలు కేటాయించాలని, కృష్ణా డెల్టా నుంచి 21 టీఎంసీలకు అనుమతి ఉండగా, 14.920 టీఎంసీలు వినియోగించామని, మరో 8 టీఎంసీలు కేటాయించాలంటూ కోరారు. హంద్రీనీవా, ముచ్చుమర్రి నుంచి 30.953 టీఎంసీలు కేటాయించారని, 31.674 టీఎంసీలను వాడుకున్నామని, ఇక్కడ నుంచి 4 టీఎంసీలు తీసుకునేందుకు అనుమతివ్వాలంటూ ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు బుధవారం లేఖ రాశారు. కృష్ణా జలాల వినియోగంపై ఫిర్యాదులు కొనసాగుతుండటంతో రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖల ఈఎన్సీలతో శుక్రవారం కృష్ణా బోర్డు సమావేశం ఏర్పాటు చేసింది.



ప్రముఖ సాహితీవేత్త నాయుని కృష్ణమూర్తి ఇకలేరు



బెంగళూరు: ప్రముఖ సాహితీవేత్త నాయుని కృష్ణమూర్తి గురువారం బెంగళూరులో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాయుని బెంగళూరులోని దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. నాయుని కృష్ణమూర్తి చిత్తూరు జిల్లా నడిమిచెర్లలో 1951లో జన్మించారు. చిన్ననాటినుంచే సాహిత్యం, నవలపై ఆసక్తి పెంచుకున్న ఆయన 23 ఏండ్ల వయస్సులోనే రచించిన యామినీ కుంతలాలు నవల మంచి ఆదరణ పొందింది. ఆ తరువాత పత్రికారంగంలోకి ప్రవేశించిన ఆయన పలు పత్రికల్లో ఉప సంపాదకుడిగా పనిచేశారు. స్నేహబాల అనే పిల్లల పత్రికను నిర్వహించారు. విజయవాణి ద్వారా నాయుని ప్రచురించిన మాబడి, పాఠశాల విద్యాసంబంధ మ్యాగజైన్లు విద్యార్థుల్లో మంచి ఆదరణ పొందాయి. కృష్ణమూర్తి పలు తెలుగుచిత్రాలకు పాటలు కూడా రాశారు. మహర్షి చిత్రంలోని 'సుమం ప్రతి సుమం సుమం' పాట ఆయన కలంనుంచి జాలువారినదే. తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకుగాను నాయుని కృష్ణమూర్తి జీవనసాఫల్య పురస్కారం అందుకున్నారు. స్వగ్రామం చిత్తూరు జిల్లాలోని చౌడేపల్లిలో శుక్రవారం నాయుని అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

జడ్జీలను వెంటనే నియమించాలి

- హైకోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు
- మదీనా వరకు భారీర్యాలీ, ఆందోళన
- నేడు కూడా విధులకు దూరంగా ఉంటామని ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యాయమూర్తుల నియామకాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి హైకోర్టులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. మూడేండ్లుగా పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించకపోవడం, ఇతర న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారని న్యాయవాదులు మండిపడ్డారు. న్యాయమూర్తుల పోస్టుల భర్తీలో జాప్యం, సీఆర్పీసీ 41-ఎ సెక్షన్ సవరణ, 2012కు పూర్వం నాటి కేసులను ఈ ఏడాది మార్చి 31లోగా పరిష్కరించాలనే నిబంధనతో తలెత్తుతున్న సమస్యలపై ఆందోళన చేపట్టారు. న్యాయవాదులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించడంతో గురువారం జరుగాల్సిన పలు కేసుల విచారణ వాయిదాపడింది. న్యాయవాదులు బార్ కౌన్సిల్ గేట్ నుంచి భారీ ర్యాలీగా మదీనా చౌరస్తాకు చేరుకుని ఆందోళన చేపట్టారు. జడ్జీల నియామకాలు లేకపోవడంతో కేసుల విచారణ కుంటుపడుతున్నదని, దీంతో కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జెల్లి కనకయ్య, తెలంగాణ న్యాయవాదుల కన్వీనర్ గండ్ర మోహన్‌రావు, తెలంగాణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. శుక్రవారం కూడా విధులు బహిష్కరిస్తున్నట్టు న్యాయవాద సంఘాలు తెలిపాయి.



గురువారం విధులు బహిష్కరించి మదీనా చౌరస్తాలో ఆందోళన నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

నేటి నుంచి సినిమా ప్రదర్శనలు బంద్!

- వర్చువల్ ప్రింట్ ఫీజు అసలు సమస్య
- డిజిటల్ ప్రొవైడర్లు దిగొచ్చేవరకు బంద్!
- నిర్మాతల ఐకాస చైర్మన్ సురేశ్‌బాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణభారత్‌లోని ఐదు రాష్ట్రాల్లోని థియేటర్లలో శుక్రవారం సినిమా ప్రదర్శనలు నిలిచిపోనున్నాయి. డిజిటల్ ప్రొవైడర్స్‌తో తలెత్తిన సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో శుక్రవారం నుంచి సినిమా థియేటర్ల బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు నిర్మాతల ఐకాస చైర్మన్ డీ సురేశ్‌బాబు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ డిజిటల్ ప్రొవైడర్‌ల నుంచి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి దక్షిణాదికి చెందిన ఐదురాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్) వసూలు చేయడం అనేది డిజిటల్ ప్రొవైడర్లకు, నిర్మాతలకు మధ్య ఎదురవుతున్న ప్రధాన సమస్య అని వివరించారు. 'ఆంగ్ల చిత్రాలకు వీపీఎఫ్ వసూలు చేయడం లేదు. కానీ తెలుగు చిత్రాలకు మాత్రం ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. పూర్తిగా తగ్గించాలని మేం కోరుతున్నాం. ఈ విషయంలో వారు దిగొచ్చేవరకు థియేటర్ల బంద్ కొనసాగుతుంది' అని చెప్పారు. సినిమా ప్రదర్శన సమయంలో 20 నిమిషాల పాటు ప్రకటనలు వేస్తుండటంతో ప్రేక్షకులు అసహనానికి గురవుతున్నారని సురేశ్‌బాబు చెప్పారు. 'ఇలాంటి పలు అంశాలపై వారితో చర్చిస్తున్నాం. కొన్నింటి విషయంలో సానుకూలంగా స్పందించారు. ఇంకా వారితో చర్చలు కొనసాగుతున్నాయి. తదుపరి చరిగే చర్చలను బట్టి ముందుకు వెళ్తాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీ కల్యాణ్, కే మురళీమోహన్, జెమినీ కిరణ్, సునీల్ నారంగ్, కే దామోదరప్రసాద్, ముత్యాల రాందాస్ పాల్గొన్నారు.



గురువారం మీడియాతో మాట్లాడుతున్న సురేశ్‌బాబు, జెమినీ కిరణ్, సీ కళ్యాణ్, దామోదరప్రసాద్, సునీల్‌నారంగ్

టీఎస్సార్టీసీ ఎండీ రమణరావుకు అభినందనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్సార్టీసీ) తరపున రెండు జాతీయఅవార్డులు అందుకున్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణరావుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, పలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. గురువారం టీఎస్సార్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో సంస్థ కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్‌రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తంనాయక్, రవీందర్, సత్యనారాయణ, సీసీవోఎస్ అజయ్‌కుమార్ తదితరులు రమణరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (ఏఎస్ఆర్టీయూ) ప్రకటించిన జాతీయఅవార్డుల్లో టీఎస్సార్టీసీ వాహన ఉత్పాదకత, కేఎంపీఎల్ క్యాటగిరీలో రెండు అవార్డులను సాధించింది. రెండు రోజుల క్రితం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సంస్థ తరపున ఎండీ రమణరావు ఈ అవార్డులను అందుకున్నారు.



టీఎస్సార్టీసీ ఎండీ రమణరావును అభినందిస్తున్న వెంకటేశ్వర్‌రావు, అధికారులు

ప్రభుత్వోద్యోగులకు వృత్తినైపుణ్య శిక్షణ

- ఎంసీఆర్‌హెచ్చార్డీలో రెండోదశ శిక్షణ ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వోద్యోగుల్లో వృత్తినైపుణ్యాన్ని పెంపొందించేందుకు మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) వారికి శిక్షణ ఇస్తున్నది. కేంద్ర డీవోపీటీ మార్గదర్శనంలో ఉద్యోగులకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నది. మొదటిదశలో 60 వేల మందికి ఈ లెర్నింగ్ విధానంలో వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వగా, తాజాగా రెండోదశ కార్యక్రమం ప్రారంభమైందని ఎంసీఆర్‌హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి బీపీ ఆచార్య తెలిపారు. రెండోదశలో ఒక్కోజిల్లా నుంచి 9వేల మంది ఉద్యోగులకు ఈ లెర్నింగ్ ద్వారా వృత్తినైపుణ్య శిక్షణ ఇస్తామని చెప్పారు. మొత్తం 12 అంశాలపై ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మజ్లిస్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అఖిల భారత మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ 60 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పార్టీ ప్రధానకార్యాలయం దారుస్సలాంలో మజ్లిస్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు పార్టీ ప్రధానకార్యాలయంలో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పతాకాన్ని ఎగురవేస్తారు. అనంతరం అక్కడే బహిరంగసభను నిర్వహించనున్నారు.

ఒక్కచోటికే తెలంగాణ పదసంపద


- తెలంగాణ భాషా నిఘంటువు కృషి వేగవంతం
- పదసేకరణకు త్వరలో వెబ్‌సైట్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ భాషా నిఘంటువు నిర్మాణ కృషి ఊపందుకుంటున్నది. తెలుగు విశ్వవిద్యాలయం సారథ్యంలో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల రెండోవారంలో సంపాదకమండలి, పండితమండలి, వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ, రాష్ట్ర అధికారభాషా సంఘం, తెలుగు భాష అభివృద్ధికోసం పనిచేస్తున్న వివిధ సంస్థలతో కలిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి సారథ్యంలో సంపాదకమండలి కూడా ఏర్పాటైంది. సూర్యారాయాంధ్ర నిఘంటువుల శేషాన్ని నిర్మించిన ఆచార్య రవ్వాశ్రీహరి, నలిమెల భాస్కర్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, ఆచార్య అమరేశ్వరం రాజేశ్వరశర్మ, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి తదితర పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇదివరలోనే సంసిద్ధతను వ్యక్తం చేశారు. తెలుగువిశ్వవిద్యాలయం అధ్యాపకుడు సంగిశెట్టి శ్రీనివాస్ ఈ సంపాదకమండలికి, తెలంగాణ సాంస్కృతిక కేంద్రానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ బృహత్ప్రణాళికను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆర్థిక సహకారాన్ని కోరాలని పండితమండలి అభిప్రాయపడింది.

తెలంగాణ నిఘంటువు వెబ్‌సైట్

ఈ ప్రణాళికలో భాగంగా వారం రోజులలో సాంకేతిక నిపుణుల సహాయంతో వెబ్‌సైట్ నిర్మాణం సిద్ధం కానున్నట్టు సమాచారం. ప్రపంచంలో ఎక్కడ ఉన్న తెలుగువారైనా సరే తమ వద్దనున్న కొత్త పదాలను, పదసంపదను ఈ వెబ్‌సైట్‌కు పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న నిఘంటువుకు వేయి కొత్తపదాలను అందించినట్టయితే ఆ నిఘంటువులో వారి పేరును నమోదు చేస్తారు. తెలంగాణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తాను సేకరించిన తెలంగాణ పదాలన్నింటినీ నిఘంటువుకు ఇస్తానని ఘంటా చక్రపాణి ఇదివరలోనే తెలిపారు. అదే విధంగా 'జర్నలిస్టు కరదీపిక' పేరుతో పత్రికా పదకోశం రూపొందించిన 'నమస్తే తెలంగాణ' సంపాదకుడు కట్టా శేఖర్‌రెడ్డి తాము సేకరించిన పదాలను నిఘంటువుకు అందిస్తామని పేర్కొన్నారు.

త్వరలో విస్తృతస్థాయి సమావేశం



తెలుగు విశ్వవిద్యాలయంలో నిఘంటువు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతోనే ఈ పనులన్నింటినీ చేస్తున్నాం. మార్చి రెండోవారంలో పెద్దలందరితో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తాం. ఇప్పటికే వేలసంఖ్యలో పదాల సేకరణ జరిగింది. వీటన్నింటితో వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నాం. వెబ్‌సైట్ ద్వారా కొత్త పదాలను సేకరించే ప్రయత్నాలు చేస్తాం. ఈ నిర్మాణ పనులు నిరంతరం జరిగేవిధంగా తెలంగాణ సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేశాం.

- తెలుగు వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ

టీజీబీ అకౌంటెంట్‌కు 73.38 లక్షల అక్రమ ఆస్తులు

- దర్యాప్తులో కనుగొన్న సీబీఐ
- నిందితుడిపై మరో కేసు నమోదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ) స్కాంలో నిందితుడిగా ఉన్న బ్యాంకు అకౌంటెంట్‌కు ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది. 2010-2018 మధ్యకాలంలో టీజీబీ అజీజ్‌నగర్ బ్రాంచ్‌లో రూ.8.94 కోట్ల మేరకు నిధుల గోల్‌మాల్ జరిగింది. గతనెల 19న బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఫిర్యాదుతో సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. నిధుల దుర్వినియోగానికి సంబంధించి అజీజ్‌నగర్ టీజీబీ బ్రాంచ్‌లోని కొందరు అధికారులతోపాటు, అకౌంటెంట్ ఎం జైపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో జైపాల్‌రెడ్డి ప్రధాన నిందితుడని పేర్కొన్నది. దర్యాప్తులో భాగంగా జైపాల్‌రెడ్డి, అతడి కుటుంబసభ్యుల ఆస్తులను పరిశీలించి అతడికి రూ.73.38 లక్షల మేరకు ఆదాయానికి మించిన ఆస్తులున్నట్టు గుర్తించింది. జైపాల్‌రెడ్డి భార్య షాలిని పేరుతో కూడా ఆస్తులు ఉన్నట్టు కనుగొన్నది. 2010-2018 మధ్య జైపాల్‌రెడ్డి బ్యాంకులో పనిచేస్తున్నప్పుడు అడ్డదారుల్లో డబ్బు సంపాదించాడని, అక్రమ సంపాదనతో అత్యంత విలాసవంతమైన జీవనం సాగిస్తూ ఏడేండ్లలో రూ. 23,48,415 ఖర్చుచేశాడని దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి జైపాల్‌రెడ్డిపై సీబీఐ తాజాగా మరో కేసునమోదు చేసింది. కేసులోని ఇతర నిందితుల ఆస్తులపై కూడా ఆరా తీస్తున్నది. ఈ కేసులో ఒకట్రెండు రోజుల్లో కొందరిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నేటినుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శుక్రవారం జరుగనున్న ఇంటర్మీడియట్ సెకండియర్ (ద్వితీయ భాష) పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను, ఎగ్జామినర్లను నియమించామని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ అఫిలియేషన్‌కు 190 దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరానికిగాను 190 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు దరఖాస్తులు చేసుకున్నాయి. అయితే గత ఏడాదికంటే ఈసారి 17 దరఖాస్తులు తక్కువగా వచ్చాయని జేఎన్టీయూహెచ్ అధికారులు తెలిపారు. అఫిలియేషన్ దరఖాస్తుల గడువు గురువారంతో ముగిసింది. ఎంబీఏ కోర్సుల కోసం 16 కాలేజీలు, ఫార్మసీ కోర్సుల కోసం 70 కాలేజీలు అఫిలియేషన్ దరఖాస్తులు సమర్పించుకున్నాయి. మే మొదటివారంలోగా అఫిలియేషన్ ప్రక్రియ ముగించడానికి నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలను ఫిబ్రవరి 26 నుంచే ప్రారంభించారు. మార్చి 20 వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయి.

కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలి

- ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర కార్మిక సమాఖ్య వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాన్ని రూ.18 వేలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక సమాఖ్య(టీఆర్‌కేఎస్) విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు గురువారం చందానగర్‌లో నిర్వహించిన టీఆర్‌కేఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయించినట్టు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బీ సురేశ్, ఉపాధ్యక్షుడు మొగుళ్ల కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువులు, వంటగ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమొబైల్, సిమెంట్, కెమికల్, నిర్మాణ రంగాలుసహా మొత్తం 73 రంగాల కార్మికుల వేతనాలు పెంచాల్సి ఉందని పేర్కొన్నారు.

ఏడోవేతన సవరణను అమలుచేయండి

- వ్యవసాయశాఖ పరిశోధన శాస్త్రవేత్తల డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏడోవేతన సవరణను అమలుచేయాలని వ్యవసాయశాఖ పరిశోధన శాస్త్రవేత్తలు గురువారం నిరసన తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని వ్యవసాయశాఖ పరిశోధనక్షేత్రంలో మధ్యాహ్న భోజన సమయంలో 15 నిమిషాలు నల్లబ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. వారంపాటు నిరసన తెలుపుతామని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల ఫోరం ప్రధాన కార్యదర్శి ఇలంగోవన్ తెలిపారు.

1,217 కోట్ల ఆస్తులు జప్తు

- పీఎన్‌బీ కుంభకోణంలో ఈడీ దూకుడు
- ఒక్కరోజే చోక్సీకి చెందిన 41 ప్రాపర్టీలు అటాచ్
- హైదరాబాద్ గీతాంజలి జెమ్స్ పార్క్ కూడా సీజ్
- బ్యాంక్ ఎండీ సునీల్ మెహతాను విచారించిన అధికారులు



ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ స్వాధీనం చేసుకున్న మెహుల్ చోక్సీ స్థిరాస్తులు ఇవే

ముంబై/న్యూఢిల్లీ, మార్చి 1: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. గురువారం ఒక్కరోజే దేశ వ్యాప్తంగా గీతాంజలి జెమ్స్, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీలకు చెందిన 41 ఆస్తుల్ని జప్తు చేసింది. వీటి విలువ రూ.1,217 కోట్లపైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు. సుమారు రూ.13,000 కోట్ల ఈ స్కాంలో నీరవ్ మోదీ ప్రధాన నిందితుడవగా, నీరవ్ మేనమామ మెహుల్ చోక్సీ నంబర్ 2గా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మెహుల్ చోక్సీ, ఆయనకు చెందిన గీతాంజలి జెమ్స్‌లపై మనీ లాండరింగ్ కేసును నమోదు చేసిన ఈడీ.. ఈ వివారాలలో భాగంగానే వివిధ ప్రాంతాల్లోని ఆస్తులను జప్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే గురువారం ముంబైలోని బోరివలి (తూర్పు)లోగల నాలుగు ఫ్లాట్లు, శాంతాక్రజ్ (తూర్పు)లోగల ఖేనీ టవర్‌లోని తొమ్మిది ఫ్లాట్లుసహా మొత్తం 15 ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్నది. మరో 17 కార్యాలయాలనూ అటాచ్ చేసిన ఈడీ.. కోల్‌కతాలో ఓ మాల్, అలీబాగ్‌లో ఫామ్ హౌజ్‌లను కూడా అటాచ్‌మెంట్ చేసింది. అలాగే మహారాష్ట్రలోని నాసిక్, నాగ్‌పూర్, పన్వెల్, తమిళనాడులోని విల్లుపురం ప్రాంతాల్లోగల 231 ఎకరాల భూమిని కూడా స్వాధీనపరచుకున్నది. అంతేగాక హైదరాబాద్‌కు సమీపంలోని రూ.500 కోట్లకుపైగా విలువచేసే 170 ఎకరాల జెమ్స్ పార్కునూ సీజ్ చేసింది. 'ఈరోజు మొత్తం 41 ఆస్తుల్ని అటాచ్ చేశాం. ఇవన్నీ చోక్సీ అధీనంలో ఉన్నవే. వీటి విలువ రూ.1,217.2 కోట్లుగా ఉంటుందని అంచనా' అని ఈడీ గురువారం ప్రకటించింది. మెహుల్ చోక్సీ, రోహన్ పోర్ట్, గీతాంజలి ఎక్స్‌పోర్ట్స్ కార్పొరేషన్, గీతాంజలి జెమ్స్ లిమిటెడ్, డిసెంట్ సెక్యూరిటీస్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఆండ్ఆర్ ఫిన్‌స్టాక్ ప్రైవేట్ లిమిటెడ్, రోహన్ మెర్కంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ తదితరుల పేర్లపై ఈ ఆస్తులు ఉన్నట్లు తెలిపింది. గత వారం నీరవ్ మోదీ, అతని గ్రూప్‌నకు చెందిన 21 స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి విదితమే. వీటి విలువ రూ.523.72 కోట్లుగా ఉన్నది. మొత్తం ఈ కేసులో ఇప్పటిదాకా దేశ వ్యాప్తంగా 198 సోదాలను నిర్వహించామని, రూ.5 వేల కోట్లకుపైగా విలువచేసే బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, రత్నాలు, విలువైన రాళ్లు, ఆభరణాలు, వాచీలను సీజ్ చేశామని ఈడీ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇక ఇప్పటికే నీరవ్, చోక్సీ, వారి ఆధ్వర్యంలోని సంస్థలకు చెందిన షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌ను ఈడీ సీజ్ చేసింది. అలాగే బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ.. నీరవ్, అతని సోదరుడు నిషాల్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన లగ్జరీ కార్లనూ జప్తు చేసింది. కాగా, ఈ ఆస్తులకు సంబంధించిన స్వతంత్రంగా తామే విలువ కడుతున్నట్లు ఈడీ వివరించింది. ఇదిలావుంటే పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ మెహతాను ముంబైలోని తమ ప్రాంతీయ కార్యాలయంలో ఈడీ గురువారం విచారించింది. ఇప్పటికే బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మాజీ రావును ప్రశ్నించిన ఈడీ.. ఈ మోసాన్ని ఎలా గుర్తించలేకపోయారు, ఇతర బ్యాంకింగ్ విధానాలను ఆరా తీసింది.

నాన్-బెయిలబుల్ వారెంటివ్వండి

మెహుల్ చోక్సీకి వ్యతిరేకంగా ముంబైలోని ప్రత్యేక కోర్టుకు వెళ్లిన ఈడీ.. నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని గురువారం కోరింది. అలాగే సీబీఐ ప్రత్యేక కోర్టులో నీరవ్ మోదీ ఇంటిని సోదా చేసేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేసింది. దక్షిణ ముంబైలోని నీరవ్ ఇంటిలో తనిఖీలు చేపడితే ఈ కేసు మరింత పురోగతి సాధిస్తుందన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంగా కోర్టులో ప్రత్యేక ఈడీ ప్రాసిక్యూటర్ హితేన్ వెనెగావ్‌కర్ వ్యక్తం చేశారు. కాగా, వీటిపై శనివారం సీబీఐ కోర్టు ఆదేశాలిచ్చే అవకాశాలున్నాయి. మరోవైపు నీరవ్ మోదీ గ్రూపునకు చెందిన మూడు బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రకటించింది.

గురువారం జప్తు చేసిన ఆస్తులివే

- ముంబైలోని 15 ఫ్లాట్లు
- ముంబైలోనే ఉన్న 17 ఆఫీసులు
- కోల్‌కతాలోని ఓ మాల్
- అలీబాగ్‌లోని నాలుగు ఎకరాల ఫామ్ హౌజ్
- మహారాష్ట్ర, తమిళనాడుల్లోని 231 ఎకరాల భూమి
- రంగారెడ్డి జిల్లాలోగల 170 ఎకరాల జెమ్స్ పార్కు

అది ఆడిటింగ్ కాదు: పీఎన్‌బీ

బ్రాడీ హౌజ్ శాఖలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎలాంటి ఆడిటింగ్ నిర్వహించలేదని పీఎన్‌బీ స్పష్టం చేసింది. దాదాపు రూ.13,000 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం.. ముంబైలోని ఈ బ్యాంక్ బ్రాడీ హౌజ్ శాఖలోనే జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అక్కడ ఆర్బీఐ ఆడిట్ జరిగిందన్న వార్తలు రాగా, వాటిని పీఎన్‌బీ ఖండించింది. అది ఆడిటింగ్ కాదని, వార్షిక ప్రాతిపదికన బ్యాంకులపై ఆర్బీఐ జరిపే పర్యవేక్షణ అని వివరించింది. కాగా, మూడేండ్లకుగాను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా లింగం వెంకట ప్రభాకర్‌ను పీఎన్‌బీ నియమించుకున్నది. రామ్ సంగపురే పదవీ విరమణతో ప్రభాకర్‌ను తీసుకున్నది.

పరిపాలనా వ్యవస్థ మెరుగవ్వాలి: ఎస్‌బీఐ చీఫ్

అసలే మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)తో సతమతమవుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వరుసగా వెలుగుచూస్తున్న మోసాలు, కుంభకోణాల నేపథ్యంలో పటిష్ఠమైన పరిపాలనా వ్యవస్థ అవసరమని మెరుగవ్వాలని ఎస్‌బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. వ్యాపార లావాదేవీలు, కార్యకలాపాల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి తమ కార్పొరేట్, రిస్క్ గవర్నెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పటిష్ఠపరుచుకోవాలన్నారు. కాగా కొందరు కార్పొరేట్ల అక్రమాల వల్ల బ్యాంకింగ్ రుణాలపై అనవసర నిబంధనలు వచ్చిపడేలా ఉన్నాయని పీహెచ్‌డీసీసీఐ అన్నది.

సీబీఐ చేతికి కీలక పత్రాలు

పీఎన్‌బీ కుంభకోణం కేసులో లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లేదా అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయూ)లకు సంబంధించిన కీలక పత్రాలను సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు చేసిన వారిని విచారించిన సమయంలో రాబట్టిన సమాచారంతో గురువారం రెండు చోట్ల సోదాలు జరిపింది. ఈ క్రమంలోనే సెంట్రల్ ముంబై నవూర్‌లోని వాడలాలో ఓ భవనం చిన్న గదిలో రహస్యంగా దాచిన డాక్యుమెంట్లను సీబీఐ అధికారులు చేజిక్కించుకున్నారు. మరోవైపు పీఎన్‌బీ బెల్జియం ఇంటర్నల్ చీఫ్ ఆడిటర్ బిష్ణుబ్రత మిశ్రాను సీబీఐ గురువారం అరెస్టు చేసింది. 2011–2015 మధ్యకాలంలో పీఎన్‌బీ బ్రాడీహౌజ్ శాఖలో ఆడిటర్‌గా పనిచేసింది ఈయనే. దీంతో కేసు మరింత పురోగతి చెందగలదన్న విశ్వాసం వ్యక్తమవుతున్నది.

గృహ రుణాలు ప్రియం

వడ్డీరేట్లు పెంచిన ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ

అదే బాటలో మరికొన్ని బ్యాంకులు



న్యూఢిల్లీ, మార్చి 1: ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తో పాటు ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంకు తమ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించాయి. దీంతో ఈ బ్యాంకుల నుంచి గృహ రుణాలు తీసుకునేవారు ఇప్పటివరకూ ఉన్న వడ్డీ కంటే అదనంగా మరికొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకింగ్ రంగంలో నగదు లభ్యత లేదా సరఫరా కఠినంగా మారిన తరుణంలో బ్యాంకులు తమ రుణ రేట్లను పెంచడం గమనార్హం. డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచడంతో ఈ నిర్ణయం తీసుకున్న ఎస్‌బీఐ.. ప్రస్తుతం 7.95 శాతంగా ఉన్న నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను 20 బేసిస్ పాయింట్లు (8.15 శాతానికి) పెంచుతున్నామని, మార్చి 1వ తేదీ నుంచి ఈ పెంపుదల అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఈ మేరకు ఆ బ్యాంకు ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2016 ఏప్రిల్ తర్వాత ఎస్‌బీఐ తమ వడ్డీ రేట్లను పెంచడం ఇదే తొలిసారి. రిటైల్ డిపాజిట్లతో పాటు బల్క్ డిపాజిట్లపైనా ఇస్తున్న వడ్డీ రేట్లను 0.75 శాతం పెంచుతున్నట్లు ఎస్‌బీఐ బుధవారం ప్రకటించిన విషయం విదితమే. ప్రస్తుతం ఆ బ్యాంకు నిధుల వ్యయం ఆధారంగా రుణ రేట్లను నిర్ణయిస్తున్నది. అంటే నిధులు సమీకరించుకునేందుకు బ్యాంకు చేసే వ్యయం ఏమాత్రం పెరిగినా.. దాని ప్రభావం రుణ రేట్లపై కూడా పడుతుందన్నమాట. ఎస్‌బీఐ మాదిరిగా ఐసీఐసీఐ, పీఎన్‌బీ కూడా తమ ఎంసీఎల్‌ఆర్ రేట్లను పెంచాయి. అయితే ఈ రెండు బ్యాంకులు పెంపుదల 20 బేసిస్ పాయింట్లు కాకుండా 15 బేసిస్ పాయింట్లకు మాత్రమే పరిమితమైంది. ఇకమీదట పురుషులకు 8.6 శాతం వడ్డీతోనూ, మహిళలకు 8.55 శాతం వడ్డీతోనూ గృహ రుణాలు అందజేయనున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రకటించగా, ఐసీఐసీఐ బ్యాంక్ తమ ఎంసీఎల్‌ఆర్‌ను 7.8 శాతం నుంచి 7.95 శాతానికి పెంచుతున్నట్లు వెల్లడించింది. ఇదేవిధంగా హెచ్‌డీఎఫ్‌సీ, మరికొన్ని ఇతర బ్యాంకులు వచ్చే వారం తమ రుణ రేట్లను పెంచబోతున్నట్లు తెలుస్తున్నది.

యూబీఐ మాజీ సీఎండీకి ఉచ్చు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో

రూ.3 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనం

ఢిల్లీ, ముంబైలో పలు స్థిరాస్తుల గుర్తింపు



న్యూఢిల్లీ, మార్చి 1: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) మాజీ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అర్చనా భార్గవకు ఉచ్చు బిగుసుకుంటున్నది. ఈ కేసులో ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యుల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాల్లో రూ.2.85 కోట్ల విలువైన ఆభరణాలను, రూ.10.50 లక్షల నగదును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) స్వాధీనం చేసుకున్నది. అలాగే అర్చనా భార్గవ, ఆమె కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకు ఖాతాల్లో రూ.5.42 కోట్ల డిపాజిట్లు, రూ.2.26 కోట్ల బ్యాలెన్స్‌తో పాటు నోయిడాలో మూడు అంతస్తుల బంగ్లా, వసంత్ కుంజ్ (న్యూఢిల్లీ)లో ఒక ఫ్లాట్, ఢిల్లీ, ముంబైలో మరో రెండు ఆస్తులు ఉన్నట్లు గుర్తించామని సీబీఐ వెల్లడించింది. 2004 నుంచి 2014 మధ్య కాలంలో వివిధ బ్యాంకుల్లో సీనియర్ హోదాల్లో పనిచేసిన అర్చనా భార్గవ రూ.4.89 కోట్ల ఆస్తులను కూడబెట్టారని, రూ.2.73 కోట్లుగా ఉన్న ఆదాయానికి మించి ఆమె అదనంగా రూ.1.47 కోట్లు ఖర్చు చేశారని సీబీఐ స్పష్టం చేసింది. అర్చనా భార్గవ రూ.3.63 కోట్ల అక్రమ ఆస్తులను కలిగి ఉన్నారని, ఆమె ఆదాయ వనరుల కంటే ఇది 133.23 శాతం ఎక్కువని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నది. 2004-08 మధ్య కాలంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన అర్చనా భార్గవ.. ఆ తర్వాత 2011 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2013 ఏప్రిల్ 22వ తేదీ వరకూ కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 2013 ఏప్రిల్ 26వ తేదీన యూబీఐలో సీఎండీగా చేరిన ఆమె 2014 ఫిబ్రవరి 20వ తేదీ వరకూ అదే హోదాలో కొనసాగారు. ఈ బ్యాంకుల నుంచి అర్చనా భార్గవ కొన్ని సంస్థలకు రుణ సదుపాయలను కల్పించి అందుకు 'ప్రతిఫలం'గా తన భర్త, కుమారుడి ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రైవేటు సంస్థ కోసం 'కొంత మొత్తాలను' పొందారని, ఈ వ్యవహారంలో అర్చనా భార్గవపై 2016లోనే అవినీతి కేసు నమోదైందని సీబీఐ స్పష్టం చేసింది.

జీఎస్టీ ఎగవేత కేసులలో ఇద్దరు డైరెక్టర్ల అరెస్ట్

ముంబై, మార్చి 1: ప్రభుత్వానికి రూ.7 కోట్లకు పైగా పన్ను ఎగ్గొట్టారన్న ఆరోపణలపై రెండు వేర్వేరు కంపెనీలకు చెందిన ఇద్దరు డైరెక్టర్లను జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) అధికారులు గురువారం అరెస్టు చేశారు. వస్తు, సేవల పన్ను చెల్లింపులో అక్రమాలకు సంబంధించిన తొలి అరెస్టులు ఇవే కావడం గమనార్హం. వేర్వేరు కేసుల్లో షా బ్రదర్స్ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సంజీవ్ ప్రవీణ్ మెహతా రూ.5.20 కోట్లకు, వీఎన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డీ ఆర్యా రూ.2.03 కోట్లకు 'అనర్హమైన క్రెడిట్'ను పొందడంతో వారిని అరెస్టు చేసినట్లు సీజీఎస్‌టీ ముంబై సెంట్రల్ కమిషనరేట్ వెల్లడించింది.

35 విదేశీ శాఖలను మూసేసిన బ్యాంకులు

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రభుత్వ రంగ బ్యాంకులు 35 విదేశీ శాఖల్ని, ప్రతినిధి కార్యాలయాల్ని మూసేశాయి. పారదర్శక, బాధ్యతాయుత బ్యాంకింగ్‌లో భాగంగానే ఈ నిర్ణయానికొచ్చినట్లు వివిధ బ్యాంకర్లు చెబుతున్నా.. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ఇది ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇకపోతే విదేశాల్లోని మొత్తం 216 శాఖలు, రెమిటెన్స్ సెంటర్లు, రిప్రజెంటేటివ్ ఆఫీసుల కార్యకలాపాల్ని దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిశీలించగా, అందులో 35 శాఖలు, రిప్రజెంటేటివ్ ఆఫీసులను మూసేశాయి. మూసివేతకు సిద్ధంగా ఉన్న 69 కేంద్రాలనూ బ్యాంకులు గుర్తించాయి. ఇక ఈ జనవరి 31నాటికి విదేశాల్లో భారతీయ ప్రభుత్వ బ్యాంకులకు 165 శాఖలతో పాటు అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్లు, ప్రతినిధి కార్యాలయాలున్నాయి. ఎస్‌బీఐకి అత్యధికంగా 52 శాఖలుండగా, బీవోబీకి 50, బీవోఐకి 29 శాఖలున్నాయి.

సెయిల్ చైర్మన్‌గా అనిల్ కుమార్ చౌదరి!

న్యూఢిల్లీ, మార్చి 1: స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) నూతన సారథిగా అనిల్ కుమార్ చౌదరిని సిఫారసు చేస్తున్నట్లు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పీఈఎస్‌బీ) ప్రకటించింది. ప్రస్తుతం ఆయన కంపెనీ ఆర్థిక విభాగ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సెయిల్ చైర్మన్ పదవీ కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలో మోయిలీ డైరెక్టర్ తన్మయ కుమార్ పట్నాయక్, సెయిల్ ఈడీ అలోక్ సహవ్, సెయిల్ డైరెక్టర్ (కమర్షియల్) సోమ మండల్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఎండీ నలిని షింఘాల్‌లు హాజరైనప్పటికీ పీఈఎస్‌బీ అనిల్ కుమార్‌వైపు మొగ్గుచూపింది. ప్రస్తుతం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న పీకే సింగ్ వచ్చే జూన్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు.

సింభౌలీపై మనీ లాండరింగ్ కేసు

పలుచోట్ల సోదాలు నిర్వహించిన ఈడీ



న్యూఢిల్లీ, మార్చి 1: సింభౌలీ షుగర్స్ లిమిటెడ్, దాని ప్రమోటర్లు, డైరెక్టర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. రూ.97.85 కోట్ల బ్యాంక్ లోన్ మోసం ఆరోపణలపై బుధవారం హాపూర్, నోయిడాల్లో సోదాలు జరిపిన ఈడీ.. ఆ తర్వాత సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద క్రిమినల్ కేసును దాఖలు చేసినట్లు గురువారం అధికారులు తెలిపారు. సోదాల్లో కొన్ని డాక్యుమెంట్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకోగా, బ్యాంకుల నుంచి సింభౌలీ, దాని ఉద్యోగుల ఆర్థికపరమైన వివరాల్నీ పొందినట్లు ఓ సీనియర్ అధికారి చెప్పారు. బ్యాంకుల్ని మోసం చేసి పొందిన నిధులతో అక్రమాస్తులు ఏమైనా కూడబెట్టారా? లేక నల్లధనాన్ని పోగేశారా? అన్న కోణంలో ఈడీ విచారణ చేస్తున్నది.

ఇంటర్‌పోల్‌కు దర్యాప్తు సంస్థ

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ) రూ.389.85 కోట్ల మోసం కేసులో ఢిల్లీకి చెందిన జువెల్లర్ ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ సభ్య సేథ్‌ను పట్టుకునేందుకు సీబీఐ.. ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించింది. మరోవైపు గురువారం సభ్య సేథ్ తల్లి రీటా సేథ్, భార్య పునితాను సీబీఐ ప్రశ్నించింది. రీటా పేరు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఉండగా, పునితా పేరు మాత్రం లేదని అధికారులు తెలిపారు.

పంజాబ్ సీఎం అల్లుడ్ని ప్రశ్నించిన సీబీఐ



గుర్పాల్ సింగ్

సింభౌలీ షుగర్స్ లిమిటెడ్ కేసులో సంస్థ డైరెక్టర్, పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అల్లుడైన గుర్పాల్ సింగ్‌ను గురువారం సీబీఐ ప్రశ్నించింది. కంపెనీ మాజీ సీఈవో జీఎస్‌సీ రావును కూడా విచారించినట్లు అధికారులు తెలిపారు. దేశంలోని అతిపెద్ద చక్కెర కర్మాగారాల్లో ఒకటైన ఈ షుగర్ మిల్లు చైర్మన్ గుర్మిత్ సింగ్ మన్, ఇతర ఉన్నతోద్యోగులపైనా సీబీఐ కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

వాహన అమ్మకాల జోరు



న్యూఢిల్లీ, మార్చి 1: వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. ఫిబ్రవరిలో కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి, మహీంద్రా, టాటా మోటార్స్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోగా..ద్విచక్ర వాహన సంస్థలైన బజాజ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, టీవీఎస్, హీరో మోటోకార్ప్‌లు కూడా మెరుగైన పనితీరు కనబరిచాయి. దేశవ్యాప్తంగా మారుతి అమ్మకాల్లో 14.2 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, మహీంద్రా 20 శాతం, టాటా మోటార్స్ 38 శాతం చొప్పున పెరిగాయి. కానీ ఫోర్డ్ ఇండియా అమ్మకాల్లో నిస్తేజం నెలకొన్నది.

లక్ష రూపాయలు తగ్గిన రెనో డస్టర్

ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనోకు చెందిన ఎస్‌యూవీ డస్టర్ ధరను రూ.29,746 నుంచి రూ.1,00761 వరకు తగ్గించినట్లు ప్రకటించింది. ఈ ధరలు వెంటనే అమలులోకి రానున్నాయి. కంపెనీ తీసుకున్న తాజా నిర్ణయంతో పెట్రోల్‌తో నడిచే డస్టర్ కారు రూ.7.95 లక్షల నుంచి రూ.9.95 లక్షలకు తగ్గనున్నది. గతంలో ఇది రూ.8.5–10.24 లక్షల మధ్యలో ఉంది. రూ.9.45–13.79 లక్షలుగా ఉన్న డీజిల్ వెర్షన్ రూ.8.95–12.79 లక్షలకు తగ్గిస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పూర్తిస్థాయిలో దేశీయంగా తయారైన విడిభాగాలతో ఈ కారును తయారుచేయడం వల్ల కలిగే ప్రయోజనాన్ని వినియోగదారులకు బదలాయించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సుమిత్ తెలిపారు.

వాహన అమ్మకాలు

కంపెనీ	2018 ఫిబ్రవరి	2017 ఫిబ్రవరి	వృద్ధి%
మారుతి	1,49,824	1,30,280	15
హ్యుందాయ్	55,422	52,734	5
మహీంద్రా	51,127	42,826	19
టాటామోటార్స్	58,993	42,679	38
ఫోర్డ్	23,965	24,026	==
అశోక్ లేలాండ్	18,181	===	29
బజాజ్	3,57,883	2,73,513	21
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,077	58,439	25
టీవీఎస్ మోటార్	2,90,673	2,11,470	33.5
హీరో మోటో	6,29,597	5,24,766	20
హోండా	5,19,735	3,93,642	32

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, మార్చి 1: ద్రవ్యలోటుపై ఆందోళన తీవ్రతరంకావడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు పాల్పడ్డారు. ఇంట్రాడేలో 34,278.63 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్న సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 137.10 పాయింట్లు పతనం చెంది 34,046.94 వద్దకు జారుకున్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 34.50 తగ్గి 10,458.35 వద్దకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్, యెస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, డాక్టర్ రెడ్డీస్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లు ఒక శాతానికిపైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అయినప్పటికీ కోల్ ఇండియా (సీఐఎల్), ఇండస్‌ఇండ్ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), కొటక్ బ్యాంక్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, టాటా మోటార్స్, మారుతి సుజుకీ మాత్రం లాభాల్లో ముగిశాయి.

ఎన్‌బీఏ గుర్తింపు ఉన్న కాలేజీలెన్ని?

- జేఎన్టీయూహెచ్, టీఎస్‌సీహెచ్ఈ సైట్లలో లభించని ఇంజినీరింగ్ కాలేజీల వివరాలు
- ఎన్‌బీఏ కాలేజీలవైపే విద్యార్థుల మొగ్గు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు పొందిన కోర్సులు ఎన్ని ఉన్నాయన్న వివరాలపై స్పష్టత కొరవడింది. ఇదే అదునుగా కొన్ని ఇంజినీరింగ్ కాలేజీలు ఎన్‌బీఏ గుర్తింపు కాలపరిమితి ముగిసినా గుర్తింపు ఉన్నట్టు ప్రచారం చేసుకుంటున్నాయి. వాస్తవానికి కాలేజీల వారీగా కాకుండా కోర్సుల వారీగా నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ గుర్తింపు ఇస్తుంది. అయినప్పటికీ తమ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నట్టు బహిరంగంగా ప్రకటిస్తున్న కాలేజీలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఏ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నది.. ఏ కాలేజీకి లేదు అన్న వివరాలను తెలుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఎన్‌బీఏ గర్తింపు ఏయే కాలేజీలకు, కోర్సులకు ఉన్నదన్న వివరాలను జేఎన్‌టీయూహెచ్/ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో పెట్టాలని కోరుతున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్లో కూడా ఈ వివరాలను ప్రతి ఏడాది అప్‌డేట్ చేయాల్సి ఉందని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు చెప్తున్నాయి. ఈ వివరాలు ఏ వెబ్‌సైట్‌లోనూ కనిపించడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కోర్సులు ఏయే కాలేజీల్లో ఉన్నాయన్న వివరాలు తమ వద్ద ఉండవని, ఎన్‌బీఏ వెబ్‌సైట్‌లోనే ఉంటాయని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ఎన్ శ్రీనివాసరావు తెలిపారు.

అత్యుత్తమంగా బీసీ జూనియర్ కళాశాలలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బీసీ సంక్షేమశాఖ నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దుతున్నారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ తరహాలో విద్యాబోధన కొనసాగించేందుకు ఏర్పాట్లుపూర్తిచేశారు. మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ పరిధిలో 19 జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులను వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రతి కళాశాలలో 320 మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. అర్హత పరీక్ష ద్వారా బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకుని, ఉత్తమ ప్రతిభను కనబరిచిన 386 మందిని ఎంపిక చేసి ఐఐటీ, నీట్, ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు ఆయా అంశాల్లో ప్రాక్టీస్ కొరకు ట్యాబ్‌లను అందజేస్తున్నారు. పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకునేందుకు అసైన్‌మెంట్లు నిర్వహిస్తున్నారు. అధునాతన పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటుచేశారు. ప్రతివారం పరీక్షల నిర్వహణ, విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసి విద్యార్థులస్థాయిని అంచనా వేసి సబ్జెక్టుల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తారు. అంతేకాకుండా బీసీ సంక్షేమశాఖ పరిధిలోని స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగులకు ఆయా ఉద్యోగార్హత పరీక్షలకోసం శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు వృత్తినైపుణ్య శిక్షణలు ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం

- దిగువ కోర్టులకు హైకోర్టు టార్గెట్
- 2012కు పూర్వం కేసులను జీరో శాతం చేయాలని నిర్దేశం.. నెలాఖరువరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని జిల్లా న్యాయస్థానాలతోపాటు ఇతర సబార్డినేట్ కోర్టుల్లో పెండింగ్ కేసుల పరిష్కారం వేగం పుంజుకుంటున్నది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్ ఆదేశాల మేరకు రెండు రాష్ట్రాల్లోని దిగువ కోర్టుల్లో గత ఆరు నెలలుగా పెండింగ్ కేసులపై చేపట్టిన ప్రత్యేక విచారణ ఫలితాలనిస్తున్నది. 2017 జనవరి నాటికి 11.89 శాతం ఉన్న (2012కు పూర్వం కేసులు) పెండింగ్ కేసుల సంఖ్య ఏడాది చివరికి 6.71 శాతానికి తగ్గింది. 2018 మార్చి చివరినాటికి 5 ప్లస్ జీరో (2012 పూర్వం కేసులను తక్షణమే పరిష్కరించాలి) నినాదంతో తక్షణమే దృష్టి సారించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇరు రాష్ట్రాల్లోని దిగువ కోర్టుల న్యాయాధికారులను ఉద్దేశించి సర్క్యులర్ జారీచేశారు. ప్రతిరోజు ప్రతికోర్టులో పరిష్కరించిన పెండింగ్ కేసుల వివరాలను సాయంత్రానికల్లా హైకోర్టుకు సమాచారం అందించేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై పర్యవేక్షణ కోసం హైకోర్టు న్యాయమూర్తులతో ఎరియర్స్ కమిటీని సైతం ఏర్పాటుచేశారు. కమిటీ ప్రతి వారాంతంలో రెండురాష్ట్రాల్లోని జిల్లా కోర్టు యూనిట్ అధిపతులతో సమావేశమై సమీక్షిస్తున్నది. ప్రస్తుతం ఉన్న పెండింగ్ కేసులను సైతం వచ్చే మూడు నెలల్లో పరిష్కరించడానికి ప్రణాళికలను రూపొందించారు. వీటి పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా న్యాయాధికారులు హైకోర్టు కమిటీ దృష్టికి తీసుకొస్తున్నారు.



వైభవంగా యోగానందుడి తెప్పోత్సవం

ధర్మపురి టౌన్: జగిత్యాల జిల్లా ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో యోగా లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం డోలోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.



కోటంచ జాతర ప్రారంభం

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొటంచ గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. రాత్రి పెద్దరథంపై స్వామి వారిని ఊరేగించారు. స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, టీఆర్ఎస్ నేత గండ్ర సత్యనారాయణరావు స్వామివారిని దర్శించుకున్నారు.



నమోః నారసింహ

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర గురువారం ప్రారంభమైంది. 15ఏండ్ల తర్వాత జాతరలో రాజకీయ పార్టీల ప్రభ బండ్లు తిరుగడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. 60ఫీట్ల కేసీఆర్ కటౌట్ ప్రభబండి ఆకర్షణగా నిలిచింది.



కుడికాల్వకు కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్ కాల్వలకు నీటి విడుదల

నాగార్జునసాగర్: కృష్ణా నదీయాజమాన్య బోర్డు ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు గురువారం నీటిని విడుదల చేసినట్లు డ్యాం సీఈ సిరివోరు సునీల్ పేర్కొన్నారు. కుడికాల్వకు రోజుకు 2వేల క్యూసెక్కుల చొప్పున ఐదు రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఎడమకాల్వకు రోజుకు నాలుగు వేల క్యూసెక్కుల చొప్పున తొమ్మిది రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని, కాల్వ కింద అవసరాలను బట్టి నీటి విడుదలలో హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 523 అడుగుల మేరకు నీరు నిల్వ ఉందన్నారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

ఎస్సారెస్పీకి బాబ్లీ నీళ్లు

మెండోరా: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గురువారం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో గేట్లను ఎత్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వదిలారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఏటా 0.6 టీఎంసీల నీటిని మార్చి ఒకటిన విడుదల చేయాల్సి ఉంటుంది. ఈసారి బాబ్లీ ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో 0.048 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారని ఎస్సారెస్పీ ఈఈ రామారావు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి బాబ్లీ గేటు ఆటోమేటిక్ యంత్రాలతో ఒక్కో గేటును ఎత్తి నీటి విడుదలను చేశారన్నారు. బాబ్లీ నీరు గోదావరిలోకి ప్రవహించిందని, క్రమంగా రాత్రి వరకు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లోకి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నుంచి ఎస్సారెస్పీ ఈఈ రామారావుతోపాటు సీడబ్ల్యూసీ ఈఈ శ్రీనివాస్, మహారాష్ట్రలోని నాందేడ్ ఈఈ సేటే, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేయాలని కోరుతూ డీలర్‌కు చెక్కు అందజేస్తున్న సర్పంచ్ పొన్నం మంజుల

పేదలకు మహిళా సర్పంచ్ చేయూత

గౌరవ వేతనంతో గ్రామస్థులకు రేషన్ బియ్యం

సిరిసిల్ల రూరల్: పేదలకు చేయూతనందించేందుకు ఓ మహిళా సర్పంచ్ ముందుకు వచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ సర్పంచ్ పొన్నం మంజుల ఈ నిర్ణయం తీసుకున్నారు. తనకు ప్రతి నెలా వచ్చే రూ.5 వేల గౌరవ వేతానికి తోడు మరో రూ.890 కలిపి గ్రామంలోని వారికి బియ్యం అందజేయనున్నారు. హోలీ పండుగను పురస్కరించుకొని గురువారం ఎంపీపీ శ్రీలత, క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుర్మాణి రాంలింగారెడ్డితో కలిసి ఆమె బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రి కేటీఆర్ నియోజకవర్గ పరిధిలోని కస్బెకట్కూర్ సర్పంచ్ ఈ వినూత్న కార్యక్రమం చేపట్టడాన్ని పలువురు అభినందించారు.



ఆదిలాబాద్‌లోని రిమ్స్ వద్ద పోలీసుల భారీ బందోబస్తు

ఆదిలాబాద్‌లో ఇరువర్గాల ఘర్షణ

ఇనుప రాడ్లతో పరస్పర దాడి

ఆరుగురికి తీవ్రగాయాలు.. పోలీసుల లాఠీచార్జి

ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా మావలలో ఇరువర్గాలు పరస్పరం ఇనుపరాడ్లతో దాడి చేసుకోగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం బాలాజీనగర్ కాలనీలో ప్రభాకర్, నవీన్, వసీం మధ్య భూ వివాదాల కారణంగా గురువారం రాత్రి ఇనుప రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న ఇరువర్గాల స్నేహితులు రిమ్స్‌కు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకోగా పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఇందులో కానిస్టేబుల్ భీమన్న తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ విష్ణువారియర్ రిమ్స్‌కు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శుక్రవారం నుంచి 30 యాక్టు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

దండిగా ధాన్యం

- రాష్ట్రవ్యాప్తంగా 1.82 కోట్ల క్వింటాళ్ల కొనుగోళ్లు
- రైతులకు ఆన్‌లైన్‌లో రూ.2,890 కోట్ల చెల్లింపులు
- అన్నదాతకు అండగా నిలిచిన సర్కారు



మంచిర్యాల, నమస్తే తెలంగాణ: వానకాల సీజన్ ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ రికార్డుస్థాయిలో కొనుగోలు చేసింది. సీజన్‌కు ముందే రంగంలోకి దిగి, రాష్ట్రవ్యాప్తంగా 2,663 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మొత్తం 1.82 కోట్ల క్వింటాళ్లను కొనుగోలు చేసి, రైతులకు ఆన్‌లైన్ ద్వారా రూ.2,890 కోట్లను చెల్లించింది. సీజన్‌కు ముందే పౌర సరఫరాల శాఖ రంగంలోకి దిగి, గన్నీ సంచులు, తేమపరీక్ష యంత్రాలను సిద్ధం చేసుకుంది. 29 జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతలను సహకార సంఘాలు, ఐకేపీ మహిళా సంఘాలకు అప్పగించింది. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.1,590, కామన్ రకానికి రూ.1,540 వరకు ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించగా, అక్టోబర్ నుంచే కొనుగోళ్లు మొదలు పెట్టింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో కొనుగోలు కేంద్రాలన్నీ కళకళలాడగా, అన్ని కేంద్రాల్లో 1,82,82,384 క్వింటాళ్లు సేకరించింది. ఇందులో గ్రేడ్-ఏ ధాన్యం 1,46,84,827 క్వింటాళ్లు, కామన్ రకాలు 35,97,556 క్వింటాళ్లు కొన్నది. వీటి మొత్తం విలువ రూ.2,890.61 కోట్లు కాగా, ఈసారి ధాన్యం కొనుగోళ్లలో కామారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. వడ్లు అమ్మిన రైతులకు ఈసారి పౌరసరఫరాల సంస్థ ఆన్‌లైన్ చెల్లింపులు చేసింది.

1.82 కోట్ల క్వింటాళ్ల కొనుగోళ్లు

పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా 1.82 కోట్ల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించింది. కామారెడ్డి జిల్లాలో 18,82,664 క్వింటాళ్లు, జయశంకర్ భూపాలపల్లిలో 16,98,797 క్వింటాళ్లు, జగిత్యాలలో 16,76,267, కరీంనగర్‌లో 14,74,710, ఆదిలాబాద్‌లో 6,264, భద్రాద్రి కొత్తగూడెంలో 8,19,603, జనగామలో 2,13,382, ఖమ్మంలో 3,94,242, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 14,081, మహబూబాబాద్‌లో 4,55,192, మంచిర్యాలలో 3,12,546 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 45,729, మెదక్‌లో 9,67,080, మేడ్చల్ మల్కాజిగిరిలో 26,119, నాగర్‌కర్నూల్‌లో 72,698, నల్లగొండలో 6,70,368, నిర్మల్‌లో 4,63,056, నిజామాబాద్‌లో 15,11,444, పెద్దపల్లిలో 8,93,265, రాజన్న సిరిసిల్లలో 11,45,478, రంగారెడ్డిలో 19,660, సంగారెడ్డిలో 4,42,901, సిద్దిపేటలో 9,39,741, సూర్యాపేటలో 91,459, వికారాబాద్‌లో 1,32,890, వనపర్తిలో 99,049, వరంగల్ అర్బన్‌లో 1,82,801, వరంగల్ రూరల్‌లో 4,69,298, యాదాద్రి భువనగిరిలో 11,61,600 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలుచేసింది.



హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని ఎంపీ కార్యాలయం వద్ద గురువారం హోలీ వేడుకలు నిర్వహించారు. రంగుల్లో మునిగి తేలిన మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సాయన్న బ్యాండ్ కొట్టి ఆకట్టుకున్నారు.

అప్పుడే భగభగలు

40 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అప్పుడే ఎండలు మండుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరినట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల పెరుగుదల ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వారాంతానికి ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. మధ్యాహ్నం వడగాలులు తీవ్రత ఉంటున్నదని తెలిపారు. గురువారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే, పెద్దపల్లిలో 40 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 39.4, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 39.3 డిగ్రీల చొప్పున, సూర్యాపేట, నిర్మల్ జిల్లాల్లో 39 డిగ్రీల చొప్పున, నల్లగొండ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 38.7 డిగ్రీల చొప్పున నమోదైనట్టు వారు తెలిపారు.

లంచం ఇచ్చుకోలేక.. అప్పులు తీర్చలేక..

- భార్య, పిల్లలకు ఎలుకల మందు ఇచ్చి.. ఉరేసుకొన్న యజమాని
- దంపతులు మృతి.. కోలుకున్న పిల్లలు
- ఆందోళనకు దిగిన స్థానికులు



భార్యాభర్తలు తిరుపతి, భూదేవి(ఫైల్)




ప్రమాదం నుంచి బయటపడిన కూతురు కీర్తన, కుమారుడు శ్రీశాంత్

కాసిపేట రూరల్: ఉద్యోగి అడిగిన లంచం ఓ కుటుంబాన్ని పొట్టనపెట్టుకున్నది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణం పొందడానికి ఉద్యోగి డిమాండ్ చేసిన లంచం ఇచ్చుకోలేక.. మంజూరైన రుణం చేతి కందక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు ఓ లబ్ధిదారుడు. ఈ క్రమంలో తన భార్యతోపాటు ఇద్దరు పిల్లలకు ఎలుకలు మంది ఇచ్చి తాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో అతని భార్య కూడా చనిపోగా ఇద్దరి పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. హృదయవిదారకమైన ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెం చొప్పరపల్లిలో గురువారం ఉదయం జరిగింది. కొండగొర్ల తిరుపతి సూసైడ్ నోట్, కాసిపేట ఎస్సై భాస్కర్‌రావు వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం సోమగూడెం చొప్పరపల్లి గ్రామానికి చెందిన కొండగొర్ల తిరుపతి(39), తన భార్య భూదేవి(35), కూతురు కీర్తన(13), కుమారుడు శ్రీశాంత్(11), తల్లిదండ్రులతో కలిసి ఆరేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న 2 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలు తీసుకొని కూరగాయలు పండిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దాదాపు రూ.6.50 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల రుణం మంజూరైంది. రూ.20 వేలు ఇస్తేనే రుణం వస్తుందని, లేకుంటే లోన్‌తో తమకు సంబంధం లేదని బెల్లంపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి చెప్పాడు. సదరు ఉద్యోగి అడిగిన లంచం ఇచ్చే పరిస్థితి లేక.. మంజూరైన రుణం చేతికందక.. అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ పరిస్థితిలో తన కుటుంబం మొత్తం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని సూసైడ్ నోట్ రాశాడు. బుధవారం రాత్రి జ్యూస్‌లో ఎలుకల మందు కలిపి ఇద్దరు పిల్లలతోపాటు భార్య భూదేవికి తాగించాడు. భార్య మృతిచెందగా తిరుపతి అదే గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన కుమారుడు, కూతురు గురువారం తెల్లవారుజామున తేరుకొన్నారు. అమ్మానాన్న చనిపోయిన విషయాన్ని గుర్తించి వెంటనే తమ పెదనాన్న శంకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని పిల్లలు ఇద్దరిని బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలలో మెరుగైన చికిత్స అందించడంతో కోలుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ బాలుజాదవ్, మందమర్రి సీఐ రాంచందర్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి తిరుపతి, భూదేవిల మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పండుగపూట భార్య, భర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లంచం డిమాండ్ చేసి వీరి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గురువారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఏసీపీ బాలు జాదవ్, మందమర్రి సీఐ రాంచందర్‌రావు ఉచిత విద్య అందించడంతోపాటు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హోలీ వేడుకల్లో విషాదం

- వేర్వేరు చోట్ల నీట మునిగి నలుగురి దుర్మరణం
- సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు.. ఖమ్మం, కొత్తగూడెంలో ఒక్కొక్కరు



సాయికుమార్, సాయికిరణ్ (ఫైల్)

పుల్కల్/ముదిగొండ/చండుగ్రొండ: హోలీ వేడుకల్లో విషాదం నెలకొంది. హోలీ ఆడిన తరువాత ఈతకెళ్లి సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు చిన్నారులు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందారు. వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కొర్పోల్‌కు చెందిన చెల్లా సాయికిరణ్(15), సాయికుమార్(15) గురువారం ఉదయం స్నేహితులతో కలిసి హోలీ ఆడి మంజీర నదిలో స్నానానికి వెళ్లారు. నీటి మడుగుల్లో స్నానాలు చేస్తుండగా సాయికిరణ్, సాయికుమార్ మునిగి ప్రాణాలు వదిలారు. సాయికుమార్ కోర్పోల్‌లో, సాయికిరణ్ శివ్వంపేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన సాయికృష్ణ(20) రంగు కడుక్కోవడానికి బావిలో ఈతకు వెళ్లాడు. ఈత సరిగారాక నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం కర్శలబోడుకు చెందిన విజయ్(22) గ్రామ శివారులోని పిల్లనగోయలొద్ది వద్దగల బావిలోకి దూకగా, అడుగు భాగాన పూడిక, ఊబి ఉండటంతో రెండు కాళ్లు ఇరుక్కుపోయి, ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి స్నేహితులు కాపాడటానికి ప్రయత్నాలు ఫలితం దక్కలేదు.



ఖమ్మం జిల్లా కల్లూరులో టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో హైతాబాద్, చందనవెల్లి తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు టీఆర్ఎస్‌లో చేరగా, రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండల కేంద్రంలోని టీడీపీ కీలక నేత హబీబ్ అనుచరగణంతో టీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమెర్ధ పంచాయతీ కొర్సవారిగూడెం నుంచి సర్పంచ్ నర్సమ్మ, వార్డు మెంబర్లు శాంతమ్మ, రమణమ్మ, కల్లూరి చిట్టెమ్మలతో పాటు టీడీపీకి చెందిన 150 కుటుంబాలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరాయి.



రంగారెడ్డిజిల్లా షాబాద్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు, పక్కన ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి

భద్రాచలంలో సీపీఎం కార్యకర్త హత్య

పాతగొమ్మూరు ఇసుక ర్యాంపులో పూడ్చివేత

వివాహేతర సంబంధమే కారణం



కొండలరావు(ఫైల్)

భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సీపీఎం కార్యకర్త ఐతంరాజు కొండలరావు బుధవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న ఐతంరాజు కొండలరావుకు 17ఏండ్ల క్రితం పార్వతితో పెళ్లి జరిగింది. కొద్ది కాలానికే ముక్తేశ్వరితో రెండో పెండ్లి చేసుకోగా, అప్పటి నుంచి మొదటి భార్య వేరేగా ఉంటున్నది. కొండలరావు ఇల్లు కట్టుకుని రెండో భార్యతో కాపురం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా, నాని అనే వ్యక్తితో ముక్తేశ్వరి చనువుగా ఉండటాన్ని గమనించి కొండలరావు, ఆమెను మందలించాడు. కొండలరావును అడ్డు తొలగించుకోవాలని ముక్తేశ్వరి తన ప్రియుడు నానితో కలిసి పథకం వేసిం ది. కొండలరావు బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లోనే ఉన్న నాని, అతని స్నేహితుడు శివ కలిసి కొండలరావు గొంతు నులిమి హత్య చేసినట్లు తెలుస్తున్నది. మృతదేహాన్ని సమీప మండలం బూర్గంపహాడ్ పాతగొమ్మూరు ఇసుక ర్యాంపులో పూడ్చిపెట్టినట్లు ఓ బాలుడు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఆ బాలుడితో కలిసి పూడ్చిపెట్టిన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని బయటకు తీశారు. కొండలరావు హత్యకు వివాహేతర సంబంధ కోణంలో భద్రాచలం సీఐ సత్యనారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్మకాండకు వెళ్లి వస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



నాగేశ్వర్‌రావు, లక్ష్మి (ఫైల్)

అశ్వాపురం రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతో పాటు ఓ మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన సింగరేణి కాంట్రాక్టుకార్మికుడు కుడిపుడి నాగేశ్వరరావు(55), భార్య మంగ(50), అమలాపురానికి చెందిన అతని సోదరుడు కుడిపుడి ముసలయ్య, అతడి భార్య లక్ష్మి(49)తో కలిసి కారులో గురువారం కొత్తగూడెంలోని బంధువుల ఇంట్లో జరిగిన కర్మకాండకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారి సమీప బంధువైన కొత్తగూడానికి చెందిన ఫొటోగ్రాఫర్ రామకృష్ణ, చైతన్య మణుగూరులో శుభకార్యానికి వస్తుండగా, వారిని కూడా కారులో ఎక్కించుకున్నారు. అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద ఆగి ఉన్న లారీని వీరి కారు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నాగేశ్వర్‌రావు-మంగ దంపతులు అక్కడికక్కడే మృతి చెందగా, ముసలయ్య, లక్ష్మి, రామకృష్ణ, కారు నడుపుతున్న చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే భద్రాచలం దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ లక్ష్మి మృతిచెందింది. ముసలయ్య పరిస్థితి విషమంగా ఉంది.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీతో ఇసుక అక్రమ రవాణా

కోదాడ, నమస్తే తెలంగాణ: తహసీల్దార్ సంతకం ఫోర్జరీతో 700 ట్రిప్పుల ఇసుకను అక్రమ రవాణా చేసిన తొమ్మిది మంది నిందితులను సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కోదాడ డీఎస్పీ వివరాల ప్రకారం.. గత నెల 24న కోదాడ పట్టణంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, నకిలీ బిల్లులతో నాలుగు నెలల నుంచి దోసపహాడ్ నుంచి ఇసుకను తరలించినట్టు తేలింది. దీనికి కోదాడకు చెందిన అనుములపూడి నవీన్‌తోపాటు ఓ చానల్ విలేకరి శ్రీనివాస్ రవాణా బిల్లుల నమూనా, బిల్‌పుస్తకాలు, రబ్బర్ స్టాంపులు సూర్యాపేటలో తయారు చేయించి, విలేకరి శ్రీనివాస్ 500 ట్రిప్పులు, నవీన్ 200 ట్రిప్పులు ఇసుక అక్రమ రవాణా చేశారనీ, వీరికి సహకరించిన మరో ఏడుగురిని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

వినేశ్‌కు రజతం ఖాయం..



ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ విజేత వినేశ్ పోగాట్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల 50 కేజీ సెమీస్‌లో వినేశ్.. యుకీ ఐరీ (జపాన్)పై గెలిచింది. బౌట్ ఆరంభంలో ఇద్దరూ హోరాహోరీగా తలపడటంతో ఓ దశలో స్కోరు 4-4తో సమమైంది. కానీ ఆఖరి రౌండ్‌లో వినేశ్ పోరాట పటిమను చూపి పాయింట్లను కొల్లగొట్టింది. టైటిల్ పోరులో వినేశ్.. చున్ లీ (చైనా)తో తలపడుతుంది. ఒకవేళ వినేశ్ ఇందులో ఓడినా రజతమైనా దక్కుతుంది. 59 కేజీల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సంగీత 5-15తో నబీరా ఎసెన్‌బయోవా (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడింది. ఈమె కాంస్య పతక పోరులో జియాన్ ఉమ్ (కొరియా)తో తలపడుతుంది. 55 కేజీల క్వార్టర్స్‌లో లలిత 0-5తో దావాచిమెంగ్ ఎంకబయోరా (మంగోలియా) చేతిలో ఓడింది. గ్రీకో రోమన్ విభాగాల్లో భారత్‌కు రెండు కాంస్యాలు లభించాయి. 82 కేజీల కాంస్య పతకపోరులో హర్‌ప్రీత్ సింగ్ 11-3తో కాశింబెకోవ్ (ఉజ్బెకిస్థాన్)పై, 55 కేజీల్లో రాజేందర్ కుమార్.. మిర్జామెదోవ్ (ఉజ్బెకిస్థాన్)పై గెలిచారు. కుల్దీప్ (72 కేజీ), నవీన్ (130 కేజీ) త్రుటిలో కాంస్యాలను చేజార్చుకున్నారు.



పంజాబ్ రాష్ట్ర డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన భారత మహిళల టీ20 జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌కు స్టార్లు పిన్ చేస్తున్న పంజాబ్ సీఎం అమరీందర్‌సింగ్, డీజీపీ సురేశ్ అరోరా

క్యాట్‌కు అరుదైన గౌరవం



పంకజ్ శర్మ సునీల్‌బాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: దేశంలో క్రీడలలో ఉపాధిని కల్పించే మార్గాలను అన్వేషిస్తున్న కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్(సీఐఐ) ఈ విషయంలో సలహాలు, సూచనలు అందించాల్సిందిగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (క్యాట్)ను కోరింది. ఈ మేరకు గురువారం క్యాట్ కార్యాలయంలో సీఐఐ క్రీడల కమిటీ సభ్యుడు పంకజ్‌శర్మ తనను కలిసినట్లు క్యాట్ వ్యవస్థాపక కార్యదర్శి సునీల్‌బాబు తెలిపారు. క్రీడల ద్వారా ఉపాధి మార్గాలను పెంచే విషయంలో సీఐఐ సలహాలను కేంద్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో దేశంలోని క్రీడల సంఘాలను సంప్రదిస్తూ సీఐఐ కమిటీ దేశమంతా పర్యటిస్తున్నది. గత ఆరేండ్లుగా గ్రామీణ ప్రాంతాలలోని క్రికెటర్లకు అవకాశాలు కల్పించేందుకు .. క్రికెట్ ఆటపై ఆసక్తి కలిగిన ప్రతి విద్యార్థి ఆడేందుకు అవకాశం కల్పించడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్న క్యాట్‌ను ..సీఐఐ సంప్రదించింది. ఈ విషయంలో తన సలహాలను సూచనలను సీఐఐకి అందించనున్నని సునీల్‌బాబు వెల్లడించారు. క్రీడలలో ఉపాధి పెంపొందించే విషయంలో సీఐఐతో కలిసి క్యాట్‌కు కూడా భాగస్వామిగా సహకారం అందించాలని పంకజ్‌శర్మ కోరారు.. అందుకు అంగీకారం తెలిపానని పేర్కొన్నారు. భారత్‌లో క్రీడారంగానికి మంచి రోజులు వస్తున్నాయి, ఈ రంగంలో ఉపాధికి ఉన్న అవకాశాలను యువత అందిపుచ్చుకునేలా సీఐఐతో కలిసి కృషి చేస్తానని సునీల్‌బాబు చెప్పారు.

పారా స్విమ్మర్ ప్రశాంత్‌పై వేటు



న్యూఢిల్లీ: మహిళా స్విమ్మర్లు ప్రాక్టీస్ చేస్తుంటే దొంగచాటుగా వీడియోలు తీసినందుకు పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై మూడేండ్ల సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ మూడేండ్ల కాలంలో అతను ఎలాంటి టోర్నీల్లో పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. గతేడాది జైపూర్‌లో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్ సందర్భంగా ప్రశాంత్ ఈ వీడియోలు తీసినట్లు సహచర స్విమ్మర్లు భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ)కి ఫిర్యాదు చేశారు. 'ప్రశాంత్ ట్రైపాడ్ కెమెరాతో వీడియోలు తీస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. అలాగే వీడియోల కోసం కొంతమంది సహచర మహిళా అథ్లెట్లను కూడా అడిగినట్లు తేలింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న చైర్మన్ విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో నిబ్బంది ఆలస్యంగా కూడా తీవ్రంగా విమర్శలు వచ్చాయి. కర్మాకర్‌ను ఓసారి హెచ్చరించినా తీరు మారలేదు. చేసేదేమీ లేక అతనిపై సస్పెన్షన్ వేటు వేశాం' అని పీసీఐ పేర్కొంది. విచారణ సందర్భంగా పీసీఐ చైర్మన్ వీకే డాబాస్‌తో గొడవకు దిగిన ప్రశాంత్.. తనపై లిఖిత పూర్వక ఫిర్యాదులను బటయపెట్టాలని డిమాండ్ చేశాడు. వెంటనే స్పందించిన స్విమ్మర్ల కుటుంబ సభ్యులు అతనిపై ఫిర్యాదు చేశారు.

కరేబియన్ కథ మారేనా.?



వెస్టిండీస్.. ప్రపంచ క్రికెట్‌లో ఒక సంచలనం..ప్రపంచానికి విశ్వానికి పరిచయం చేసిన ధీరులు వాళ్లే..ఆటను దూకుడు నేర్పింది వాళ్లే..భయానక బౌలింగ్‌ను రుచి చూపించింది వాళ్లే..క్లైవ్ లాయిడ్, రిచర్డ్స్ మెరుపులు.. వాల్ష్, ఆంబ్రోస్‌ల నిప్పులు చెరిగే బంతులు.. క్రికెట్‌కు కొత్త పుంతలు తొక్కించిన లారా బ్యాటింగ్ విన్యాసాలు..క్రిస్‌గేల్ చేసిన విధ్వంసం..ఇలా గతమంతా ఘనం..ప్రస్తుతం మాత్రం భయానకం.. ప్రపంచ క్రికెట్‌ను శాసించిన జట్టు ఇప్పుడు ప్రపంచకప్ అర్హత కోసం పాకులాడుతున్నది..నేపాల్, హాంకాంగ్ వంటి పది చిన్నజట్లతో పోటీకి దిగుతున్నది.

- మార్చి 4 నుంచి ప్రపంచకప్ అర్హత పోటీలు
- 2 స్థానాల కోసం పది జట్ల పోటీ
- సూపర్ ఫాంలో ఆఫ్ఘనిస్థాన్

ఇంగ్లండ్ ఆతిథ్యమిస్తున్న 2019 ప్రపంచకప్‌కు అర్హత సాధించాలని వెస్టిండీస్ జట్టు పరితపిస్తున్నది. నిజానికి 2007 ప్రపంచకప్‌లో 16 జట్లు పాల్గొనగా, 2011, 2015లో 14 జట్లు పాల్గొన్నాయి. అయితే ఐసీసీ 2019, 2023కు గాను జట్ల సంఖ్యను పదికి కుదించడంతో విండీస్‌కు తిప్పలు మొదలయ్యాయి. ఐసీసీ వన్డే చాంపియన్‌షిప్‌లో సెప్టెంబర్ 30,2017 వరకు అగ్రస్థానంలో ఉన్న 8జట్లు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు ప్రపంచకప్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాయి. ఎనిమిది జట్లు ఖరారు కాగా, మిగతా రెండు బెర్త్‌ల కోసం పది జట్లు అర్హత మ్యాచ్‌ల్లో పోటీకి దిగుతున్నాయి. జింబాబ్వేలో మార్చి 4 నుంచి 25 వరకు జరుగనున్న ఈ పోటీల్లో పాల్గొనే జట్లు: 1) వెస్టిండీస్ 2) ఆఫ్ఘనిస్థాన్ 3) జింబాబ్వే 4) ఐర్లండ్ 5) స్కాట్లాండ్ 6) నేపాల్ 7) నెథర్లాండ్స్ 8) హాంకాంగ్ 9) యూఏఈ 10)పపువా న్యూగినియా.

శిఖరం నుంచి పాతాళానికి

1975లో తొలిసారి క్రికెట్ ప్రపంచకప్ జరుగగా క్లైవ్ లాయిడ్ నాయకత్వంలోని వెస్టిండీస్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో క్లైవ్ లాయిడ్ 82 బంతుల్లోనే సెంచరీ చేసి దూకుడుకు నిర్వచనం చెప్పాడు. ఆ తర్వాత 1979లోనూ ఇంగ్లండ్‌పై గెలిచి రెండోసారి జగజ్జేతగా నిలిచింది. 1983లో కపిల్‌దేవ్ సారథ్యంలోని భారత్, వెస్టిండీస్ హ్యాట్రిక్ కలలను చెరిపేసి విజేతగా అవతరించింది. అప్పటి నుంచి వెస్టిండీస్‌కు ప్రపంచకప్ అందని ద్రాక్షే అయింది. 1996లో సెమీఫైనల్, 2011, 15లో క్వార్టర్ ఫైనల్స్ మినహా మిగతా ప్రపంచకప్ టోర్నీల్లో గ్రూప్ దశకే పరిమితమైంది. ఇప్పటి వరకు జరిగిన అన్ని (11) ప్రపంచకప్ టోర్నీల్లోనూ విండీస్ ఆడింది. లాయిడ్, రిచర్డ్స్ తర్వాత లారా, ఆంబ్రోస్, వాల్ష్ వంటి సూపర్‌స్టార్లు ప్రత్యర్థులను వణికించారు. ఆ తర్వాత క్రిస్ గేల్, బ్రావో, పొలార్డ్ వంటి మెరుపు వీరులు అదురగొడుతున్నా టీ20 లీగ్స్ పుణ్యమా అని ఆ జట్టుకు బీటలువారాయి. దీనికి తోడు జీతాలు, కాంట్రాక్టుల కోసం విండీస్ బోర్డుపై క్రికెటర్లు యుద్ధం చేశారు. ఫలితంగా ఆ జట్టు గందరగోళంగా తయారైంది.

గేల్ ఒక్కడే?

ప్రపంచకప్‌కు అర్హత సాధించగలదా..? అని వెస్టిండీస్ జట్టును విమర్శకులు వెక్కిరిస్తున్న వేళ ఆ దేశ బోర్డు కనీసం సత్తా ఉన్న ఆటగాళ్లను ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. క్రిస్‌గేల్,శామ్యూల్స్‌ను జట్టులోకి తీసుకున్నా .. పొలార్డ్, నరైన్, బ్రావో, రస్సెల్ వంటి మ్యాచ్ విన్నర్లను పక్కన పెట్టింది. జాసన్ హోల్డర్ సారథ్యంలోని విండీస్‌లో బ్రాత్‌వైట్, బిషూ, ఎవిన్ లూయిస్ తప్ప చెప్పుకోతగ్గ ఆటగాళ్లెవరూ లేకపోవడం ఆ జట్టు క్వాలిఫయింగ్ ఆశలను దెబ్బతీసే అవకాశం ఉన్నది. 2017లో వెస్టిండీస్ 22 వన్డేలు ఆడి కేవలం 3 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఇందులో గేల్ ఆరు మ్యాచ్‌ల్లోనే ఆడాడు. అయితే అర్హత పోటీల్లో గేల్ తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తే విండీస్‌కు ప్రపంచకప్ బెర్త్ ఖాయం.

కసికూనలతోనే..

వెస్టిండీస్ జట్టు తమ ప్రత్యర్థులను పసికూనలే కదా అని భావిస్తే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆఫ్ఘనిస్థాన్, జింబాబ్వే, ఐర్లండ్ జట్లతో విండీస్‌కు గట్టి పోటీ ఎదురవనున్నది. ముఖ్యంగా గత ప్రపంచకప్‌లో ఆడిన ఆఫ్ఘనిస్థాన్ ఈసారి క్వాలిఫయింగ్ పోటీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. స్పిన్ బౌలర్ రషీద్‌ఖాన్, జర్దాన్, నబి, షెహజాద్ వంటి కీలక ఆటగాళ్లు ప్రత్యర్థులకు సవాల్‌గా మారనున్నారు. ఇక 2015 ప్రపంచకప్‌లో విండీస్‌కు షాకిచ్చిన ఐర్లండ్ మరోసారి ప్రతాపం చూపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నది. సొంతగడ్డపై ఆడటం జింబాబ్వేకు అనుకూలించే విషయం. తొలిసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించాలని పట్టుదలతో ఉన్న నేపాల్‌నూ తక్కువ అంచనా వేయలేం. ఐపీఎల్ వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లెగ్ స్పిన్నర్ సందీప్ లమిచ్చానే నేపాల్ జట్టులో కీలకం కానున్నాడు. పై జట్లలోని స్పిన్నర్ల నుంచి విండీస్ బ్యాట్స్‌మన్‌కు ప్రమాదం పొంచి ఉన్నది.

ఈ బుడ్డోడు జూనియర్ అక్రం!



కరాచీ: 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎందరో మేటి బ్యాట్స్‌మెన్‌కు వణుకు పుట్టించిన 'స్వింగ్ సుల్తాన్' వసీమ్ అక్రమ్.. పాకిస్థాన్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిపెట్టాడు. అయితే బుధవారం అక్రమ్.. తన ట్విట్టర్‌లో నిమిషం నిడివి ఉన్న ఓ వీడియోను పోస్ట్ చేశాడు. అందులో నిండా పదేండ్లు కూడా లేని ఓ పిల్లాడు బౌలింగ్ చేస్తున్న తీరు అక్రమ్, మహ్మద్ ఆమిర్‌ను గుర్తుకు తెస్తున్నది. సింగిల్ వికెట్‌ను లక్ష్యంగా చేసుకుని ఎడమం చేతితో ఈ కుర్రాడు 17 బంతులు వేసి అందులో ఏడుసార్లు వికెట్ పడగొట్టి ఔరా అనిపించాడు.'ఈ బుడ్డోడు ఎక్కడున్నాడో తెలిస్తే చెప్పండి. ఇలాంటి నైపుణ్యమే దేశానికి చాలా అవసరం' అని ట్వీట్ చేశాడు.

మెరిసిన వార్నర్, స్మిత్

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ వార్నర్ (51), స్మిత్ (56) అర్ధసెంచరీలు సాధించగా.. సఫారీ బౌలర్లు ఫిలాండర్ (2/36), మహారాజ్ (2/69) సత్తా చాటారు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 76 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆసీస్.. ఓపెనర్ బాంక్రాఫ్ట్ (5), ఖవాజా (14) వికెట్లను తర్వగానే కోల్పోయింది. షాన్ (40) ఫరవాలేదనిపించగా , మిచెల్ (32 బ్యాటిం గ్),పేనీ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నా రు.

కేంద్రంపై ఎదురుదాడికి టీడీపీ సన్నద్ధం!

- నేడు అమరావతిలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ కీలక భేటీ

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: పార్లమెంట్ సమావేశాల్లో తెలుగుదేశంపార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు టీడీపీ పార్లమెంటరీ పార్టీ శుక్రవారం అమరావతిలో భేటీ కానుంది. రెండోవిడుత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 5 నుంచి ప్రారంభం కానుండటంతో పార్టీ ఎంపీలతో అధినేత చంద్రబాబు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేయనున్నారు. మరోపక్క ప్రత్యేకహోదా నినాదంతో ఏపీ ప్రతిపక్ష వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు పోరుబాట పట్టాయి. వైసీపీ గురువారం ఏపీలోని అన్ని కలెక్టరేట్ల వద్ద హోదా ధర్నాలు నిర్వహించింది. హోదా ప్రకటన రాకపోతే కేంద్రంపై అవిశ్వాసం పెడుతామని, సమావేశపు చివరిరోజు తమ ఎంపీలు రాజీనామా చేస్తారని ఇప్పటికే ప్రతిపక్షనేత జగన్ ప్రకటించారు. జనసేనాధిపతి పవన్‌కల్యాణ్ సైతం హోదాకు అనుకూలంగా ప్రకటనలు చేస్తుండటంతో అధికార టీడీపీ ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలో అమరావతిలో జరిగే పార్లమెంటరీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఏసీబీ కస్టడీకి పురుషోత్తంరెడ్డి బినామీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పురుషోత్తంరెడ్డి బినామీ శ్రీనివాస్‌రెడ్డిని ఐదురోజుల ఏసీబీ కస్టడీకి న్యాయస్థానం గురువారం అనుమతించింది. కాగా పురుషోత్తంరెడ్డిని విచారించేందుకు ఏసీబీ అధికారులు ఆరురోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. గడువు ముగియడంతో బుధవారం తిరిగి రిమాండ్‌కు తరలించారు. ఆరురోజుల కస్టడీలో పురుషోత్తంరెడ్డి విచారణకు సహకరించలేదని, మరో వారంరోజుల కస్టడీకి అనుమతించాలని ఏసీబీ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు గురువారం తిరస్కరించింది. అతడి కస్టడీపై ఏసీబీ అధికారులు హైకోర్టుకు వెళ్లనున్నారని తెలిసింది.

తెలంగాణేతరులు అర్హులే..

- విద్యుత్‌సంస్థల్లో పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌పై హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ సంస్థల్లోని పోస్టుల భర్తీకి తెలంగాణ స్థానికతఉన్నవారే అర్హులుగా నోటిఫికేషన్‌లో విద్యుత్ పంపిణీ సంస్థ టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కో పేర్కొనడాన్ని ఉమ్మడి హైకోర్టు గురువారం తప్పుబట్టింది. పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్షలకు హాజరయ్యేందుకు తెలంగాణేతరులు కూడా అర్హులేనని న్యాయస్థానం స్పష్టంచేసింది. అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి ట్రాన్స్‌కో, జూనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ (జేఏఓ) పోస్టులకు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ జారీచేసిన నోటిఫికేషన్‌లో తెలంగాణవారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఈ నిబంధనను సవాల్ చేస్తూ ఇద్దరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తెలంగాణేతరులు సైతం పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతిని ఇచ్చింది.

తప్పుడు మెడికల్ బిల్లులతో టోకరా

- జలసౌధ ఉద్యోగులపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు

ఖైరతాబాద్: వైద్య ఖర్చుల పేరుతో తప్పుడు బిల్లులు సృష్టించి రూ.లక్షలు కాజేసిన ఇద్దరు అధికారుల వ్యవహారంపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు అందింది. పంజగుట్ట పోలీసుల కథనం ప్రకారం ఎర్రమంజిల్ జలసౌధలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డీ బన్సీలాల్ (35), ఆఫీస్ సూపరింటెండెంట్ పీ ప్రభాకర్ (38) 2010లో తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బంజారాహిల్స్, నాంపల్లి కేర్ దవాఖానల్లో చికిత్స పొందినట్లు ప్రభుత్వం నుంచి మెడికల్ బిల్లులు పొందారు. బన్సీలాల్‌కు రూ.3.91 లక్షలు, ప్రభాకర్‌కు రూ. 2.88 లక్షలు మొత్తం రూ.6.79 లక్షలు వారి ఖాతాల్లో జమయ్యాయి. ఈ అక్రమ వ్యవహారం ఆలస్యంగా ఏడాది తర్వాత బయటకు పొక్కింది. నీటిపారుదలశాఖ విజిలెన్స్ అధికారుల విచారణలో వీరు తప్పుడు బిల్లులతో ప్రభుత్వ సొమ్మును కాజేసినట్లు తేలింది. వెంటనే వారి నుంచి నగదును రికవరీ చేసి.. విధుల నుంచి సస్పెండ్‌చేశారు. కొద్దిరోజుల తర్వాత తిరిగి విధుల్లో చేరినా.. పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్న ఆరోపణలు రావడంతో ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ గురువారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

త్వరలో రాజస్థాన్‌కు డిప్యూటీ సీఎం బృందం

- అజ్మీర్‌లో రుబాత్ స్థలం కోసం సీఎం వసుంధరరాజేతో చర్చలు
- అసెంబ్లీ సమావేశాల అనంతరం పర్యటన!





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లోని ప్రసిద్ధ హజ్రత్ ఖాజా మోయినుద్దీన్ చిష్టీకి (అజ్మీర్ దర్గా) వచ్చే తెలంగాణ భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న రుబాత్ (గెస్ట్‌హౌస్) స్థల సేకరణ ప్రక్రియ ఊపందుకున్నది. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, పార్టీకి చెందిన ఇతర మైనారిటీ నేతలు స్థలాన్ని కేటాయించడంపై రాజస్థాన్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఇటీవలే సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం స్వయంగా తాను, అధికారులతో కలిసి రాజస్థాన్ వెళ్లి స్థలం విషయంలో అక్కడి సీఎం, అధికారులతో చర్చిస్తామని మహమూద్ అలీ తెలిపారు. ఒక వేళ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోతే, ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలుచేసి అక్కడ తెలంగాణ రుబాత్‌ను నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. అజ్మీర్‌లో రెండు, మూడు చోట్ల ప్రైవేట్ స్థలం అందుబాటులో ఉన్నట్టు తమకు సమాచారం వచ్చిందని, రాజస్థాన్ పర్యటన సందర్భంగా ఆ స్థలాలను తాము పరిశీలిస్తామని చెప్పారు. ఆ వెంటనే స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుని వస్తామని, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో అజ్మీర్‌లో తెలంగాణ రుబాత్ శంకుస్థాపన చేయించే ఆలోచనతో ఉన్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు.

రుబాత్ స్థల సేకరణలో రాజస్థాన్ ప్రభుత్వ జాప్యం

ఏడాది పొడవునా రాష్ట్రం నుంచి అజ్మీర్ దర్గాకు ముస్లింలతో పాటు హిందూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో అక్కడి హోటళ్లలో డబ్బులు చెల్లించి ఉండాల్సి వస్తుడటంతో వారికి ఆర్థిక భారమవుతున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఉచిత, లేదా నామమాత్రపు అద్దెపై గెస్ట్‌హౌస్ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అక్కడ రుబాత్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు మూడేండ్ల క్రితమే రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రూ. 5 కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అజ్మీర్ పట్టణంలో రుబాత్ నిర్మాణానికి ఎకరం ప్రభుత్వ స్థలాన్ని చూపించాలని, దానికి డబ్బులు చెల్లిస్తామని రాజస్థాన్ సీఎం వసుంధరరాజేకు సీఎం కేసీఆర్ లేఖ రాశారు. అనంతరం రెండు, మూడు విడుతలుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గతంలో మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేసిన సయ్యద్ ఉమర్ జలీల్ తదితరులు రాజస్థాన్ వెళ్లి అక్కడి సీఎంతో, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. తెలంగాణ గెస్ట్‌హౌస్ కోసం స్థలాన్ని తొందరగా కేటాయించాలని కోరారు. అయినా స్థలాన్ని కేటాయించడంపై రాజస్థాన్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది.

మహిళా యాత్రికులకు మరో 500 హజ్ సీట్లు

- రాష్ట్రానికి మెహరం క్యాటగిరీలో కేటాయింపు
- 20లోగా దరఖాస్తు చేసుకోవాలి: హెచ్‌సీఐ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ కమిటీ ఆఫ్ ఇండియా (హెచ్‌సీఐ) 'మెహరం' క్యాటగిరీలో రాష్ట్రంలోని మహిళా యాత్రికులకు అదనంగా 500 హజ్ సీట్లను కేటాయించింది. ఏదైనా కారణాలతో 2018 హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోని మహిళలు ఈ కోటా కింద అర్హులు. దీంతోపాటు ఆ మహిళకు తోడుగా వెళ్లే పురుషులు (భర్త, సోదరుడు, కుమారుడు) ఈ సారి హజ్‌యాత్రకు ఎంపికై ఉండాలి. 2018 హజ్‌యాత్రకు ఎందుకు దరఖాస్తు చేసుకోలేకపోయారో దరఖాస్తులో స్పష్టంగా పేర్కొనాలి. గతంలో హజ్ కమిటీ ద్వారా లేదా ప్రైవేటుగా హజ్‌యాత్రకు వెళ్లినవారు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు. మెహరం క్యాటగిరీలో మహిళా అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను కలిపి మళ్లీ డ్రా ద్వారా ఈ సీట్లను భర్తీ చేస్తామని హజ్ కమిటీ పేర్కొన్నది. పాస్‌పోర్టు కాపీ, ఇతర డాక్యుమెంట్లు, మెహరంతో (ఆ వ్యక్తితో) మహిళకు ఉన్న బంధుత్వాన్ని నిర్ధారించే పత్రాలు జతచేసి ఈ నెల 20వ తేదీలోగా హజ్ కమిటీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించింది. హజ్ దరఖాస్తుతో పాటు అవసరమైన డాక్యుమెంట్లు రెండు కలర్ ఫొటోలు, పాస్‌పోర్టు కాపీ, ఆధార్‌కార్డు కాపీ, అడ్రస్‌ప్రూఫ్, సొలమన్ డిక్లరేషన్ జతచేయాల్సి ఉంటుంది. ఇతర వివరాల కోసం 040-23298793 ఫోన్ నంబర్‌కు లేదా నేరుగా తెలంగాణ స్టేట్ హజ్ కమిటీ కార్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌ను సంప్రదించాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్‌కు వెళ్లే మహిళా యాత్రికులకు కూడా హెచ్‌సీఐ మెహరం కోటాలో 500 సీట్లను అదనంగా కేటాయించింది. ఆసక్తిగల అభ్యర్థులు 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 18004257873 నంబరులో సంప్రదించాలని ఏపీ హజ్ కమిటీ సూచించింది.




గురువారం రాష్ట్రవ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. యువతీ యవకులు, చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.హైదరాబాద్‌లోని బేగం బజార్‌లో చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తున్న దృశ్యం.

రైలులో మత్తు బిస్కెట్లిచ్చి దోపిడీ

- బంగారు ఆభరణాలు, నగదు మాయం
- 13 మందికి అస్వస్థత.. ఆరుగురి పరిస్థితి విషమం
- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఘటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైలులో ప్రయాణికులకు మత్తుమందు కలిపిన బిస్కెట్లు, కూల్‌డ్రింక్‌లు విక్రయించిన దొంగలు.. సినీఫక్కీలో దోపిడీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత యశ్వంత్‌పూర్-లక్నో ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన జరిగింది. జోధ్‌పూర్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ బోగీలో దొంగలు.. ప్రయాణికులకు మత్తు మందు కలిపిన బిస్కెట్లు, కూల్‌డ్రింకులు విక్రయించారు. వీటిని తీసుకున్న 13 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లగానే, వారివద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. అస్వస్థతకు గురైనవారిని నెల్లూరు జిల్లా గూడూ రు రైల్వేస్టేషన్ నుంచి స్థానిక ప్రభుత్వ దవాఖానలో చేర్పించామని, వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నదని రైల్వే పోలీసులు తెలిపారు. బాధితులంతా యూపీలోని లలిత్‌పూర్‌వాసులుగా గుర్తించామని చెప్పారు.



న్యూజీలాండ్ దేశం ఆక్లాండ్‌లోని సంద్రింగంలో టీఆర్‌ఎస్ శాఖ ఇచ్చిన విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న టీఆర్‌ఎస్ న్యూజీలాండ్ శాఖ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి కోసన, గౌరవ చైర్‌పర్సన్ కల్యాణ్‌రావు కాసుగంటి, జనరల్ సెక్రటరీ నర్సింగరావు ఇనగంటి, ట్రెజరర్ అఖిలేశ్వరరావు యాచమనేని, ఉపాధ్యక్షుడు రామారావు రాచకొండ, నరేందర్‌రెడ్డి పట్లోళ్ల, అరుణ్‌ప్రకాశ్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పోకల ఉన్నారు.

కుల్ఫీ ఐస్‌క్రీంలో గంజాయి!

- విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు.. మరో ఇద్దరు పరారీ

హైదరాబాద్,నమస్తేతెలంగాణ: హోలీ సందర్భంగా మద్యంషాపుల బంద్ నేపథ్యంలో కుల్ఫీలో గంజాయిని కలిపి విక్రయిస్తున్న ఓ ముఠాను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన గురువారం హైదరాబాద్‌లో జరిగింది. హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వివేకానందరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ధూల్‌పేటకు చెందిన శివలాల్‌సింగ్(40)కుల్ఫీ ఐస్‌క్రీం వ్యాపారి. మద్యంషాపుల బంద్ నేపథ్యంలో గురువారం ఐస్‌క్రీంలో గంజాయి కలిపి విక్రయించేందుకు సిద్ధమవగా పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా సంతోష్, రోహన్ పరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. కుల్ఫీలో గంజాయిని కలిపి ఒక్కోదాన్ని రూ. 50 నుంచి రూ.100 వరకు ఈ ముఠా విక్రయిస్తున్నదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఐస్‌క్రీంను తింటే దాదాపు 2 నుంచి 4 గంటల వరకు మత్తు ఉంటుందని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ అంజిరెడ్డి, సీఐ డీ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రవిచంద్రశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



బృందావన్‌లోని ప్రియాకంట్జు ఆలయం వద్ద గురువారం హోలీ వేడుకలో స్థానికులు

హోలీ కోసం 'నమాజ్' వేళల్లో మార్పు

లక్నో: హోలీ పండుగ సందర్భంగా హిందు– ముస్లింల మధ్య ఐక్యత, దేశ సమగ్రత కోసం ముస్లింలు ముందు ఉంటారని రుజువు చేసుకునేందుకు ఉత్తరప్రదేశ్‌లోని మత పెద్దలు సానుకూల నిర్ణయం తీసుకున్నారు.శుక్రవారం నమాజ్ వేళల్లో మార్పు చేస్తున్నట్లు లక్నో ఈద్గా ఇమామ్ మౌలానా ఖలీద్ రషీద్ ఫిరంగీ మహ్లీ తెలిపారు. ఈ మేరకు తమ ఈద్గాలో మధ్యాహ్నం 1.45 గంటలకు నమాజు నిర్వహిస్తామని తెలిపారు. మథురలో మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే రెండు గంటల నుంచి 2.30 గంటలకు వాయిదా వేశారని సహర్ ముఫ్తీ బర్కతుల్లాఖాన్ చెప్పారు.

కదిలే రైలులో పెండ్లి

■ పురోహితుడు శ్రీశ్రీ రవిశంకర్



న్యూఢిల్లీ: ప్రతిఒక్కరి జీవితంలో వివాహం మధుర ఘట్టం. కొందరు పెండ్లిళ్లు వినూత్నంగా జరుపుకుంటున్నారు. తాజాగా ఓ జంట కదులుతున్న రైలు లో వివాహం చేసుకున్నది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకుడు, శ్రీ శ్రీ రవిశంకర్‌ప్రసాద్ వారి వివా హం జరిపించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో–గోరఖ్‌పూర్ మధ్య నడుస్తున్న రైలులో బుధవారం ఫార్మసిస్టు సచిన్‌కుమార్, పన్నుల శాఖ ఉద్యోగిని జ్యోత్స్నసింగ్‌పటేల్ పెండ్లాడారు. 'పెండ్లి సింపుల్‌గా చేసుకోవడానికి ఇదోమార్గం. పెండ్లి సాధారణంగా జరుగాలని నా కోరిక. ఇది అందరి కీ చెప్పాలనుకున్నా. అప్పులు చేసి, లక్షలు ఖర్చుపెట్టి పెండ్లి చే యనవసరం లేదు' అని రవిశంకర్ తెలిపారు. సచిన్ యూపీలోని కౌసాంబి జిల్లా ఉధాని ఖుర్ద్ గ్రామవాసి కాగా, జ్యోత్స్న కేంద్ర పన్ను ల విభాగంలో ఉద్యోగిని. యూపీలో పర్యటనకు రవిశంకర్ తీసుకున్న ప్రత్యేక రైలులో వీరి వివాహం జరిగింది. 'భారత రైల్వే చరిత్రలో కదులుతున్న రైలులో వివా హం జరుగడం ఇదే ప్రథమం' అని రవిశంకర్ అభిమానులు ట్విట్టర్‌లో పోస్టుచేశారు.

తప్పుకున్న ట్రంప్ సన్నిహితురాలు

■ వైట్ హౌస్ పదవికి హోప్ హిక్స్ రాజీనామా



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ కమ్యూనికేషన్ల విభాగం డైరెక్టర్ మహిళ హోప్ హిక్స్ (29) ఆ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు హోప్ హిక్స్ ఎంతో విశ్వాసపాత్రురాలుగా, సలహాదారుగా ఉన్నారు. గత మూడేండ్లుగా ఆ యన కోసం పని చేశారు. ట్రంప్ అనుచరవర్గంలో మిగిలిన ఏకైక వ్యక్తి హోప్ హిక్స్ కూడా తప్పుకుంటాననడం ఆయనకు పెద్ద దెబ్బేనని భావిస్తున్నారు. ఆమె 2016లో ట్రంప్ ప్రచార గ్రూపులో చేరారు. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజ యానికి విస్తృత ప్రచారం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై అమెరికా చట్టసభ హౌస్ ఇంటలిజెన్స్ కమిటీ ముమ్మరంగా విచారిస్తున్నది. రెండు రోజుల క్రితం ఈ కమిటీ హోప్ హిక్స్‌ను 8 గంటలకు పైగా సుదీర్ఘంగా విచారించింది. విధి నిర్వహణలో తాను ఆయా సందర్భాల్లో చిన్నచిన్న అబద్ధాలాడాల్సివస్తుందని ఆమె చెప్పారు. ఆ మరునాడే రాజీనామా నిర్ణయా న్ని ప్రకటించారు. కాగా, హోప్ హిక్స్ గొప్పగా పని చేశారని, తనకు అప్పగించిన విధులు చక్కగా నిర్వహించారని ట్రంప్ ఒక ప్రకటనలో కొనియాడారు.

కేరళలో పాస్టర్ హత్య

■ కత్తితో దాడి చేసిన చర్చి మాజీ అధికారి



కొచ్చి: కేరళలోని మళయత్తూర్‌లోని కురిసుముడి చర్చి మత బోధకుడు గురువారం దారుణహత్యకు గురయ్యారు. ఫాదర్ జేవియర్ తెలక్కట్ (52)పై చర్చి మాజీ అధికారి జానీ కత్తతో దాడి చేయడంతో ఈ దారుణం జరిగిందని పోలీసులు తె లిపారు. మధ్యాహ్నం జేవియర్ కురిసుముడిలోకి ప్రవేశిస్తున్నప్పుడు అతన్ని పదునైన కత్తితో జానీ పొడిచారని పోలీసులు చెప్పారు. తీవ్రగాయాలతో బాధపడుతున్న జేవియర్‌ను అంగామలే దగ్గరలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారన్నారు. నిందితుని కోసం గాలిస్తున్నామన్నారు. కాగా, బుధవారం ఉదయం జేవియర్, జానీ మధ్య వాగ్వాదం జరిగిందని చెప్పారు. వచ్చేనెల పవిత్ర వారం సమీపిస్తుండటంతో కురిసుముడి యాత్రా కేంద్రంలో పనులు పర్యవేక్షిస్తున్న మతబోధకుడిపై ఈ ఘటన జరుగడం దురదృష్టకరమని ఓ సైరో–మలబార్ చర్చి అధికార ప్రతినిధి పేర్కొన్నారు.